2103

పారిపోయిన చిలుక

[కథానికలు]

ఆచంట శారదాదేవి

ఆచంట శారదాదేవి

పారిపోయిన చిలుక

(ఇతర కథానికలు)

ఆచంట శారదాదేవి

ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ.

ఆదర్శ ప్రచురణ :
ప్రథమ ముద్రణ
డిసెంబరు, 1963

వెల రు. 3.00

ముద్రణ :
శ్రీ విజయలక్ష్మి ఆర్టు ప్రింటర్సు,
విజయవాడ - 2.

కథాక్రమం:

1. ఈరోజు గడిస్తే --- 5
2. స్మృతి ------ 20
3. కోరికలు ----- 32
4. పారిపోయిన చిలుక - 41
5. ఆశ -------- 54
6. అందని ఆదర్శం -- 64
7. వదలిన భయం --- 71
8. గెలవని పందెం --- 85
9. వింత స్వభావం --- 95
10. అమ్మ ------ 105
11. మారిన మనిషి --- 118
12. అన్వేషణ --- 129

"ఈరోజు గడిస్తే"

"రైలు ఆగిందా?" అని, ఆదుర్దాగా అడిగాడు తండ్రి, అప్పుడే గుమ్మంలో అడుగు పెడుతూన్న కొడుకొను చూసి.

"ఆఁ!" అంటూ నీరసంగా ముభావంగా జవాబు చెప్పాడు కృష్ణారావు. మేడమెట్ల దగ్గర చెప్పులు విడిచివచ్చి హాల్లో కూర్చున్నాడు. గుండె పగిలిపోతున్నట్లనిపించింది. రెండు చేతులతో తల గట్టిగా పట్టుకున్నాడు. కాని, ఏమీ మాట్లాడలేదు. చేతుల్లో కాగితాలు సరిచూసుకుంటూ తండ్రి లేచి మేడమీదకు వెళ్ళాడు. హాల్లో గడియారం ఎనిమిది కొట్టింది.

కృష్ణారావు అప్పుడే భార్య కుముదాన్ని రైలెక్కించి వచ్చాడు. కుముదం పురిటికి పుట్టింటికి వెళ్ళుతోంది. అంటే ఇంకా ఆరు నెలలదాకా తిరిగి రాదన్నమాట. ఈ ఆరు నెలల్లో తనకి సెలవుదొరికి తను కుముదాన్ని చూడటానికి వెళ్ళగల్గుతాడన్న ఆశ అతనికేమీ లేదు. ఒక్కరోజు సెలవడిగినాసరే, అతని మేనేజరు ముఖం అదోలా పెట్టుకుంటాడు. అంచేత అసలతనికి సెలవడగాలనే అనిపించదు.

పెండ్లయిన ఈ ఆరేళ్ళలోనూ ఇన్నాళ్ళు కుముదాన్ని విడిచివుండవలసిన అవసరమెప్పుడూ కలుగలేదు. పుట్టింటికెప్పుడైనా ఒక్కత్తె వెళ్ళినా, వెళ్ళిన అయిదారు రోజులకే మళ్ళీ తిరిగొస్తుండేది. ఈసారి ఎందుకో అతనికి చెప్పలేని

బెంగపెట్టుకున్నది. కుముదం ఒక్కతె వెళ్ళిపోగానే ఇల్లంతా బావురుమంటున్నది. హాల్లో కూర్చున్న అతనికి లోపలనుంచి కుముదం గొంతు సన్నగా వినబడుతున్నట్లే వున్నది.

ఏమీ తోచక, బల్లమీద పేపరు తీసుకుని చూడడం మొదలెట్టాడు. ఒట్టినే కూర్చోలేక పత్రిక ముఖానికడ్డం పెట్టుకోడం! చూపులు వార్తలమీదే వున్నా ఆలోచనలు మాత్రం ఎక్కడెక్కడికో పోతుంటాయి.

హృదయంలో నిండుకొన్న ఈ శూన్యత ... వేయి సూదులు గుచ్చుకొంటున్నట్లున్న ఈ బాధ ... ఇది మరచి పోవడం యెలా? ... ఈరోజు గడిస్తే ఈ బాధ అలవాటు కావచ్చు, అమితమైన ఆవేదన కలిగినప్పుడల్లా అతను అల్లాగే అనుకుంటూ వుంటాడు. ఈ ఒక్కరోజు గడిస్తే! ఈ ఒక్క రోజు ఈ బాధ ఓర్చుకోగలిగితే! రేపు ఈ బాధ ఇంత తీవ్రంగా వుండదు.

ఎంత తీవ్రమైన బాధకైనా మనిషి క్రమంగా అలవాటుపడిపోతాడు. ఓర్చుకోగల్గుతాడు. లేకపోతే అసలు జీవించనేలేడేమో! అదే అతని నమ్మకమూ, అనుభవమూ. కాని, ఈ ఒక్కరోజు మాత్రం!

అతనికి ఏమిటేమిటో జ్ఞాపకం రాసాగినవి. ఎప్పుడో ఎవడో గోసాయి, వద్దంటుంటే, బలవంతంగా, చేయి చూసి చెప్పాడు:

"నీ భార్యకి తొలికాన్పు గండం, జాగ్రత్తగా వుండాలి. తాయెత్తు కట్టించుకుంటావా?" — అని.

అప్పుడతను వినిపించుకోలేదు. కాని, ఆ మాటలే ఇప్పుడు జ్ఞాపకం వచ్చి, గుండె అదురుతోంది. తనకి జాతకాల్లో నమ్మకం వుందని కాదు, అయినా...అయినా...

కుముదం వెళ్లేటప్పుడు సంతోషంగా వెళ్ళివుంటే తనకింత బాధగా వుండేది కాదు. ఇంత బెంగపడేవాడు కాదు. ఆఖరికి కుముదం తనమీద కోపం గట్టిగా ప్రకటించి చీకాకు పడినా, తనకింత బాధవుండేది కాదు. అందరు ఆడవాళ్ళలాగా గట్టిగా నోరుచేసుకొని కంట తడిపెట్టుకొనివుంటే, అందరిలాగే ఏ కొత్త చీరో, రవికో, కొని ఆమనుగున ఆమెను సముదాయింపగలిగుండేవాడు. కాని, కుముదానిదా పద్ధతి కానేకాదు. పల్లెత్తుమాట అనకుండా, కళ్ళతోనే మనిషిని ఆనువేలమైళ్ళ దూరంలో వుంచడం ఆమెకే చేతనవునేమో!

నిన్నమాత్రం ముక్తసరిగా మూడేమాటలు మాట్లాడినది. ఆఫీసులో అంతా కలిసి సినిమాకి వెళ్ళాలనుకున్నారు; వెళ్ళారు. తనూ వెళ్ళాడు. తను రానన్నా, వాళ్ళు వినిపించుకోలేదు. వెళ్ళక తప్పలేదు.

రాత్రి పదిగంటలకి ఇంటికి వచ్చేసరికి తను అనుకున్నట్లుగానే కుముదం ఒక్కర్తె, తనకోసం కనిపెట్టుకున్నట్టు కూర్చుంది. ఇంట్లో చెప్పకుండా వెళ్ళడం తనకెప్పుడూ అలవాటు లేదు. కంగారు పడతారేమోనని అనుకుంటూనే వున్నాడు. వెళ్ళగానే కుముదం కంగారుగా "ఎక్కడికి వెళ్లారు? ఎందుకింత ఆలస్యం?" అని గబగబ ప్రశ్నలు వేస్తుందనుకున్నాడు. కాని కుముదం ఏమీ తోణకలేదు.

"వడ్డించనా? - ఏమైనా ఆలస్యం ఉందా?" అని మాత్రం అన్నది.

"అబ్బే - ఏం లేదు ... వస్తున్నాను. ఆకలి లేదు గాని ...!" అని తొత్తొరంగా అంటూ లోపలికి వెళ్ళాడు.

భోజనంచేసేప్పుడు కూడా ఆమె ఏమీ మాట్లాడ లేదు. ఊరికే కావలసినవి వడ్డిస్తూ ఊరుకుంది. ఆ మౌనం లోనే ఆతనికి అర్థమౌతూంది: తుఫాను రేగిందని. ఉండబట్ట లేక తనే మొదలెట్టాడు ఉపోద్ఘాతం:

"ఆఫీసులో అంతా సినిమాకి వెళ్తుంటే నేనూ వెళ్ళాను. బలవంతం చేశారు. 'మొన్న ఒకతనికి ఏదో ప్రైజొచ్చిందిలే. అతను అందరినీ తీసుకువెళ్ళాడు" అన్నాడు.

కుముదం జవాబు చెప్పలేదు, కావలసినదేమో వడ్డించి మాట్లాడకుండా లోపలికి వెళ్ళింది. అయిదునిమిషాల తరు వాత ఓ చిన్న ప్రశ్న వేసింది:

"పద్మజ కూడా వచ్చిందా?"

"ఆఁ!" అని ముభావంగా అన్నాడు. ఈసారి అతనికి కోపం వచ్చింది. ఏమిటా ప్రశ్న! పద్మజ తన ఆఫీసులో పని చేయటం తన తప్పా? అందరూ వెడుతోంటే ఆమెను మాత్రం రావద్దని తానెలా చెప్పుతాడు? కోపంతో రెండు ముద్దలు గబగబ మింగేశాడు. ఏం మాట్లాడలేదు. లేవబో తుంటే ఆమె అన్నది:

"మా నాన్న వచ్చారు. రేపు పొద్దున్నే వెళ్ళు తున్నాము. మీకు తెలుసునుగా?"

అతని గుండె గతుక్కుమన్నది. ఆమె మాట్లాడిన మూడు మాటల్లోని ధ్వని అతని కర్థమైంది. "నేను రేపు వెళ్ళిపోతున్నాను. మళ్ళీ ఇప్పట్లో రానుగదా ఈ ఒక్క రోజు ఎందుకు ఆలస్యంగా రావాలి? నాకు ఇష్టంలేదని తెలిసి పద్మజతో ఎందుకు వెళ్ళాలి?" అని ఆమె మౌనం ప్రశ్నిస్తున్నది.

దీనికి తను సంజాయిషీ చెప్పుకోగలడు. తను కావాలని వెళ్ళలేదుగదా! కాని, ఆమె జవాబు చెప్పే అవకాశం ఎప్పుడూ ఇయ్యదు. ఎప్పుడూ అంతే!

"తమలపాకులు వేసుకుంటారా?"

"అక్కర్లేదు"

—అంతే. ఆ రాత్రి అంతటితో ముగిసింది.

తెల్లవారి పెట్టెసర్దుకుంటూ ప్రయాణ సన్నాహంలో వుండిపోయింది ఆమె. ఆ రేళ్ళబట్టి ఎరిగున్న మనిషి తననింత మాత్రం అర్థంచేసుకోలేకపోయిందన్న బాధతో అతనుండిపోయాడు. వెళ్లేటప్పుడు కూడా, ఆమె అతనిని పలకరించ లేదు. మామగారు మాత్రం, బండీ అదీ సిద్ధంచేయించి, తనతో చెప్పాడు.

"వెళ్ళివస్తాం నాయనా! సెలవు దొరికితే ఓసారి రావాలి" అని.

కృష్ణారావుకి ఏమీ తోచలేదు. అప్పుడే అతని హృదయంలో ఏదో శూన్యత ఆవరించుకున్నది. "ఉండండీ నేనూ వస్తాను స్టేషనుదాకా!" అన్నాడు. తొందరగా ఒక్క అంగలో వంకెన చొక్కా తీసుకొని, తనూ బండి ఎక్కాడు.

స్టేషనులోనైనా కుముదం మౌనం వదలి చిరునవ్వుతో వీడ్కోలంటుందేమో ననుకున్నాడు. ఆమె పలకకపోయినా తనే పలకరించి సంతోషంగా ఆమెను సాగనంపాలనుకున్నాడు. కాని అల్లా ఏమీ జరుగలేదు. స్టేషనులో అడుగు పెడుతూనే ప్రకాశరావు ఎదురైనాడు.

"ఏమోయి! ఇల్లా వచ్చావు? ఓహో! మీ ఆవిడ పుట్టింటికెడుతోందేమిటి? ఆయన మీ మామగారా?" అని అందుకున్నాడు. ఇక ఆ తరువాత రైలు కదిలేవరకు తనని వదలనే లేదు.

"నెహ్రూ వస్తాడుటగా – ఎల్లుండి?"

"ఊ! వస్తాడు కాబోలు" ఇప్పుడా సంగతి ఎవరికి పట్టింది. కాని, ప్రకాశరావు మాత్రం విడిచిపెట్టలేదు. అదే ధోరణిలో రాజకీయాలు మాట్లాడుతూ, తన అభిప్రాయాలు చెబుతూ గడిపేశాడు. ఆఖరికి రైలు కదలబోతుండగా తనే తప్పించుకుని ఎల్లాగో కుముదం పెట్టెదగ్గరకి చేరుకున్నాడు. అంతకు ముందే కొన్న మల్లిదండ ఒకటి ఆమె చేతికిచ్చాడు. ఆమె పువ్వులు అందుకుని బల్లమీద పెట్టేసింది. వాటికేసి చూడలేదు ... రైలు కదిలిపోయింది.

అంతే! అదే బాధ. ఆమె తనమీద నిష్ఠూరం మోపి, మౌనంగా వెళ్ళిపోబట్టి తనకి హృదయంలో ఏదో శూలం గ్రుచ్చుకొన్నట్లు ఇంత బాధ! మామూలుగా నవ్వుతూ, కబుళ్లు చెప్పుతూ వీడ్కోలనిస్తుంటే ఇంత బెంగవుండేది కాదు. కాని ఏం జేస్తాడు! ఆమె స్వభావమే అంత. ఈ కాస్సేపూ గడిచిపోతే ఇంక ఇంత బాధవుండదు. రేపు ఆమె

మనస్సు మారవచ్చు. ఆమె ఉత్తరం వ్రాయవచ్చును. కాని ఇవ్వాళ, ఈ కాస్సేపు ఈ బాధ. ఓర్చుకోవడం ఎట్లా?

ఆశ్చర్యం! ఆరేళ్ళ క్రిందట ఇల్లాగే అసలు మళ్ళీ కలుసుకుంటామన్న ఆశకూడా లేకుండా, విడిపోతున్నప్పుడు కూడా, ఆమె ఇదే విధంగా ముక్తసరి మాటలతో మౌనంగా అతన్ని పంపించివేసింది.

"మీ నాన్న కట్నంలేని పెళ్ళికి ఒప్పుకోరుగా?" అన్నది అంతే!

ఆ ఎత్తిపొడుపుతో మళ్ళీ పల్లెత్తుమాట అనకుండా సాగిపోయింది. నిజమే! అప్పట్లో తండ్రికి ఎదురు తిరగగలుగు తాననే ధైర్యం అతనికి సుతరామూ లేదు. అందుకనే ఆమె వ్యంగ్య వాక్యాలకి నోరు మెదపలేక బాధపడుతూ ఊరు కున్నాడు. అయితే అదృష్టం బాగుండి అటు తరువాత అన్ని సమస్యలు, వాటంతటవే, విడిపోయినాయి. తాను ఆఖరికి కుముదాన్ని పెళ్ళిచేసుకోగలిగాడు.

కాని, ఆవేళ ఆమె అతన్ని పంపించివేసినపుడెంత పరితపించాడో, ఈరోజు అంతే బాధపడుతున్నాడు. అప్పు డేమని తనకు తానే ఓదార్చుకున్నాడో ఇప్పుడూ అదేమాట అనుకుంటున్నాడు: ఈ రోజు గడిస్తే!

అబ్బ! తల పగిలిపోతోంది. ఒక కప్ కాఫీ తాగితే! హాయిగా కాఫీ త్రాగి సిగరెట్ కాలిస్తే! అన్ని బాధలకీ అతనికి తెలిసిన మందు అది ఒక్కటే. చేతిలో పేపరు బల్ల మీద పారేసి జేబులో సిగరెట్టు పెట్టె తడుముకుంటూ లోప లికి వెళ్ళాడు. మండువాగదిలో లక్ష్మి కూర్చుని చదువు

కుంటోంది. చుట్టూ పుస్తకాలు పడివున్నాయి. నిద్రలేక కళ్లు ఎర్రబడినట్లున్నాయి. పుస్తకం చూసి, నోటుబుక్కులో ఏమిటో రాసుకుంటోంది.

"లక్ష్మీ! ఒక కప్ కాఫీ చేసిపెడతావా?" అని అడుగుతూ ఎదురుగా వెళ్ళి గడపమీద కూర్చున్నాడు.

"బాబోయ్! ఇప్పుడు నావల్లగాదు; నాకు మధ్యాహ్నం పరీక్ష వుంది తెలుసా!" అంది. మళ్ళీ జాలిపడి "వెళ్ళి అమ్మనడుగు" అన్నది.

"మధ్యాహ్నం పరీక్షయితే, ఇప్పుడు కాఫీ చెయ్యటానికేం?" అన్నాడు వెటకారంగా.

"సరేలే! చదువుకోఖ్ఖర్లేదాయేం! ఇవ్వాళేగా! ఈ ఒక్కరోజు గడిచిపోతే రేపటినుంచి ఏబాధా లేదు ... పరీక్ష ముందర యెల్లా వుంటుందో ఏమన్నా తెలుసా నీకు? సరిగ్గా నూట ఆరు డిగ్రీల జ్వరం వచ్చినట్లుంటుంది" అన్నది బడాయిగా.

కృష్ణారావు నవ్వుకున్నాడు. తనకేం తెలుసు! పరీక్ష అంటే ఏమిటో తెలియకుండానే ఎమ్. ఏ. బి. ఎల్. ప్యాసైనాడుగదూ!

లక్ష్మి మళ్ళీ అన్నది. "అన్నయ్యా! ఈ లెక్క కొంచెం చేసిపెడతావా? ఎంత తంటాలుపడ్డా రావడంలేదు".

"అమ్మయ్యో! నేను లెక్కలు వదిలిపెట్టి చాలా రోజులైంది. నన్ను చంపకు" అన్నాడు. లక్ష్మి నవ్వుతో, తన పుస్తకాల్లో మునిగిపోయింది. అతను సిగరెట్ ముట్టిద్దామా, వద్దా అని ఆలోచిస్తూ అట్లాగే కూర్చుండిపోయాడు.

ఉన్నట్టుండి, ప్రక్క ఇంటినుంచి సంగీతం వినిపించింది. "సస రిరి గగ మమ..." హార్మోనియమ్ మ్రోగుతోంది. లక్ష్మికి వెర్రె త్తినట్లయింది.

"అబ్బబ్బా! ఈ అమ్మాయి సరిగా రోజూ నేను చదువుకునేటప్పుడే మొదలెడుతుంది" అని విసుక్కున్నది.

"సరేలే, బాగానే వుంది. పాపం! ఆ అమ్మాయి నేర్చుకుంటోంది" అన్నాడు అతను నవ్వుతో.

"ఊ... ఇవ్వాళ ఒక్కరోజు ఊరుకోకూడదూ? అయినా ఆ అమ్మాయికి సంగీతం వస్తుందన్న ఆశ నాకేమీ లేదు" అన్నది కటువుగా.

"సరే! నీవు పరీక్ష అవుతావన్న ఆశగూడ ఆ అమ్మాయికేమీ లేదేమో!" అన్నాడు అతను కొంటెగా.

లక్ష్మి చురచుర చూసింది. అతను నవ్వుకుంటూ, వంట ఇంటివేపు వెళ్ళాడు.

'అమ్మా!'

తల్లి పోపుల పెట్టెలో దేనికోసమో తడుముకుంటున్నది. వంటిల్లు అంతా చిందరవందరగా, అరణ్యంలాగా వుంది. అమ్మ ముఖం అలసిపోయి వాడినట్లున్నది. మండని పొయిలోనుంచి పొగ గది అంతా వ్యాపిస్తున్నది. అతనిని చూడగానే ఆవిడ కంగారుపడుతో అన్నది. "అప్పుడే టైమయిందా ఏంరా నాయనా!"

"అబ్బే ... లేదమ్మా!"

జిగినా పజిల్‌లా వున్న ఆ వంటిల్లు, అలసిపోయిన ఆమె ముఖము చూడగానే "నాకో కప్ కాఫీ కావాలి చేసి

పెట్టు"మని అడగటానికి అతనికి నోరు రాలేదు. అమ్మకేసి జాలిగా చూస్తూ వుండిపోయాడు.

"రామాయమ్మ రాలేదా అమ్మా?" అన్నాడు.

"లేదురా ... వాళ్ళబ్బాయికింకా జ్వరం తగ్గలేదుట. రేపు వస్తానన్నది" అని పోపు వేయిస్తూ చెప్పింది తల్లి.

"అయిపోయింది. ఇంకో అయిదునిమిషాల్లో వడ్డిస్తాను" అని మళ్ళీ అన్నది.

కృష్ణారావుకి తల్లిమీద అపరిమితమైన ప్రేమ, జాలి, ముంచుకొచ్చినాయి. పాపం, ఈ సంసారభారం నెత్తిన వేసుకుని ఎన్నాళ్ళనుంచి ఎంత కష్టపడుతున్నది. అయినా ఆమెకు తాను ఏవిధంగానూ సహాయంచేయలేకపోతున్నాడు. ఏవిధంగాను ఆమె శ్రమ దూరంచేయలేదు. నిస్సహాయంగా తల్లి కేసి చూశాడు. తల్లి కొడుకుభావం గ్రహించింది. సముదాయిస్తున్నట్లన్నది:

"ఇవ్వాళ ఒక్కరోజే గదరా! ఈ ఒక్కపూటా! గడిస్తే రేపు రామాయమ్మ తప్పకుండా వస్తుంది."

కృష్ణారావు ఏం మాట్లాడలేదు. మెల్లిగా అడుగులు వేస్తూ అక్కడినుంచి వెళ్లిపోయాడు. మనస్సు ఇంకా కలత పడుతూనే వుంది. కుముదం ఇంత పట్టుదల మనిషని అనుకోలేదు!

బల్లదగ్గర కూర్చుని పరధ్యాన్నంగా, ఆరోజువచ్చిన ఉత్తరాలు చూడడం మొదలెట్టాడు.

ఇంతలో, విశ్వపతి వచ్చాడు. గబగబ మోపెడు కాగితాల కట్టలు తీసి విసురుగా బల్లమీద పారేసి అతని

ప్రక్క కుర్చీలో చతికిలపడ్డాడు. ఆ వాలకం చూసి కృష్ణారావుకు నవ్వొచ్చింది.

"ఏమిటీ అంత ఆయాసపడుతున్నావ్ ?" అని ప్రశ్నించాడు.

విశ్వపతి విసుక్కుంటూ జవాబు చెప్పాడు :

"ఏముందీ! మేనేజరుగారు సాయంకాలం బండిలో బెంగుళూరు వెళుతున్నారు. ఈ కాగితాలన్నీ ఇవ్వాళే సరి చూసి ఆయన చేత సంతకం పెట్టించుకోవాలి!" అన్నాడు.

"ఓహో! అదా!" అన్నాడు కృష్ణారావు.

ఒక్కనిమిషం ఊరుకుని మళ్ళీ అన్నాడు విశ్వపతి - "పోనిద్దూ, ఇవ్వాళ కాస్త పడితే, ఆయనెల్లాగు ఊరికెడుతున్నాడుగదా! ఇంకా పదిహేనురోజులుదాకా - హాయిగా నిద్రపోవచ్చు... ఈరోజు కాస్తాగడి స్తే" అంటూ, తన్నుతాను ఓదార్చుకున్నాడు.

"అయితే. ఎందుకూ ఇప్పుడు మేనేజరు బెంగుళూరు వెళ్ళడం ?" అని కుతూహలం లేకపోయినా, ఏదో అడగాలని అడిగాడు కృష్ణారావు.

"ఎందుకేమిటోయ్ ! ఆయనకేం - సరదాగా తిరిగొస్తాడు. శృంగార పురుషుడు" అన్నాడు విశ్వపతి వ్యంగ్యంగా.

మేనేజరు ప్రస్తావన వచ్చినప్పుడల్లా వ్యంగ్యంగా మాట్లాడడం ఆఫీసులో అందరికీ అలవాటే. ఆయన చరిత్ర అంత మంచిదిగాదని అనుకోడంలో అందరికీ, ఒకవిధమైన తృప్తి. ఒకవేళ ఆయనక్రింద పనిచేయవలసివచ్చిన ఖర్మానికిది ఒక విధమైన ప్రతీకారమేమో!

కృష్ణారావుకి మాత్రం ఇటువంటి సంభాషణ ఎప్పుడూ నచ్చదు. అతను విశ్వపతి మాటలు విననట్లు ఊరుకున్నాడు. ఆ కాగితాల కట్టలలో తనవంతు కాగితాలు తీసుకొని అందులో మునిగిపోయాడు.

సాయంత్రం సముద్రపు ఒడ్డునుంచి సైకిలుమీద ఇంటి త్రోవ పట్టాడు. పౌర్ణమి కావటంచేతనేమో, ఎగసి ఎగసి పడే అలల హోరు భయంకరంగా ఎంత దూరానికో వినిపిస్తున్నది. గాలి జోరుగా వీస్తున్నది. సైకిలు వంకర్లు తిరుగుతోంది గాని, ఆ చల్లగాలికి అతని హృదయం కొంత చల్లబడ్డది.

ఇంటికి వచ్చి, గేటు తీసి సైకిలు లోపల పెడుతోంటే, అనంతాచార్యులుగారెదురుపడ్డాడు - మందుల సంచితో సహా, కృష్ణారావు కొంచెం ఆగి అన్నాడు:

"ఏమండీ, ఎట్లావుంది తాతయ్యకి?"

అనంతాచార్యులుగారు, గంభీరంగా ఆలోచిస్తూ అన్నారు: "ఇవాళ మాత్రం కొంచం బలహీనంగా ఉన్నారు. మందు ఇచ్చాను. ఇవ్వాళ కాస్త గడిస్తే ఇంకేం ఫరవాలేదు. అయినా కాస్త జాగ్రత్తగా వుండండి. రేపు మళ్ళీవచ్చి చూస్తాను"- అంటూ సంచీ ఊగించుకుంటూ సంతృప్తితో వెళ్ళిపోయాడు.

కృష్ణారావు ఏమీ కంగారుపడలేదు. ఇది మామూలే. అనంతాచార్యులు, 'ఇవ్వాళ జాగ్రత్తగా వుండండి. ఇవ్వాళ కాస్త గడిస్తే-' అంటూనే మూడేళ్ళనుంచి గడుపుకు వస్తు

న్నాడు. అయినా సైకిలు లోపల పెడుతూనే తాతయ్య దగ్గరకు వెళ్ళాడు.

"ఏం తాతయ్యా! ఎల్లా వుంది.?"

"ఏదో వుంది. ఎట్లావుందేమిటి?" అంటూ తాతయ్య నిస్సారంగా జవాబు చెప్పాడు. కృష్ణారావు అక్కడే మంచం దగ్గర కూర్చున్నాడు. ఏవో కబుర్లు చెబుతూ, కాస్సేపటికి తాతయ్య అన్నాడు:

'మనుమరాలు ఊరికి వెళ్ళినట్లుందే? ఇంట్లో ఏమీ సందడిలేదు!' కృష్ణారావుకి మళ్లా ఒక్కసారి బెంగ ముంచుకొచ్చింది. ఇల్లంతా బావురుమన్నట్లు తోచింది. తాతగారి ప్రశ్నకు సమాధానంగా "ఆఁ" అంటూ అక్కడినుంచి లేచి వెళ్ళిపోయాడు.

స్నానంచేసి డాబామీదకు వెళ్ళాడు. అప్పుడే ప్రొద్దు వాలుతోంది. పడమటివేపు కందగడ్డలాంటి సూర్యబింబం మబ్బుల్లోంచి సగంమాత్రమే కనిపిస్తోంది. ఆకాశమంతా 'ఈరోజు అయిపోతోం'దని ఎర్రని సిరాతో వ్రాసినట్లుంది. నిలువుగా ఎదిగిన కొబ్బరచెట్లమీద ఎర్రని కాంతి మిలమిల మెరుస్తున్నది. ప్రశాంతమైన ఆ సంధ్య మనస్సుకేదో హాయిని చేకూరుస్తున్నది.

ఆశ్చర్యం! ఎంతమంది ఈ రోజు గడిచిపోవాలని కనిపెట్టుకు కూర్చున్నారు! ప్రొద్దుటినుంచి ఎంతమంది నోటి నుంచి అదే మాటలు విన్నాడో! పరీక్ష వ్రాయలేక లక్ష్మి, పని చేసుకోలేక అమ్మ – అందరికీ ఒక్కటే ఆలోచన వెర్రి గాని ఈరోజు గడిచిపోతే, ఇంకో రోజు రాదూ? ఈ పరీక్ష

అయిపోతే ఇంకో పరీక్ష రాదుగాబోలు! అతనికి నవ్వొచ్చింది.

కుముదం వెళ్ళిపోయిన బెంగ అప్పటికతనికి కొంచెం అలవాటయింది. ప్రొద్దున్న సూదిమొనలా గ్రుచ్చుకొని వేధించిన బాధ అప్పుడు బండబారి మనస్సు కొకవిధమైన నిర్వికారత కలిగించింది.

చూస్తుండగానే, ప్రొద్దువాలి, చీకటిపడి, వెన్నెల వచ్చింది. వెన్నెట్లో ఆకాశాన తెల్లని మబ్బులు దూదిపిందెల్లా అటూ ఇటూ కదులుతూ ఒకదాని నొకటి హత్తుకొంటు న్నాయి. ఇందాకటి సంధ్య బాగున్నదో, ఇప్పటి వెన్నెలే బాగున్నదో, కృష్ణారావు నిర్ణయించుకోలేకపోయాడు. కాని, ఈ రాత్రి గడిచిపోతుంది. చూస్తూవుండగానే తెల్లవారి పోతుంది. మళ్ళా ఉదయిస్తోన్న సూర్యుడు ఎదురౌతాడు.

అతనికి విచారమేసింది. అమ్మో! ఇంత అందమైన రోజు గడిచిపోతుందా!!

క్రిందనుంచి తల్లి కేకేసింది. "నాయనా! టెలిగ్రాం వచ్చింది!" గబగబ క్రిందకు వెళ్ళి టెలిగ్రాం విప్పి చూసు కున్నాడు. "ఏం లేదమ్మా, మీ కోడలు సుఖంగా చేరిందట అంతే!" అని ఆతృతగా ఎదురుచూస్తున్న తల్లితో చెప్పి మళ్ళా మేడపైకి వెళ్లాడు.

"ఇప్పటికి ఆతని మనస్సు నిర్మలమైన సరస్సువలె ఉపాంగింది. కుముదం టెలిగ్రాంలో మూడు ముక్కలే ఉన్నాయి. "కులాసాగా చేరాను — ఉత్తరం రాస్తారా?"

అంతే. కాని, అప్పుడామె ఆరు పేజీలు వ్రాసినా ఆతని కంతకంటె ఎక్కువ ఆనందం కలిగివుండేది కాదు.

అతని కాతుణంలో ఆమెమీద ప్రేమ కట్టలు త్రెంచుకు పొంగి వచ్చింది. సంతోషంతో కన్నులు మూతపడ్డాయి. అల్లాగే నిద్రపోయాడు.

ఆ నిద్రలో, ఆనందంలో, ఆ రోజు గడిచిపోయింది.

స్మృతి

కాలేజీగంట కొట్టి అప్పుడే అయిదు నిమిషాలైంది. క్లాసంతా నిశ్శబ్దంగా ఉంది. ముక్కుమీద కళ్లజోడు సరిచేసుకొంటూ చేతిలో పుస్తకం తెరవబోయ్యాడు ప్రొఫెసర్. అకస్మాత్తుగా, అతని దృష్టి ఎదటి బెంచిమీదకి పోయింది. ఎదురుగా ఒక అమ్మాయి క్లాసులో నిలబడి ఉంది. తెల్లచీర కట్టుకుంది. సన్నగా లేతతమలపాకులాఉంది. ప్రొఫెసర్ కేసి బెదరుచూపులు చూసింది. సుమారు పద్దెనిమిది ఏండ్ల క్రితం అదే రూపంలో ఓ పిల్ల మందహాసంతో తన కేసి చూస్తూ ఉండేది. కాని, అది అంతా స్వప్నం; ఎప్పుడో కరగి చెదరి పోయిన ఘట్టం. స్వర్గలోకంనుంచి దేవతలు దిగివస్తారా!

'నాపేరు పిలువలేదు'_ అంటూ, కోకిల పలికినట్లు ఆ పిల్ల అటెండెన్సు జ్ఞాపకంచేస్తూ అన్నది. క్లాసంతా సన్నగా ముసిముసి నవ్వులు నవ్వుతోంది.

'కొత్తగా చేరావా?' అని, పరధ్యానంలోంచి బయటికొస్తూ ప్రొఫెసర్ అడిగాడు.

ఆయన క్లాసులో ఆడపిల్లలు చేరటం అదే మొదటి సారి. ఆ ఉన్న మొగపిల్లలమీద ఆయనకు శ్రద్ధలేదు. కోతి వెధవలకు ఏంచెప్పినా ఒక్కటే! కొందరికి నిద్రవొస్తే, కొందరికి అంతులేకుండా కబుర్లువస్తాయి. ఎవరికైనా, శ్రద్ధ ఉంటే, వాళ్లకి పాఠంచెప్పకపోయినా ఫరవాలేదు. వాళ్లే స్వంతంగా చదువుకోగలరు. అందుకే, ఆయన క్లాసుమీద

ఎక్కువ దృష్టి ఉంచడు. ఆయన గొడవలో ఆయన ఉంటాడు. అందుకే అవ్వాళ ఆ పిల్ల క్లాసులో ఉన్నదే ఆయన గమనించలేదు.

ఆపిల్ల ఆయన ప్రశ్నకి సమాధానంగా తల-ఊపింది.

'నీపేరు ?' అని మళ్లా అడిగాడు ప్రొఫెసర్.

'సుహాసిని' అన్నది ఆ అమ్మాయి అవ్యక్త మధుర కంఠంతో. ప్రొఫెసర్ పేరు వ్రాసుకొని పాఠం ప్రారంభించాడు:

'అశోకుడు కళింగయుద్ధానంతరం విరక్తిజెంది' అశోకుడికి ఆసమయంలోకలిగిన విరక్తినిగురించి ఉపన్యసించడంలో ప్రొఫెసర్‌కు అంతులేని విరక్తి పుట్టుకొచ్చింది. పాఠంమీద మనస్సు లగ్నంకాలేదు. మాటిమాటికి చూపులు తనకి తెలీకుండానే, ఆ పిల్లవైపుకి వెళ్లుతూ ఉండడం చికాకు కలిగించింది. చూడగా చూడగా, శాంతకీ, ఆ పిల్లకీ ఉన్న పోలికచూస్తే కాళ్లు వణికి, గుండెలు కొట్టుకోసాగినవి. పద్దెనిమిది ఏళ్ళ తేడాలేకపోతే, జరిగిన కథ ఆవిధంగా జరిగి ఉండకపోతే, నిజంగా శాంతే వచ్చింది అనుకునేవాడు.

అంతలోనే ఆప్రక్క బెంచిలోనే కూర్చున్న నాగేశం, తన చూపులకి విపరీతార్థం కల్పించుకొని వ్యంగ్యంగా నవ్వడం చూస్తే ప్రొఫెసర్‌కు అసహ్యంవేసింది. పుస్తకం మూసి, 'ఇవ్వాళిటికి చాలు!' అంటూ బయటికి నడిచాడు.

ప్రొఫెసర్‌ది ఏవూరో అక్కడెవరికీ సరిగా తెలియదు. పదిహేను ఏళ్ల క్రిందట మలబారుప్రాంతమునుంచి అతను అక్కడకు వచ్చిచేరాడు. అప్పటికి అతనికి పాతికేళ్లు.

భయంగా, కొంచం విరక్తిగా ఉండేవాడు. అటు తరువాత ఆ కాలేజీలో, అక్కడే పాతుకుపొయ్యాడు. ఎప్పుడూ ఆయన తిరిగి స్వదేశం వెళ్లినట్లు కనిపించదు. ఆయన జీవితం నిర్మలంగా, ఒడిదుడుకులు లేని ప్రవాహంలాగ గడచిపోయింది. ఆ కాలేజీలో ఆయనకి పదిహేను ఏళ్ల సర్వీసు అయింది. అంతే, ఆయన తననిగురించి చెప్పుకోవాలంటే విశేషం ఏమీలేదు. ప్రపంచాన్ని కల్లోలపరచే సమస్యలేవీ అతను పరిష్కరించలేదు. ఆయన జీవితంలో ఎప్పుడూ ఓ చిన్న గాలిదుమారమైనా చెలరేగినట్లులేదు. ఆ కాలేజీకి సంబంధించిన వాళ్ళందరికీ ఆయన ప్రొఫెసర్, అంతే. అంతకన్న ఆయనను గురించి యెవరికీ యేమీ తెలియదు. కొందరు మాత్రం, ఆయనను తక్కిన ప్రొఫెసర్లతో వేరుపరచడానికి 'కళ్ళజోడు ప్రొఫెసర్' అని ప్రత్యేకించి చెప్పేవారు. అంటే, కళ్ళజోడు ఇంకెవరికీ లేదనికాదు. ఎందుకో, ఆ పేరు ఆయనకి అతుక్కుపోయింది.

ప్రొఫెసర్ ఇంట్లో తానూ, నౌకరివాడు తప్ప ఇంకెవరూ లేరు. ఆయన ఇల్లు శుభ్రంగా పెట్టుకునేవాడు. చక్కగా బల్లమీద ఫ్లవర్ వాస్, ఓపక్క పుస్తకాలు, మరోప్రక్క సోఫాలు. అక్కడక్కడ గోడలమీ మంచిమంచి బొమ్మలు, అన్నీ తీర్చినట్లు ఉండేవి. కాలేజి లేనిసమయంలో ప్రొఫెసర్ తరుచు ఇంట్లోనే ఉండేవాడు. ఎప్పుడూ ఏదో చదువుతూ ఉండేవాడు. ఆయనకి ఎక్కువమంది స్నేహితులు లేరు. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడడం ఆయనకి అలవాటులేదు. పొద్దున సాయంత్రం ఒంటరిగానే ఏదో పుస్తకం చేతబట్టుకొని

ఎంతోదూరం ఒక్కడే నడచి వస్తుండేవాడు. క్రమం తప్పకుండా ప్రతి వేసంగికి ఏదో చల్లని ప్రదేశానికి వెళ్ళివస్తుండేవాడు. అంతే, ఆయన జీవితక్రమం. క్రమక్రమంగా రోజులు ఒకదాని నొకటి తోసుకొని ముందుకువచ్చి జరిగిపోతున్నాయి. గమ్యస్థానం ఎక్కడో! ఎప్పుడో! అక్కడ మిగిలేదేమిటో !!

అందరికీ ఆయనను చూస్తే గౌరవమే. ఆయనిదేదో వింత ప్రకృతి అనుకొనేవారు. మళ్ళీ, ఆదరణ చూపేవారు. కాని, ప్రొఫెసర్‌కి మాత్రం ఎవరిమీదా, ఎప్పుడూ, దృష్టి లగ్నమయ్యేది కాదు. ఎవరి గొడవా మనసుకు నాటేదికాదు. ఎవరిమీదా మమకారం నిలిచేదికాదు.

కాని, సుహాసిని క్లాసులో చేరాక ఆయనలో ఏదో కొంత మార్పువచ్చింది. క్లాసులో ఆయన దృష్టి మాటి మాటికీ ఆ పిల్లవైపుకే వెళ్ళడం, ఒకొక్కసారి అక్కడే స్థిరపడిపోయి ఆమె కోసమే పాఠం చెబుతున్నట్లుగా ప్రవర్తించడం...పిల్లలు గమనించారు. గంట అయినా క్లాసు వదలక పోవడం, విద్యార్థులు తమలో తాము ముసిముసి నవ్వులు నవ్వుకునేవారు. అందరిలోకి నాగేశం ఎక్కువ అల్లరిచేసేవాడు. వృద్ధాప్యంలో ప్రొఫెసర్‌గారికి బాణాలు తగులుతున్నాయని వ్యంగ్య వాక్యాలు పలికేవాడు.

ప్రొఫెసర్‌కి ఈ గొడవేమీ తెలియదు. ఏదో ఎన్నడో. పారవేసుకున్న వస్తువుకేసి చూసినట్లు తాను పదేపదే ఆ పిల్లకేసి ఎందుకు చూస్తున్నాడో కూడా ఆయనికి అర్థం కాలేదు. ఎక్కడో ఎన్నడో అణగి నిద్రపోతూన్న స్వప్న

లను ఆమె తీవ్రంగా కదిపివేసింది. నిద్రాణువైన ఆయన జీవితంలో చైతన్య స్రవంతి ప్రవహించింది. చైతన్య రహిత మైన ఆయన జీవితంలో ఏదో ఆశ రేకెత్తింది.

కాలేజీలో చేరిన పదిరోజులకి ఓనాడు సాయంత్రం సుహాసిని ఆయన గుమ్మంముందు ప్రత్యక్షమైంది. చేతిలో ఏదో నోటు బుక్కుతో, బెదరు చూపులు చూస్తూ నుంచుంది. సావకాశంగా పేపరు చదువుకుంటూన్న ప్రొఫెసర్ కంగారు పడి చూచాడు. తెలివి తెచ్చుకొని, లోపలికి ఆహ్వానించాడు. కుర్చీలో కూర్చుంటూ సుహాసిని ప్రారంభించింది. తాను ఆలస్యంగా చేరడంచేత తన కేమీ బోధపడడం లేదనీ, ప్రొఫెసర్ ఆయనకి తీరిక ఉన్నప్పుడు సహాయం చెయ్యాలనీ కోరింది. ప్రొఫెసర్‌కీ కాదనడానికి నోరురాలేదు, ఏదో ప్రశ్నలు వేస్తూ గడచిన పాఠాన్ని కొద్దిగా చెప్పాడు. మాటల సందర్భంలో సుహాసిని తన కెవరూ లేరనీ, ఇక్కడ హాస్టల్‌లోనే ఉంటున్నానని చెప్పింది.

ఆరోజునుంచి సుహాసిని ప్రొఫెసర్ ఇంటికి రావడం పరిపాటి అయిపోయింది. సాయంత్రం ఆరు అయ్యేసరికల్లా ప్రొఫెసర్ కుతూహలంతో ఆమెకోసరం ఎదురుచూస్తుండే వారు. అతనికి జీవితంలో ఏదో క్రొత్త ఉత్సాహం దొరికి నట్లయింది. నిరామయంగా గడచే జీవితం ఆశామయమైంది. అనంతంగా, అడ్డులేకుండా గడిచే కాలం ఏదో ఒక నిమిషం కోసం, ఒక ఘడియకోసం ఎదురుచూడటంతో పరిమితమైనది.

శాంత పోలిక ప్రస్ఫుటంగా ఉంటడమే సుహాసిని తనను ఆకర్షించడానికి ముఖ్య కారణమైనా, ఆమెతో

పరిచయం ఎక్కువైనకొద్దీ, ఆమె తెలివితేటలు, మంచితనం, సహానుభూతి అతణ్ణి ముగ్ధుణ్ణి చేశాయి. పాఠాల సందర్భంలోనే ఎన్నో విషయాలు ఆమెతో అతను మాట్లాడుతూ ఉండేవాడు. ఆ పిల్ల వివేకం, సద్గుణములు హృదయానికి హత్తుకుపోతుండేవి. క్రమక్రమంగా సుహాసిని అతనికి ఆత్మబంధువుగా తోచింది. ఆమె మంచి చెడ్డలన్నీ తనమీదనే ఆధారపడియున్నట్లుగా భావించుకొనేవాడు.

కాని, సుహాసిని ప్రొఫెసర్ ఇంటికి అంత తరుచుగా రావడం మాత్రం ప్రపంచం ఒప్పుకోలేదు. సమ వయస్కులైనా, కాకపోయినా, స్త్రీ పురుషుల మధ్య ఒక్కరకమైన సంబంధాన్నే ప్రపంచం ఊహించుకోగలదు. ఆదరణ, సహానుభూతి, పరస్పర గౌరవం ఇవికూడా స్నేహకారణాలని పాటించదు.

లోకం తన పేరూ ప్రొఫెసర్ పేరూ కలిసి చెప్పడం సాగించేసరికి తప్పనిసరిగా ఆమె అతనికి దూరదూరంగా జరిగిపోయింది. క్లాసులోకూడా అతనికి కనబడకుండా ఏమూలనో కూర్చొని లేచిపోతుండేది. కాని, లౌకికవిషయాలు ప్రత్యక్షంగా చెప్పినా తెలుసుకోలేని ప్రొఫెసర్‌కు ఆమె నడత అర్థంకాలేదు. ఆమెకోసం ఎదురుచూడటానికి అలవాటుపడిన అతనికి ఆమె రాకపోవడం ఏదో గొప్ప వెలితిగా కనిపించింది. ఆమెకు ఎవరూ లేరు. తనకీ ఎవరూ లేరు. తను ఆమెకి అండగా ఉండవచ్చుననుకున్నాడు.

నాలుగురోజులు చూసి తానే ఆమెకు కబురుచేశాడు. ఆమె వచ్చి కుర్చీనానుకు నించున్నది. ప్రొఫెసర్ ఆవేగంతో

అడిగాడు: 'ఇన్నాళ్ళూ రాలేదేమి?'

సుహాసిని చెమ్మగిలిన కళ్లతో క్రిందికి చూస్తూ 'మీరు నాకు సహాయంచేయడం ఎవరికీ ఇష్టంలేదు. ఆ బాధ భరించ లేకుండా ఉన్నాను. ముఖ్యంగా, నాగేశం—' మాట పూర్తి చేయలేక కళ్లుతుడుచుకుంది.

ప్రొఫెసర్‌కి ఏమీ అంతుబట్టలేదు. 'ఏం చేశాడు... నాగేశం?' అని ఆదుర్దాగా అడిగాడు.

సుహాసిని తన్ను తాను ఓదార్చుకుని మెల్లగా అన్నది. 'ఏమీలేదు. ఎందుకో ఎప్పుడూ, నా వెనకాలే తిరుగుతూ ఉంటాడు. మీ పేరు చెప్పి ఏదో వెక్కిరిస్తాడు.'

అప్పటికి అర్థమైంది ప్రొఫెసర్‌కి. కొంచెంసేపు ఊరు కొని, ఏమీ జరగనట్లే ఆ ప్రసక్తి విడిచిపెట్టి మాట్లాడాడు.

'మీదేవూరన్నావు?' అని అడిగాడు, ఇదివరకు ఎప్పుడో ఒక సారి అడిగిన సంగతి మరచిపోయి.

'స్వర్ణపురం' అన్నది, సుహాసిని.

ఆ పేరు ఎక్కడో విన్నట్లనిపించింది. చిరపరిచిత మైనదే. తన ఊరికి దగ్గరే. కొంచెంసేపు ఆలోచింపగా, చటుక్కున స్ఫురించింది. అన్నట్లు, శాంతను ఆ ఊళ్లోనే ఎవరికో ఇచ్చారు.

అతనికి, గడచినగాథ పొగమంచు తెర వెనకరంగంలో జ్ఞప్తికి వచ్చింది.

అవి అతను కొత్తగా పరీక్ష ప్యాసయి డిగ్రీ సంపాదించు కొన్న రోజులు. తన పల్లెలో తనే మొదటి పట్టభద్రుడు. అన్నగారు వ్యాపారంలో పుష్కలంగా సంపాదిస్తుండడం

చేత తనకి ఉద్యోగం చెయ్యాలసిన అవసరం, ఆసక్తి లేక పోయినవి. స్వంతంగా పాఠశాల నెలకొల్పి దేవసేవ చెయ్యాలని కోరిక కలిగింది. తన ఇంటిదగ్గరే పిల్లలను పోగుచేసుకొని, చెట్లక్రింద పాఠాలు చెబుతూ ఉండేవాడు. ఇరుగు పొరుగు పిల్లలంతా వచ్చేవారు. శాంతకూడా వచ్చేది. తను శ్రద్ధగా చదువుకోకపోయినా, నవ్వుతూ కబుర్లు చెబుతూ, పిల్లల్ని ఆడిస్తూ ఉండేది.

ఆ తరువాత, అంతా మామూలు కథే. శాంతను తను వివాహం చేసుకోవాలనుకున్నాడు. కాని, ఆమె తనకులం కాదు. అంచేత అన్నగారు ఒప్పుకోలేదు. శాంతకి ఆమె బంధువులు బలవంతంగా వేరే వివాహంచేశారు. పెళ్ళి అయిన పదినెలలకే శాంత ఒక ఆడపిల్లని కని చనిపోయింది. దాంతో తనమనసు పూర్తిగా విరిగిపోయింది. ఎందుచేతో, శాంత మరణానికి తనే కారకుడనిపించింది. తను వివాహం చేసుకుని ఉంటే, శాంత మరణించేదికాదు.

దుఃఖంతో, తను, ఎవరికీ చెప్పకుండా, దేశాంతరం వెళ్ళిపోయినాడు. తరువాత, కొన్నాళ్ళకు అన్నగారు తన ఆస్తి పంచి ఇచ్చాడు. రెండు ఏళ్ళు అమెరికాలో చదువుకొని తిరిగి వచ్చి ఇక్కడ ఉద్యోగంలో చేరాడు. అన్నగారు, తరువాత, ఎన్ని ఉత్తరాలో వ్రాశాడు: నీకు ఇష్టం వచ్చిన పిల్లనే వివాహం చేసుకోవచ్చును. అన్నీ మరచిపోయి తిరిగి రమ్మనమని. కాని, ఒక్క ఉత్తరానికీ జవాబు వ్రాయలేదు. తిరిగి వెళ్ళనూలేదు.

ఇన్నేళ్ళ తరువాత, ఆదే రూపంలో ఈ పిల్ల తిరిగి తనజీవితంలో అడుగుపెట్టింది. అప్పుడు, అన్నగారిని ఎదుర్కొనే ధైర్యంలేక శాంతను పోగొట్టుకున్నాను. కాని, ప్రపంచానికి భయపడి ఇప్పుడీ పిల్లను పోగొట్టుకోగూడదనిపించింది అతనికి.

'నీకు ఎవరూ లేరన్నావుగదూ...?' అని మళ్ళా మళ్ళా అడిగాడు.

'నేను పుట్టిన మూడోరోజే మా అమ్మ చనిపోయింది. ఆ తరువాత ఏడాదికే మానాన్న పోయారు. నన్ను చిన్నప్పటి నుంచి మా మావయ్యే పెంచాడు. ఆయనకి చాలమంది పిల్లలు. పొలాలు సరిగా పండటంలేదు. నేను తప్పకుండా చదువుకోవాలంటే, స్కాలర్‌షిప్ వచ్చిందని ఇంతదూరం పంపారు.'

దృఢనిశ్చయానికి వచ్చినట్లు చప్పున అడిగాడు ప్రొఫెసర్ 'నిన్ను నేను పెంచుకొంటే మీ మామకి ఏమీ అభ్యంతరం ఉండదుగా ?'

సుహాసిని కళ్ళువిప్పి ఆశ్చర్యంగా చూసింది.

ప్రొఫెసర్ తొందరగా మళ్ళీ అడిగాడు. 'నీ ఖర్చులన్నీ నేనేభరిస్తాను. నీకు కావలసినంత చదువు చెప్పిస్తాను' అన్నాడు, నవ్వుతో.

సుహాసిని బుగ్గలు లేతగులాబీలలాగ కందిపోయినాయి. ఏమనడానికి తెలియలేదు. ప్రొఫెసర్ కేసి తలయెత్తిచూడకుండానే అక్కడనుంచి వెళ్ళిపోబోయింది.

"వెంటనే మీ మామనొకసారి రమ్మని వ్రాయి. రైలుఖర్చులు నేను పంపుతాను" అన్నాడు ప్రొఫెసర్. ఆమెను గుమ్మందాకా సాగనంపాడు.

సరిగా వారం రోజులకి సుహాసిని మామ అక్కడ ప్రత్యక్షమయ్యాడు. ఆ వారంరోజులు ప్రొఫెసర్ ఆనం దానికి అంతులేదు. వాడిపోయిన లత మళ్ళా చిగిరించాలని ఉత్సాహపడుతుంది. ఎందుకో, ఏమో-వెఱ్ఱితనం.

ప్రొఫెసర్ ఇల్లంతా తిరిగి సర్దుకున్నాడు. సుహాసిని కోసం ప్రత్యేకం కొన్నిగదులు ఖాళీచేయించాడు. ఆమె మామవచ్చిన రోజే. తను ఒకవిందును ఏర్పాటుచేశాడు. కాలేజీకి సంబంధించినవాళ్ళనందరిని, ముఖ్యంగా నాగేశం మొదలైన విద్యార్థులని మరచిపోకుండా పిలిచాడు.

ఉన్నట్టుండి, ఇంత బ్రహ్మాండంగా ప్రొఫెసర్ విందు ఎందుకిస్తున్నాడో ఎవరికీ అర్థంకాలేదు. కొందరు ఊహించు కున్నారు.

ప్రొఫెసర్ ఉత్సాహంతో, అన్ని ఏర్పాట్లు చేసు కున్నాడు. తనకి జీవితంలో ఏదో శుభంకలుగుతున్నదను కున్నాడు. నౌకర్ని గుమ్మానికి పసుపులుపూసి మామిడి తోరణాలు కట్టమన్నాడు.

ఆరోజు అందరూ సరదాగా విందు ఆరగిస్తుంటే ప్రొఫె సర్ ప్రస్ఫుటంగా చెప్పాడు: తను సుహాసినిని పెంచుకుంటు న్నానని; ఆరోజునుంచి ఆమె తనకు పెంపుడుకూతురని. అందరూ ఆశ్చర్యపోయారు.

నాగేశం పెదవులపై వ్యంగ్యహాసం తొణికిసలాడింది. ప్రొఫెసర్ అది కనిపెట్టకపోలేదు. నాగేశం స్వతహాగా మంచివాడే, చాల బుద్ధిశాలికూడాను – అతనిబుద్ధి వక్ర మార్గాన్నిపట్టినా సరియైన తోవలో పెట్టేమార్గం ప్రొఫెసరికి తెలియకపోలేదు. అందుకే నాగేశం దగ్గరగావెళ్ళి, భుజం మీద చెయ్యివేసి నవ్వుతో అన్నాడు: ఏమోయ్! ఇంక నువ్వు అల్లరిగాఉంటే లాభంలేదు. చక్కగా చదివి ఫస్టున ప్యాసు అయినావంటే నిన్నే అల్లుణ్ణిగా చేసుకుంటాను.

నాగేశం ముఖంలో నవ్వు ఒక్కక్షణంలో మాయ మైంది. ప్రొఫెసర్ కేసి నిర్ఘాంతపోయి చూశాడు.

కాని, నాగేశం సుహాసిని వెనకాలే వెళ్ళడం మాత్రం మానుకోలేదు. అయితే, ఆమెను వెక్కిరించడానికి కాకుండా, ఆమెమీద ఈగ వాలకుండా కాపాడుకోడానికి మాత్రమే!

సుహాసిని కృతజ్ఞతాపూర్వ సూచకంగా నవ్వినప్పుడు ఆ చూపులలో భావాలు భారతమంత విపులంగా కట్టలు తెంచుకొని ప్రవహించేవి. ఆమెకి బదులు తనే తలవంచు కొనేవాడు.

ఒంటరిగా జీవితం సాగించిన ప్రొఫెసర్‌కి ఇన్నాళ్ళకి మరొక ప్రాణి తోడునీడైంది. సాయంత్రం సంధ్యాకాంతులలో సుహాసినితోగూడ షికారు వెళుతున్నప్పుడు ఆ ఎర్రని ఆకాశంలో ఏమూలనించో శాంత చూసి ఆనందిస్తున్నదని తోచేది ప్రొఫెసరుకి.

ఒకరోజు పరధ్యానంగా అడిగాడు సుహాసినిని మీ అమ్మపేరు ఏమిటని...'శాంత'...అన్నది సుహాసిని మెల్లగా.

సుహాసిని ముఖంకేసి తేరిపారజూసి నిట్టూర్పు విడిచాడు.

ఈపిల్లను ఇంతదూరం తనకోసం శాంతే పంపిందేమో! లేకపోతే, ఇంతదూరం ఈ పిల్ల తనకోసరం వెతుక్కుంటూ రావడమేమిటి ?

ఇంటికి వెళ్ళగానే, తనరూములో శాంత ఫోటోతీసి భద్రంగా దాచుకొన్నాడు ప్రొఫెసర్. తల్లిముఖమైనా చూచి ఎరుగని సుహాసినికి గడచిన గాథలు తెలియక్కరలేదను కున్నాడు ప్రొఫెసర్.

కోరికలు

చీకటిముసుగు తొలగించుకొని, మబ్బు తెరలను తప్పించుకొని తూర్పున వెలుగురేకలు వెల్లివిరుస్తున్నాయి. దూరాన గుడిగంటలు వినబడుతున్నాయి. తెల్లారిందన్నమాట. క్రమక్రమంగా వెలుగు అధికమయ్యేకొద్దీ ఒక్కరొక్కరే ప్రయాణీకులు ఈ త్రోవనే వెడతారు.

ఇక్కడికి కనుచూపుదూరంలో ఏదో పెద్దగుడి ఉన్నది. విష్ణ్వాలయం, ఈత్రోవన వెళ్ళేవారు చెప్పుకుంటూఉంటే విన్నాను. అక్కడ ప్రతినిత్యమూ ఉత్సవమే. ఈచుట్టుప్రక్కల జనంఅంతా తెల్లవారితే అక్కడే వ్రాలతారు. అక్కడినుంచి తిరిగి వెళ్ళేటప్పుడు ఇక్కడికి వస్తారు. నాకు ప్రదక్షిణాలు చేస్తారు. పసుపు, కుంకుమ, పండ్లు ఉంచుతారు. ఏవేవో కోరికలు కోరుకుంటారు. అస్పష్టంగా కొన్ని నాకు వినబడతాయి కొన్ని వినబడవు. నా కొమ్మలక్రింద నిలబడి, నాకు ప్రదక్షిణంచేసి ఏదైనా కోరుకుంటే తప్పక నెరవేరుతుందని వారి ఆశాభావం. ఎందరి కోరికలు నెరవేరాయో నాకు తెలియదు. వచ్చినవారే మళ్ళీ వస్తారు. ఒకకోరిక తీరితే మరొకటి కోరుకుంటారు. అనంతంగా వస్తూ పోతూనే ఉంటారు. ఎవరెవరో ఎందరో నాకు సరిగా గుర్తుకూడా ఉండదు.

దూరాన ఆ గుడిదగ్గర ఎందరు చేరుతారో ఏమి ఉత్సవాలు జరుగుతాయో నాకు కనబడదు. ఆగుడికి నాకూ మధ్య ఎన్నో చెట్లు, ఎన్నో కొమ్మలు గుబురుగుబురుగా ఉన్నాయి.

ఆకుల సందులోనుంచి తళతళమెరుస్తూ బంగారు గోపురం మాత్రం కనబడుతూంటుంది నాకు. గాలి ఎప్పుడైన విపరీతంగా వీస్తే నా ఆకులన్నీ రాలి ఎగిరి గుడి గుమ్మందాకా వెళ్ళిపడతాయి అంతే. అదే భగవంతునకు నేను చేసే పూజ.

నా ప్రక్కనే ఈ మఱ్ఱిచెట్టు ఎన్నాళ్ళగానో ఊడలు పాదుకొని భూమి అంతా వ్యాపించి పందిరి వేసినట్టున్నది. అదీ నేను ఇంచుమించు ఒకేసారి పుట్టాము. గాలికి కదులుతూ కొమ్మలు ఒరుసుకుంటూ పలకరించుకొంటూ ఒకచోటనే పెరిగాము. అదే నాకు తోడు, దానికి నేను తోడు. ఒకరి నొకరు చూస్తూ కాలం గడుపుతాము.

పగలు రాత్రి, రాత్రీ పగలూ, ఎన్నిరోజులు గడిచిపోయాయో, కొన్ని వేల సంవత్సరాలు గడచినట్టనిపిస్తుంది నాకు. ఆమధ్య ఇద్దరు పిల్లలు ఈ కొమ్మలక్రింద ఆడుకొంటున్నారు. చుట్టూపడిఉన్న పండుటాకులు, పసుపూ చూస్తూ నన్నుగురించే మాట్లాడుతున్నారు. ఒకతను అన్నాడు. "రావిచెట్టు ఇక్కడ ఎన్నాళ్ళనించి ఉన్నదో తెలుసా? ఆ మఱ్ఱిచెట్టు ఈ రావిచెట్టు, ఆ వేణుగోపాలస్వామి ఆలయం కట్టకముందునించి కూడా ఉన్నాయట. అంటే సుమారు వెయ్యేళ్ళపైన అయి ఉండాలి."

రెండో అతను అన్నారు: "అవును నేనూ విన్నాను. అసలు స్వయంగా రామానుజులవారే ఈ మొక్క పాతారంటారు. అందుకే ఆచెట్టుకంత పవిత్రత. ఈచెట్టుక్రింద తలచుకొంటే ఏ కోరికలైనా తీరుతాయట."

నాకు నవ్వు వస్తుంది. ఈమాటలు నాకు కొత్తకాదు. ఎందరో, ఎన్నిసార్లో ఈమాటలే చెప్పుకుంటూ ఉంటారు. ఎన్నిసార్లో విన్నాను. ఎంత అమాయకులు. నాలో అందరి కోరికలూ తీర్చేశక్తి ఉన్నదా? నాకోరికలే తీరడంలేదు. అనంతంగా తపస్సు చేస్తున్నాను, ఆకాశాన్ని అందుకోవాలని. నా తపస్సు ఫలించలేదు. నా కొమ్మలు పైకిలేచి లేచి నాలుగు దిక్కులూ వ్యాపించాయి అంతే, ఆకాశాన్ని అందుకోలేదు. నా ఆశ ఫలించలేదు. ఎప్పటికో ఈ కోరిక ఫలిస్తుంది. ఎప్పటికో నా తపస్సు పునీతమౌతుంది. నా కొమ్మలు ఆకాశాన్ని అందుకోగలుగుతాయి. ఈ ఆశతోనే జీవిస్తున్నాను. ఇంకొక వెయ్యి సంవత్సరాలకైనా, ఈ ఆశ ఫలించాలి.

ఇదంతా అడవి. చుట్టుప్రక్కల ఎక్కడా యిళ్లులేవు. గుడికి వెళ్ళే త్రోవలో నాకు దూరంగా ఒక సాధువుల మఠం ఉన్నది. దాని వెనకాలే ఏదో నది సుళ్ళుతిరిగి ప్రవహిస్తున్నది. ఇక్కడికి వచ్చేవారంతా నదిలో స్నానంచేస్తారు. గుడిలో ఉత్సవాలు చూస్తారు. మఠానికి వెళ్లుతారు. ఆ తరువాత ఇక్కడికి వస్తారు.

ఎందరెందరో వస్తారు. రకరకాలవారు, పావడా చొక్కాలతో, పారిజాత పూలతో పెళ్ళికాని పిల్లలు వస్తారు. పసుపు బట్టలతో పారాణితో క్రొత్తపెళ్ళికూతుళ్ళు వస్తారు. కాటుక కళ్ళలో నడికట్లతో వారే మళ్ళీ పసిపిల్లతల్లులై వస్తారు. మళ్ళా కొప్పు ముల్లతో కోడర్లలోవస్తారు, వచ్చేవారందరూ ఎక్కువగా ఆడవాళ్ళే. వారికే ఎన్నో కోరికలు. పెళ్ళికాని

పిల్లలకు మంచిభర్త కావాలి, జన్మంతా కోరికలే. ఒకే కోరికలు తరతరాలుగా.

మధ్యాహ్నం ఎండ మాడుస్తుంది. పన్నెండు గంటలకు గుడితలుపులు మూస్తారు. మదంతో భజనలు చేస్తారు. అలసిపోయినవారు నానీడన నిద్రపోతారు. కొందరు కబుర్లు చెప్పుకుంటారు. పసిపిల్లలదగ్గరనుంచి పెద్దవారయ్యే వరకూ ఎందరినో చూస్తాను. కొన్నాళ్ళకు మళ్ళావారు రారు. క్రొత్త వారు వస్తుంటారు. రోజులు గడచిపోయాయి. ఎప్పుడో నాకు నిద్రవస్తుంది. ఆవులిస్తాను. మళ్ళీ మేల్కొంటాను. కబుర్లు వింటాను.

ప్రొద్దువాలుతుంది. గుడి తలుపులు మళ్ళీ తెరుస్తారు. మంగళవాయిద్యాలు మ్రోగుతాయి మంత్రాలు వినబడతాయి. మళ్లా అంతా నిశ్శబ్దం. నల్లని మేలిముసుగులోరాత్రి అడుగుపెడుతుంది. ఆకసందులో నక్షత్రాలు మాత్రం మిగులుతాయి. మళ్ళా తెల్లవారేవరకూ మళ్లీ చప్పుడూ వుండదు.

ఈ రాత్రివేళే బాగుంటుంది. నా కొమ్మలు నిశ్చలంగా ఉంటాయి. నా ఆత్మ ప్రశాంతంగా ఉంటుంది. నా తపస్సు నిర్విఘ్నంగా సాగుతుంది.

ఎప్పుడో ఒకరోజు మాత్రం ఈ శాంతి ఉండదు. ఉరుములు, మెరుపులు, ప్రళయాన్ని రుచిచూపుతాయి. ప్రచండవాయువు వస్తుంది. కొమ్మలల్లాడిపోతాయి. ఊడలు పాతుకొన్న ఈ మర్రిచెట్టుకూడా వణికి పోతుంది. నా వ్రేళ్లు

పెళ్ళగిలి నేను నేలకు వాలిపోతున్నా ననుకుంటాను. అంతలో వాన తగ్గిపోతుంది. ఇద్దరమూ తెప్పరిల్లుతాం.

ఇవాళ ఎవరో ఇంకా తెల్లవారకముందే వస్తున్నారు. రామలక్ష్మి సావిత్రిలా ఉన్నారు. వీళ్ళను నేను ఎరుగుదును. ఎన్నాళ్ళగానో వస్తున్నారు. ఎన్ని సంవత్సరాలైందో. చిన్న పిల్లలప్పటినుంచి వస్తున్నారు.

ఈ కొమ్మల క్రిందే వారి మొదటి పరిచయం. ఇక్కడే వారు తొలిసారి పలకరించుకున్నారు. ఆడుకొన్నారు. ఆ మొదటి మాటలు ఇంకా నాకు వినబడుతున్నాయి.

నీ పేరేమిటి ?

రామలక్ష్మి. నీపేరో ?

సావిత్రి. మీ దేవూరు ?

రాంపల్లి. మీదో ?

నగపల్లె రోజూ వస్తారా ?

ఆఁ. మా అమ్మ వస్తే నువ్వో.

నేనూ...మా అమ్మ వస్తే...

ఆడుకుందామా ?

ఏమాట ?

దాగుడుమూతలు.

ఇద్దరూ నవ్వారు. అదే తొలి పరిచయం. ఆ తరువాత ఎన్నిసార్లో కలుసుకున్నారు. ఎన్నిసార్లో కలిసివచ్చారు. ఎన్ని కబుర్లో చెప్పుకున్నారు.

రామలక్ష్మి పెళ్లైన కొత్తలో వచ్చింది. సావిత్రి వచ్చింది. ఆ కబుర్లను నేను మరచిపోలేదు. రామలక్ష్మి

ఉత్సాహంతో పొంగిపోతోంది. సావిత్రి వాడిన పూవులా వాలిపోతోంది. రామలక్ష్మి అత్తారింటి కబుర్లు అంతు లేకుండా చెబుతోంది. సావిత్రి వింటోంది.

"మావారికి నాలుగు మేడలున్నాయి. పొలాలు పండు తాయి, మా అత్తగారు నన్ను ఏపని చేయనియ్యదు. నాకు పొద్దుపోదు. మీ అత్తగారు మంచిదేనా ?"

సావిత్రి నిట్టూర్చింది.

"నాకు అత్తగారు లేరు. మామగారు ఏమీ పట్టించు కోరు." అన్నది.

రామలక్ష్మి మళ్ళీవాగింది.

"మా ఆయన పట్టుచీరెలే కట్టుకోమంటారు. ఎప్పుడూ మల్లెపూలే పెట్టుకోమంటారు. నాతోటే ఉంటారు. నన్ను విడచి ఉండలేరు. నేను మావూరు వచ్చేయడం ఆయన కిష్టంలేదు. మా అత్తగారు పంపింది ఈ రావిచెట్టుకు ప్రదక్షి ణాలు చేయమని. ఆవిడకప్పుడే తొందర, మనుమలు కావాలని." ముసిముసి నవ్వులు నవ్వింది. సావిత్రి చిరునవ్వు నవ్వింది. మౌనంగా ఊరుకొన్నది. ఆమె ముఖంలో ఏదో నిర్లిప్తత తప్ప ఆశ నిరాశ రెండూలేవు. తుపాను వెలిసిన తరువాత వచ్చే ప్రశాంతి మాత్రం ఉన్నది. రామలక్ష్మి మళ్ళీ అడిగింది.

"నువ్వు ఎన్నాళ్ళు ఉంటావు ఇక్కడ ? నువ్వుకూడా ప్రదక్షిణాలు చేస్తావా ?"

సావిత్రి నిట్టూర్చింది.

"దేనికోసం ప్రదక్షిణాలు. నాకు ఏమీ అక్కరలేదు. మా ఆయనకు నేనంటే ఇష్టంలేదు. ఆయనకు నన్ను బలవంతంగా పెళ్ళిచేశారట. నేనింక అత్తారింటికి కూడా వెళ్ళక్కరలేదు."

రామలక్ష్మి, "అయ్యో పాపం" అంది. అంతలో మరచిపోయింది. ఒకరి సుఖదుఃఖాలు మరి ఒకరికి అంటవు. సానుభూతి, దయ, క్షణకాలం మాత్రమే.

రామలక్ష్మి తన ఆనందంలో తాను మునిగి ఉంది. సావిత్రి దుఃఖం, బాధ ఆమెకు అర్థంకాలేదు. ఆమె తనసంగతి మాత్రమే తాను ఆలోచించుకొంటోంది.

"నీవుకూడా రారాదూ రోజూ పోనీ, నాకు తోడుగా వుంటావు" అన్నది.

సావిత్రిలో స్వార్థం అప్పుడే నశించింది. ఆమెలో కోరికలన్నీ అణగారినవి, ఆమెకు తనను గురించిన ఆలోచనే లేదు.

"అల్లాగేవస్తాను. ఎందుకు రానూ" అన్నది ఉదాసీనంగా.

కాని, మాట నిలబెట్టుకొంది. ప్రతిసారి ఆ తరువాత ఇద్దరూ కలసే వచ్చేవారు. వారిస్నేహం విచిత్రమైనది. ఎప్పుడూ రామలక్ష్మి తన సంసారం గొడవలు వడవడ వాగేది. సావిత్రి మౌనంగా వినేది. వచ్చినప్పుడల్లా రామలక్ష్మి ఏదో క్రొత్తకోరిక కోరేది. సావిత్రి ఎన్నడూ ఏదీ కోరలేదు. రావడం మాననూలేదు.

ఎన్నిరోజులు గడిచిపోయాయో, అప్పటికీ, ఇప్పటికీ మధ్య, వారి ముఖకవళికలనుబట్టి చూస్తే ఒక జీవితకాలం గడిచి ఉండాలి.

ఇవ్వాళ వారిద్దరూ అలసిపోయినట్లున్నారు. రామలక్ష్మి ముఖంలో మొట్టమొదటిసారిగా దుఃఖం, వేదన కనిపించాయి. సావిత్రి మామూలుగానే ఉన్నది.

రామలక్ష్మి అన్నది "మా కోడలు నన్ను బొత్తిగా నిర్లక్ష్యంగా చూస్తోంది. నామాటంటేనే సరిపడదు. ఇన్నేళ్ళకి ఆయింట్లో నేను దిక్కులేనిదానిలా ఉన్నాను. ఈ అవమానం భరించలేను." అని నిట్టూర్చింది. మళ్ళా తలపైకెత్తి నాకేసి చూస్తో అన్నది.

'ఈ రావిచెట్టుక్రింద ఎన్నిసార్లు ఎన్ని కోరికలు కోరానో, అన్ని నెరవేరాయి. ఇంక ఒక్కటే కోరిక. మా మనమడికికూడా త్వరగా పెళ్ళయి మంచి గడసరి భార్య రావాలి. అప్పుడుగాని గర్వం అణగదు మా కోడలికి. అందుకే ఎదురుచూస్తున్నాను' అన్నది.

సావిత్రి చిరునవ్వు నవ్వింది. తనూ తలెత్తి నాకేసి చూసింది.

"పాపం, ఈ చెట్టు ఎన్ని కోరికలు బాధలు, ఆశలు, నిరాశలు తనలో దాచుకున్నదో. ఎంతకాలంగా ఏమీ తెలియకుండా గంభీరంగా అల్లాగే ఉందో. కొన్ని వేల సంవత్సరాలైందేమో, లోలోపల దహించుకుపోతూ, అణగారిపోతూ. మానవు డింతకాలం ఎన్నడూ బ్రతుకలేడు. అల్పాయుః ప్రమాణమే మానవునికి ఒక వరం విముక్తి"

అన్నది. రామలక్ష్మి ఆమాటలు వినిపించుకోలేదు. ఇద్దరూ వెళ్ళిపోయారు.

చీకటి పడింది. నక్షత్రాలు ముగ్గులు పెట్టాయి. చందమామ తరలివచ్చాడు గాలి కదిలింది. నా ఆకులు కొమ్మలు గలగలలాడినవి. ఆకాశాన్నందుకోడానికి ముందుకు సాగినవి. నాలో మళ్ళీ కోరిక తీగెలుసాగినవి. ఆకాశాన్నందుకోలేనా. ఎప్పుడో, ఏమో. దూరాన మబ్బులు ముంచుకు వస్తున్నాయి. గాలి ప్రచండరూపం దాలుస్తోంది. నా స్నేహితురాలు గజగజలాడిపోతోంది. నా వేళ్ళు వణుకుతున్నాయి. ఇదే ఆఖరి రాత్రి కాదుగదా.

రేపు ఈత్రోవన వెళ్ళేపిల్లలు 'పాపం ఈ రెండు చెట్లూ రెండు వేలేండ్లు బ్రతికినవి. ఇన్నాళ్ళకి కూకటివేళ్ళతో పడిపోయాయి, అనుకుంటారు కాబోలు, అంతేకదా.

పారిపోయిన చిలుక

ఆకాశాన తెల్లని మేఘాలు అటూ ఇటూ పరుగెడుతున్నాయి, ఏదో తొందరపని ఉన్నట్టు. ఆ కొసనుంచి ఒక తెల్లని మబ్బుతునక ముందుకు పరిగెడితే ఈ కొసనుంచి మరొక పిల్లమబ్బు ముందుకు సాగుతోంది. మధ్యలో రెండూ ఒక క్షణం ఒక్కటిగా మారిపోతున్నాయి. రెప్పపాటులో విడిపోతున్నాయి. మళ్ళా ఎవరి త్రోవ వారిది. ఆకాశాన్ని అలముకొని, అలముకొని రూపాలు మార్చుకొంటున్నాయి— చెదరిన దూది రేకుల్లా, జారిన మల్లె మొగ్గల్లా. ఏవో, ఏవో.

కదలుతూన్న మేఘాలను చూస్తూ గది గుమ్మందగ్గర గడపలో తోటవైపు కూర్చున్న కామాక్షమ్మకు దిగులేసింది. ఎంత చప్పున ఆకారాలు మారిపోతున్నాయి! చూస్తుండగానే చూస్తున్న దృశ్యం మారి మారి పోతున్నది. ఒక రూపానికి అలవాటుపడేలోపల ఎన్నో క్రొత్త రూపాలు! క్షణంలో కదిలి మాయమౌతున్నాయి! ఎంత అందంగా పరుగెడుతున్నాయి! ఎంత ఆప్యాయంగా కౌగిలించుకుంటున్నాయి! ఎంతలో విడిపోతున్నాయి! ఏమి క్షణికాను బంధాలు! అనుకున్నది.

ప్రొద్దు వాలుతోంది. సాయంత్రంవేళ ఈ తోట, ఇల్లూ ఎంత నిశ్శబ్దంగా ఉంటాయో చెప్పలేం! ఇంట్లో ఉన్న నౌకర్లిద్దరిలో ఒకరికది వంట సమయం. మరి ఒకరికి

తిరగబోయ్యే సమయం. ఇక ఇంట్లో అంతా నిశ్శబ్దమే, గాలికి ఆకులు కదిలితే తప్ప!

రోజూ ఈ వేళకు ఈ తోటవైపు గడపదగ్గర అర్థంలేని ఆలోచనలతో దిక్కులు, మబ్బులు, చెట్లూ చూస్తూ కూర్చోడమే కామాక్షమ్మ కార్యక్రమం. దీనికి ఎప్పుడూ మార్పు లేదు.

ఈ ఇల్లు ఉండడమే ఊరి చివరన ఉన్నది. ఇంటికి మూడు వేపులా మామిడి తోట. పచ్చని ఆకులూ, పచ్చగా కిలకిల మనే చిలుకలూ స్వేచ్ఛగా వస్తూ పోతూంటాయి. తోట వాడు పగలంతా పనిచేస్తాడు. సాయంత్రం వెళ్ళిపోతాడు.

కామాక్షమ్మ భర్త సుందరరావు. అతనికి ఈ తోట పిత్రార్జితం. ఇల్లు స్వార్జితం. ప్రక్క పట్టణంలో ఏదో వ్యాపారం. ఏం వ్యాపారమని కామాక్షమ్మ ఎప్పుడూ అడగ లేదు. అడిగినా అతడు చెప్పడు. ఆడవాళ్ళకవన్నీ ఎందుకూ, అనవసర విషయాలు, అని అతని అభిప్రాయం. స్నేహితులతో పేకాడ్డం, స్నేహితురాలితో షికారు కెళ్ళడం ఇల్లాంటివన్నీ ఆ వ్యాపారంలో కొన్ని భాగాలే – ఇవి చెప్పాల్సిన అవసరం లేదు.

ఆ ఊరికి ఉదయమూ, సాయంత్రమూ ఓ రైలు నిద్రపోతూ వస్తుంది. దానికొక టైము లేదు. ఉదయం ఏడు దాటాక ఎప్పుడో వస్తుంది. ప్రక్క పట్నానికి వెడుతుంది. సాయంత్రం ఏడు దాటాక మళ్ళా ఎప్పుడో వెనక్కి తిరిగి వస్తుంది. రోజూ ఆ రైల్లోనే సుందరరావు ప్రయాణం. ఉదయం బయలుదేరి వెళ్ళి మళ్ళా రాత్రికి తిరిగి వస్తుంటాడు. స్టేషనుకు

ఇంటికి రెండుమైళ్ళ దూరం. ఉదయమే స్నానం ఫలహారం చేసి సుందరరావు స్టేషన్‌దాకా నడుస్తాడు. ఏమైనా ఉంటే పట్టుకుని నౌకరు శంకరం కూడా వెడతాడు. ఆ రైలుకు సుందరరావు ప్రయాణం చాల అలవాటు. ఎంత లేటయినా అతను వచ్చేవరకు కదలదు. సాయంత్రం శంకరం మళ్ళా స్టేషన్‌కు వెడతాడు. ఏ ఎనిమిదింటికో సుందరరావుతో కలసి తిరిగివస్తాడు. రోజూ అంతే.

పధ్నాలుగేండ్ల క్రిందట సుందరరావుకు ఈ తోటలో యిల్లుకట్టుకుని ఏకాంతంగా ఉంటే బాగుంటుందని తోచింది. పట్నాల్లో ఏముంది దుమ్ము ధూళి తప్ప యిక్కడ ప్రశాంతంగా ఉంటుంది, పట్నంకూడా దగ్గరే కాబట్టి రోజూ వెళ్ళి పనులు చూసుకోవచ్చు అనుకున్నాడు యిల్లు కట్టాడు. అయితే ప్రస్తుతం ఆ ఏకాంతాన్ని అనుభవిస్తున్నదిమాత్రం కామాక్షమ్మ. ఆవిడ ఈ ఏకాంతం కావాలని కోరుకోలేదు. అయినా ప్రాప్తించింది. అంతే, జీవితం. ఒకరు కావాలని కోరుకుంటారు. అది మరొకరికి కోరకుండానే ప్రాప్తిస్తుంది. వారి కది అవసరంలేదు అయినా తప్పదు.

కాపరానికి వచ్చిన కొత్తలో కామాక్షమ్మ అనేది.

"మీకు తెల్లవారిలేస్తే పట్నంలో పని. ఇంక ఇక్కడెందుకూ కాపరం" అని. సుందరరావు వినిపించుకోలేదు.

"ఆ పట్నంలో ఈ ఏకాంతం ప్రశాంతం ఎక్కడ దొరుకుతాయి" అనేవాడు. చీకటిలో వెళ్ళి చీకటిపడ్డాక వచ్చి ఈఇంట్లో అతను అనుభవిస్తున్న ఏకాంతం, ప్రశాంతం

ఏమిటో అతనికే అర్థంకావాలి. కామాక్షమ్మకు అర్థంకాలేదు. అయినా ఆవిడ మాట్లాడలేదు.

ఇల్లుకట్టిన కొత్తలో సుందరరావు వంటవాడు, నౌకరు శంకరం మాత్రమే వుండేవారు. అప్పుడూ అతను ప్రొద్దున వెళితే సాయంత్రమే మళ్ళారావడం. రెండేళ్లు గడిచాక అతనికో ఆలోచన వచ్చింది. ఈ ఇంట్లో భార్య అనే ఒక వస్తువుకూడ ఉంటే బాగుంటుందనిపించింది. అతనికా ఆలో చన రాగానే ఓ మిత్రుడు అతనికి కామాక్షమ్మను చూపిం చాడు సుందరరావు ఒప్పుకున్నాడు.

కామాక్షమ్మ పుట్టింటివారిది సామాన్య సంసారం. తండ్రి తెచ్చే నెలజీతం నెల భోజనానికి సరిపోతుంది. మిగుల్చు కోవాలన్న కోరికా, మిగులుతుందన్న ఆశా లేవు. కామా క్షమ్మ ఒక్కతే కూతురు. వంశోద్ధారకుడు ఒక్కడే కొడుకూ, వాడు చెప్పినమాట వినకుండా పరారి అయ్యాడు. నగలు నాణ్యాలు చేయించలేదుగాని, కామాక్షమ్మను గారాబం గానే పెంచారు. థర్డుఫారంవరకు చదివించారు.

కామాక్షమ్మకు చిన్నప్పుడు తీరని కోరికలలో నగల వ్యామోహం ఒకటి. ఎదురింట్లో ఉన్న నాంచారమ్మ కామా క్షమ్మకు చిన్నప్పటి స్నేహితురాలు. నాంచారమ్మకు ఒంటి నిండా నగలే. కామాక్షమ్మ బంగారంలాంటి శరీరకాంతి చూచి నాంచారమ్మ అసూయపడేది. నాంచారమ్మ నల్లటి దేహంమీది బంగారునగలు చూచి కామాక్షమ్మ అణచు కోలేని ఆశపడేది. తల్లిని నగలుచేయించమని వేధిస్తే ఆవిడ

"మేమేం చేయించగలం తల్లీ, పెద్దయ్యాక పెళ్ళయితే అత్త గారు నగలు పెడతారులే" అనేది.

అంచేత కామాక్షమ్మ మనస్సులో చిన్నప్పటినుంచి పెళ్ళికి, నగలకు అవినాభావసంబంధం యేర్పడింది. పెళ్ళయితే నగలు వస్తాయి. అంచేత ఆ ఘడియకోరకు ఎదురు చూడడంకంటే చేసేదేమీ లేదు.

సుందరరావు కామాక్షమ్మను ఎన్నుకున్న తరువాత, తల్లి కామాక్షమ్మను అడిగింది.

"మనిషి బాగానే ఉన్నాడు. ఆస్తి బాగానే ఉందిట. మామిడితోట, మాగాణిభూమి ఏదో వ్యాపారం అన్నీ ఉన్నాయిట, అయితే నీకు పదిహేనేండ్లు అతనికి ముప్పై. నీ అభిప్రాయం ఏమిటి" అని.

కామాక్షమ్మ తన అభిప్రాయం వెలిబుచ్చింది, తల్లి చెప్పినవేవీ వినిపించుకోకుండా.

"ఒంటినిండ నగలు పెడతారా" అని అడిగింది. తల్లి తెల్లబోయింది.

"ఏమో అడగలేదు. ఇంకో సంబంధం అయితే కట్నం ఇచ్చుకోవాలి. మనదగ్గర లేదుగదా!" అని గొణిగింది.

కామాక్షమ్మ చిన్నబుచ్చుకొన్నది. మూడురోజులు మథనపడింది. ఇన్నాళ్ళు ఎదురుచూసింది, పెళ్ళికోసమా, నగలకోసమా! మూడోరోజు మధ్యవర్తి మిత్రుడు వార్త తెచ్చాడు. సుందరరావు దగ్గర అతని తల్లి తాలూకు నగలు చాలా ఉన్నాయి. అవన్నీ తప్పనిసరిగా కామాక్షమ్మకే చెందుతాయి. కామాక్షమ్మ ముఖం వికసించింది. తల్లి

సందేహాలన్నీ మనసులోనే అణచుకొని చిరునవ్వు నవ్వింది. వివాహం జరిగింది.

అత్తమామలు అన్నదమ్ములు లేని ఏకాంత గృహంలో తొలిసారి అడుగుపెట్టినప్పుడు కామాక్షమ్మకు అది వింతగా తోచలేదు. ఏవాతావరణంలో అడుగుపెడితే అదే సహజంగా తోస్తుంది అలవాటు అవుతుంది. కామాక్షమ్మకు ఒంటరిజీవితమే అలవాటయింది. ఎప్పుడో తప్ప ఆ ఒంటరితనం ఆమెకు బాధ అనిపించదు.

ఇంట్లో పని ఏమీలేదు. నౌకర్లు అన్నీ చూచుకుంటారు. కాపరానికివచ్చిన కొత్తల్లో సాయంత్రం కాగానే చక్కగా తలదువ్వుకొని శృంగారించుకొని అత్తగారి తాలూకు నగలన్నీ నెమ్మదిగా అలంకరించుకునేది. అద్దంలో అనేకసార్లు చూచుకునేది. ముకిసిపొయ్యేది. తోటంతా తిరిగేది. భర్తకోసం ఎదురుచూచేది. రోజు గడచిపొయ్యేది.

పన్నెండేండ్లయింది. ఇప్పటికీ అంతే. అయితే ఇప్పుడా నగలు మునుపటిలా ఆనందం ఇవ్వడంలేదు. అలవాటుగ అలంకరించుకొన్నా ఏదో బరువుగా భారంగా వుంటున్నాయి. అయినా తీసివెయ్యడానికి బుద్ధిపుట్టదు. కోరి తెచ్చుకున్న బంధాలు కొన్నాళ్ళకి బరువెక్కుతాయి. అయినా అలవాటయిన ఆ బంధాలు తెంపలేము.

సాయంత్రం ఇంటికి వచ్చేటప్పుడే సుందరరావు పత్రిక కొని తెస్తాడు. స్నానం, భోజనం అన్నీ అయ్యాక తోటవేపు వసారాలో ఓ గంట పేపర్లో తలదాచుకుంటాడు. కామాక్షమ్మ తమలపాకులు చిలకలు చుట్టి దొంతర్లు పేరుస్తుంది.

సుందరరావు కొన్ని తీసుకుంటాడు. కామాక్షమ్మ మిగతావి గిల్లిపోస్తూ దిక్కులు చూస్తూ కూర్చుంటుంది. ఇద్దరికి ఏం మాటాడడానికి తోచదు. ఆఖరుకు అలవాటు చొప్పున ఆమె అడుగుతుంది, "పట్నంలో విశేషాలు ఏమిటీ" అని.

అతను పేపరు చదువుతూనే జవాబు చెబుతాడు. "ఏముంటాయి! మామూలే," అని.

అంతే, మళ్లా మౌనం, మళ్లా కాస్సేపటికి కామాక్షమ్మ మాటాడుతుంది. సమాధానంకోసం ఎదురుచూడకుండా ఏవో చెబుతుంది.

"మల్లెతీగ రెండు పువ్వులు పూసింది" "ఎర్రగులాబీ మొగ్గ రేపు విచ్చుతుందేమో"

"మామిడిపిందెలు ఎందుకో ఊరికేనే రాలిపోతున్నాయి"

"అబ్బా! సాయంత్రం ఎంత వర్షం! తోటంతా జలప్రవాహమైంది. అకాలవర్షం మంచిది కాదంటారు."

ఇల్లాగే ఏవోఏవో చెబుతుంది. అతను అన్నింటికి "ఆహా ఊహు" అంటాడు, పరధ్యానంగా! కంఠధ్వనినిబట్టి అతను వింటున్నాడో లేదో కూడా చెప్పలేం! చివరకు అతను అంటాడు.

"రేడియోలో మంచిప్రోగ్రాం ఏమైనా ఉందేమో! వినరాదూ" అని.

అంతే. దానితో ఆవిడ లేచిపోతుంది. ముందరివైపు పడకగదిలో ఓమూల బేటరీ రేడియో ఉంది. కామాక్షమ్మ స్విచ్ వేస్తుంది. అరవైరకాల ధ్వనులు వినిపిస్తాయి. వాటి

మధ్యనించి ఏదో సన్నగా పాటకూడా వినిపిస్తుంది. భయంకరమైన నిశ్శబ్దం ఒక్కసారి బ్రద్దలవుతుంది. ఎవరో తోడు ఉన్నారని ఊరట కలుగుతుంది. ఆలోచిస్తూ ఆలోచిస్తూ ఆవిడ నిద్రపోతుంది. అతను గదిలోకి వచ్చినప్పుడు రేడియో ఆపుతాడు.

అంతే అల్లాగే కాలం గడిచింది. ఆ జీవితంలో ఆశా లేదు, నిరాశా లేదు. ఉప్పొంగే ఉత్సాహమూ లేదు. క్రుంగిపోయే విచారమూ లేదు. ప్రశాంతమైన నదిలో కదిలీ కదలని నావలా గడచింది.

ఒక్కసారిమాత్రం పడవ చలించింది. చల్లనిగాలి చవిచూచింది. మోడు చిగిర్చింది. చైతన్యం కదలింది. కామాక్షమ్మ నవ్వింది.

ఆవేళ ఎండ తీవ్రంగా కాస్తోంది. మధ్యాహ్నం ఒంటిగంటై ఉంటుంది. కామాక్షమ్మ తోటవేపు గదిలో నిద్రపోతోంది, ముందరి వసారాలో ఏదో రెపరెపమన్నది. మగత నిద్రలో కామాక్షమ్మ ఏమిటోనని భయపడింది. మళ్ళా తోటలోంచి ఏదోపిట్టవచ్చి వసారాలో వాలిందనుకొన్నది. కళ్ళు మూసుకుంది. మళ్ళా వసారాలో రెపరెపమని రెక్కలు కొట్టుకున్నాయి. ఏమిటో చూద్దామని లేచివెళ్ళింది. వసారాలో కమ్మీలమీద పంచవన్నెల రామచిలుక నక్కి తల దాచుకున్నది. కామాక్షమ్మను బెదరిబెదరిచూచింది. ఆకుపచ్చని శరీరం రెక్కలసందున ఎరుపు, పసుపు,ఎర్రని ముక్కు, చూడ ముచ్చటగాఉంది. అంత అందమైన చిలుకను కామాక్షమ్మ ఎప్పుడూ చూడలేదు. మంత్రముగ్ధలా అలా చూస్తూ

ఉండిపోయింది. చిలుక పారిపోవాలని ప్రయత్నించింది. మళ్లా రెక్కలుకొట్టుకొని జాలిగా చూస్తూ అక్కడే ఆగిపోయింది. కామాక్షమ్మ దగ్గరకు వెళ్లింది. దాని కాలికి గాయం తగిలింది. అది కదలలేదు. "ఆమె అయ్యో పాపం! ఏ పిల్లో కుక్కో నోటకరచుకొంటే! అమ్మయ్యో!" అనుకున్నది. శంకరాన్ని పిలిచింది. అతను సునాయాసంగా పట్టుకున్నాడు, చిలుక అభ్యంతరం పెట్టలేదు.

కామాక్షమ్మ తనగదిలో తలుపులన్నీ వేయించి జాగ్రత్తగా దానిని దాచుకున్నది. మూడురోజులకు దాని గాయం మానింది. ఈలోపల కామాక్షమ్మ పట్నంనుంచి మంచి పంజరం తెప్పించింది. చిలుక శాశ్వతంగా బందీ అయింది. కామాక్షమ్మకు కావలసినంత కాలక్షేపం దొరికింది, అనుకోకుండా అనుబంధం ఏర్పడ్డది.

ఇప్పుడు ఆమెకు తీరికలేని పని. ప్రతినిమిషం చిలుక ఏంచేస్తుందో అన్న ఆతృత. దాని పంజరం శుభ్రంగా ఉన్నది గదా? గదిలోకి పిల్లి ఏదీ వెళ్ళలేదుగదా; తాను పెట్టిన పండుముక్కలు తిన్నదో లేదో! ఇవే ఆలోచనలు, ఆదుర్దాలు; దానికామె చిన్నారి అని పేరు పెట్టింది. అది ఎప్పుడో మాటలు నేర్చుకొని తియ్యతియ్యగ చిలుకపలుకులు పలుకుతుందని భ్రమ. ఆభ్రమతో గంటలు గంటలు దానిదగ్గర అర్థంలేని ముద్దుమాటలు తనే వాగేది. ప్రొద్దు గడచినదే తెలిసేదికాదు. సాయంత్రం అది ఎగిరిపోకుండా జాగ్రత్తగా పొదివిపట్టుకొని తోటంతా షికారుచేసేది.

ఇప్పుడావిడకు భర్తతోకూడ అంతులేని కబుర్లు.

ఆదుర్దాగ అతని రాకకోసం ఎదురు చూచేది. రాగానే గబ గబ చెప్పేది.

"చిన్నారి ఇవ్వాళ గుక్కెడు పాలుకూడా తాగలేదు".

"రెండు పండుముక్కలు మాత్రమే తిన్నది".

'పంజరంలోనుంచి తప్పించుకొని రెండు సార్లు గదంతా తిరిగిందండీ! కిటికీతలుపులు వేసున్నాయి గాని లేకపోతే!'

"చిన్నారికి మాటలు వస్తున్నాయండీ; నేను చెబితే త్వరగా నేర్చుకుంటున్నది; ప్రొద్దున నేను "అక్క" అంటే తనూ "అక్క" అన్నది."

ఇల్లాగే గుక్కతిప్పుకోకుండా కొన్ని విచారంతో, కొన్ని అమితోత్సాహంతో, చెప్పుకుపోతుండేది. అతనూ ఆసక్తితోనే వినేవాడు. ఏదో ఉత్సాహం ఉప్పెనలావచ్చి ఆమెను అలముకొన్నది. దాని ఛాయ అతనిమీద వాలింది. నౌకర్లకు వ్యాపించింది. ఇంట్లో వాతావరణమే మారింది.

ఆరు నెలలు కామాక్షమ్మ హృదయం ఆనందం అనుభవించింది. చిన్నారి హృదయం పంజరంలో బందీ అయి పరితపించింది. కామాక్షమ్మ ముఖం చిరునవ్వులతో చిందులాడింది. చిన్నారి రెక్కలు పంజరపు కమ్మీలను కొట్టికొట్టి విసిగి వేసారినాయి.

ఆవేళ మధ్యాహ్నమంతా జోరుగా వానకురిసింది. కిటికీసందులలోనించి జారిన వర్షపునీరు గది అంతా నిండింది. సాయంత్రం వర్షం వెలిసింది. తడిసిన ఆకుసందులోంచి మళ్లా ఎండ తళతళమన్నది.

కామాక్షమ్మ గది అంతా తుడిపించింది. ఆరుతుంది

గదా అని కిటికీరెక్కలు తెరిచింది. చిన్నారితో కబుర్లు చెప్పింది. పంజరం తెరచి పండుముక్కలు పెట్టింది. భోంచేశాక రేడియో పెట్టి, మంచంమీద నడుంవాల్చింది, భర్త కోసం ఎదురుచూస్తూ. ఆవేళ రైలు మామూలుకన్నా చాలా లేటయింది. ఎంతసేపటికి సుందరరావు రాలేదు. ఆలోచిస్తూ, ఆలోచిస్తూ, ఆమె అనుకోకుండా నిద్రపోయింది. ప్రొద్దుపోయి వచ్చిన సుందరరావు ఆమెను లేపలేదు.

మర్నాడు మగతకళ్ళతో కామాక్షమ్మ ప్రక్క మంచంకేసి చూసింది. సుందరరావు నిద్రపోతున్నాడు. పంజరంకేసి చూసింధి. చిన్నారిలేదు. పంజరం ఖాళీ. కామాక్షమ్మ అదిరిపడి లేచింది. పంజరం తలుపు తెరచి వుంది. క్రిందటి సాయంత్రం తెరచిన కిటికీలు తెరచినవి తెరచినట్టే ఉన్నాయి. కామాక్షమ్మకు దుఃఖం ముంచుకువచ్చింది. చిలుక ఏమైనట్టు! తను పంజరం తెరచినప్పుడు మళ్ళా మూయలేదు కాబోలు! ఎగిరిపోయి ఉంటుందా? కిటికీలో నించి పిల్లి వచ్చి ఎత్తుకుపోలేదు కదా! భయంతో ఆమె నిలువెల్లా వణికిపోయింది.

నౌకర్లను పిలచి అడిగింది. వాళ్ళ కేమీ తెలియదు. ఖాళీ పంజరం చూచి వాళ్లు తెల్లపోయారు. దిగులుతో తోటంతా వెతికారు. ఎక్కడా దొరకలేదు. చేసేది లేక ఊరుకొన్నారు. సుందరరావు లేవగానే చెప్పారు. అతను "అయ్యో పాపం" అన్నాడు, అంతే!

ఆరు నెలలకు ముందు ఆ చిలుక లేదు. ఎక్కడనించి వచ్చిందో ఎందుకు వచ్చిందో తెలియదు: మళ్ళా ఇప్పుడు

ఎక్కడకు వెళ్ళిందో ఎలా వెళ్ళిందో తెలియదు. తెలుసుకునే మార్గం లేదు.

ఖాళీ పంజరం చూసి కామాక్షమ్మ కుమిలి కుమిలి ఏడ్చింది. "నీకేమైనా పిచ్చా" అన్నాడు సుందరరావు. శంకరం పంజరం తీసి దాచాడు. అంతే! ఆ తరువాత ఎవరి పనులు వారు చూచుకున్నారు. వంటవాడు వంట ప్రయత్నంలో పడ్డాడు. శంకరం గదులు తుడిచాడు. తోటమాలి చెట్లకు నీళ్లు పెట్టాడు. సుందరరావు రైలు అందదేమోనని తొందర పడ్డాడు. అంతే. అంతకుముందు అక్కడ మరొక ప్రాణి ఉన్న గుర్తుకూడా ఎక్కడా లేదు.

చాలా సేపు కామాక్షమ్మ శూన్యంలోకి చూస్తూ కూర్చున్నది. ఆ చిలుకకూ ఆమెకూ ఉన్న అనుబంధం ఏమిటో, ఆవిడ పొందినదేమిటో, పోగొట్టుకొన్నదేమిటో ఎవరికీ అర్థంకాదు.

"ఈ కోటు బొత్తాములన్నీ ఊడిపోయాయి. త్వరగా కుడతావా? రైలువచ్చే టైమైనట్టుంది" అన్నాడు సుందర రావు.

మాట్లాడకుండా లేచి కోటు అందుకున్నది కామాక్షమ్మ. అంతే, ఆ తరువాత ఆవిడా చిన్నారి పేరెప్పుడూ మళ్ళా ఎత్తలేదు.

చాలారోజులకు మళ్ళా మోళ్ళన్నీ చిగిర్చాయి. మళ్ళా వసంతం వచ్చింది. మళ్ళా తోటంతా కిలకిలమంటూ ఆహ్వానం లేకుండానే చిలుకలువచ్చి వాలాయి. మామిడి పూత పరిమళం తోటంతా నిండింది. కామాక్షమ్మ మూగ

హృదయం మళ్లా మేల్కొన్నది.

తోటలో కిలకిలమనే చిలుకలను చూస్తుంటే ఆమెకు ప్రశాంతి కలిగింది.

చాలాకాలానికి ఆవిడమళ్లా తోటకేసి ఉత్సాహంతో చూస్తోందని గ్రహించిన శంకరం దగ్గరగావచ్చి అన్నాడు.

చూడండమ్మా! మామిడిపూత పూయగానే ఎన్ని చిలుకలువచ్చి వాలాయో! ఎంత బాగున్నాయో! మన పంజరం ఒకరోజు తోటలో కట్టిఉంచుతేచాలు, మళ్లా ఏదైనా చిలుక పట్టుబడుతుంది. మనం పెంచవచ్చు.

కామాక్షమ్మ అదిరిపడింది.

'వద్దురా! ఆపనిమాత్రం చెయ్యకు; అవి స్వేచ్ఛగా ఎంత ఆనందంగా ఉన్నాయో చూడు! వాటిని అలాగే హాయిగా బ్రతకనీ! ఇష్టం వచ్చినప్పుడు స్వేచ్ఛగా వస్తాయి, స్వేచ్ఛగా పోతాయి! అదే మనకు ఆనందం! ఎంతసేపైనా వాటినిచూస్తూ కూర్చోవచ్చు. అవన్నీ మనవి కావూ! బలవంతంగా ఒకదాన్నిమాత్రం చెరపట్టి బాధ కొనితెచ్చుకోవడ మెందుకూ! వృథా మమకారం! అన్నది.

ఈ మాటలు శంకరానికి అర్థంకాలేదు, విస్తుపోయి చూస్తూ ఊరుకున్నాడు.

తోటలోని చిలుకలన్నీ ఒక్కసారి కిలకిలా నవ్వాయి.

ఆశ

ఉన్నట్టుండి భోరున వర్షం కురిసింది....అందాకా శుభ్రంగా ఆకాశం తెల్లగా మిలమిలలాడింది. ఆ క్షణంలో అంత పెద్దవాన వస్తుందని ఎవరూ అనుకుని ఉండరు. ఆ ఉద్దేశంతోనే మూట చంకన పెట్టుకుని బయలుదేరింది, తను, ఎక్కడికి వెళ్ళాలో తెలియదు. అయినా వూరు చేరాలంటే బీడుపడిన ఆ ఖాళీ మైదానం దాటి రెండుమైళ్ళు పోతేనేగాని లాభంలేదు. ఆత్రోవే పట్టింది.

అప్పుడు సాయంత్రం నాలుగవుతుందేమో! ఎండ ఇంకా తీవ్రంగానే కాస్తోంది! మైదానం సగం దాటేవరకూ, కారుమబ్బులు ఎటునించి ముంచుకు వచ్చిందీ, తనకు తెలియనే లేదు. తలవంచుకొని తనసంగతే ఆలోచించుకొంటూ నడుస్తోంది! నడవగా, నడవగా ఈకా సదూరం అయిపోతుంది! ఊరు వస్తుంది! ఆ తరువాత ఏమవుతుందో! ఆ ప్రశ్నే తేలడం లేదు, ఆలోచించినా!

ఉన్నట్టుండి ఉరుములతో, మెరుపులతో, వడగండ్లతో ధనధనా పడింది వాన. అంతకు ముందు సన్నతుంపరకూడా లేదు. ఆ మైదానంనిండా ఉన్నవల్లా ముళ్ళపొదలే! సగం సగం ఎత్తు పెరిగి గుమ్మటాల్లాగ కాళ్ళకు, కొంగులకు అడ్డు తగులుతూ ఉంటాయి. అంతేకాని ఎండా, వానకు ఆశ్రయమిచ్చి ఆదుకునేవి కావు. దూరాన ఏదో ముళ్ళచెట్టే కొంచెం ఎత్తుగా ఉన్నట్లు కనిపించింది. దానికింద కాస్సేపు నిలబడితే

కనీసం తలతడువదేమో ! గబగబా ఒక్క పరుగున అక్కడకు వెళ్ళింది. ఎంత ఆతృత ! కాస్త తడిస్తే ఏమో ! ఏమి మమకారాలు ! పూర్తిగా మునిగిపోతూన్నప్పుడుకూడా దెబ్బ తగులుతుందేమోనని తల ప్రక్కకు తిప్పుకుంటాం !

పమిటకొంగుతో వళ్ళు ముఖమూ తుడుచుకొని ప్రక్కకు చూచింది. ఆ చెట్టు మొదట్లో అదివరకే ఒక ముసలమ్మ కూర్చుని ఉంది. ఎర్రమట్టిరంగు చీర, చాలీ చాలనిది కట్టుకుని ఉన్నది. ఆమె ముఖంమీది ముడతలనుబట్టి చెప్పాలంటే, ఆమె వయస్సు అనంతం అనొచ్చు. చూపు ఆనదు కాబోలు ! నుదుటిమీద చెయ్యిపెట్టుకొని పరికించి పరికించి చూస్తోంది. చూసి చూసి అన్నది, ఏదో ఆలోచించి ఆలోచించి గొప్ప సత్యం బయటపెట్టినట్లు—

"మంచి వాన" అని.

"ఊ" అన్నది తను. అంటూనే చేతిలో మూట క్రింద పడవేసి దానిమీద కూర్చున్నది. ఆమె ప్రక్కనే, అక్కడే ఓపికతో రోజంతా ముండ్లచెట్లన్నీ విరిచి, మూటకట్టిన పుల్లల మోపు ఉన్నది. ఆ అవ్వ తనదగ్గరఉన్న ఒక్క పాతబట్ట దాని మీద కప్పింది, ఎంతో పదిలంగా ! చలితో వణకిపోతున్నా తను కప్పుకోలేదు. అవి ఆమెకు ఎంత ప్రియమైనవో !

"ఈ పుల్లలు నీవేనా ?" అన్నది తాను—నడుము వంగి ఎముకలు బయటపడినవి, అన్నిపుల్లలు ఎట్లావిరిచింది, ఎట్లా మోసుకు వెడుతుందీ అనుకుంటూ.

"నాయె. రోజట్టుకెళ్ళి బామ్మలింటో యిస్తాను, రెండణా లిస్తారు" అన్నది అవ్వ.

"రోజూ వస్తావూ! ఎంత ఓపిక! రెండణాల కోసం ఎందుకీ యవస్థ? ఎవరూ లేరాయేం నీకు" అన్నది తను ఆశ్చర్యంగా

"లేకేం! ఉండారులే!" అంది అవ్వ విసుగ్గా, విరసంగా.

తను మళ్ళీ తరిచి అడుగలేదు. ఎవరో ఉంటారు! ఎందుకు ఉండరూ! తనకు లేరూ! పింతల్లి కూతుళ్ళూ, పెత్తల్లి కొడుకులూ, మేనత్త మనమలూ, ఇంకా ఎవరో! ఏమూల ఎవరున్నదికూడా, సరిగా తెలీకుండా! ఎవరుండీ ఏమి లాభము? మనిషి బ్రతికినన్నాళ్ళూ తనఖర్మ తననుభవించవలసిందే! బ్రతికి ఉన్నంతవరకూ ఏపుల్లలేరో, గడ్డిడోకో ఎల్లాగో పొట్టనింపుకోవాలి. అదీ తప్పదు!

తనకు ప్రొద్దుటిసంగతి గుర్తుకు వచ్చింది. ఆవేళ ప్రొద్దున్నే ఆరింటికే కబురంపించింది వార్డెనమ్మ. అప్పటికి అది ఆరోసారి ఆమె కబురుచేయడం. ఎందుకు పిలుస్తోందో తనకూ తెలుసు. వెళ్ళక తప్పదు కాబట్టి తను వెళ్ళింది. తన్ను చూస్తూనే సౌమ్యంగానే అడిగింది ఆమె.

"ఏమమ్మా, నీవు నిన్ననే వెళ్తానన్నావుగదా! ఇంకా వెళ్ళలేదేం?" అన్నది.

"వెళ్తానండీ, ఇవ్వాళ తప్పకుండా వెళ్తాను. అన్నీ సర్దుకున్నాను" అన్నది తను, ఆలోచించుకోకుండా, ఉదాసీనంగా.

ఆవిడ మళ్ళీ అన్నది నెమ్మదిగా.

"చూడమ్మా, ఈ పరిస్థితుల్లో నిన్ను వెళ్ళమనడం తప్పే, కాని నిన్ను ఉంచుకోడానికికూడా ఇటువంటి పరిస్థితుల్లో వీలులేదు. శరణాలయంపేరు పాడైపోతుంది" అని.

తను నవ్వుకొంది. ఆమాట ఆవిడ అనేకసార్లు చెప్పింది. ఈ శరణాలయం ఎక్కడా శరణులేని తనకోసం కాదు. గౌరవమర్యాదలు కలిగి దానికి మంచిపేరు ప్రఖ్యాతులు తీసుకురాగలిగినవారికోసమే!

వార్డెనమ్మ మళ్ళీ అన్నది.

"వెళ్ళేముందు నీసామానంతా ఓసారి చూపించి వెళ్ళమ్మా! ఎందుకైనా మంచిది" అని. ఆమాట ఆవిడ అనలేక అనలేక కష్టంగానే అన్నది.

తనకు నవ్వొచ్చింది. తను ఏమ్మి పట్టుకుపోతుంది? ఎక్కడికి? తనమూట రెడీగానే ఉంది. వెంటనే వెళ్ళి తెచ్చి చూపింది. రెండు తెల్లచీరలూ రవికలూ, ఇంకా తను ఎప్పుడో సముద్రపు ఒడ్డున ఏరుకొన్న తెల్లని, ఎర్రని, రంగు రంగుల గవ్వలూ, మూట విప్పతోంటే ఆ గవ్వలన్నీ జారి వార్డెనమ్మగదినిండా పడ్డాయి, గలగలా. ఆమె తెల్లపోయింది. కాని మాట్లాడలేదు. తను మళ్ళీ గవ్వలన్నీ ఒక్కొక్కటీ ఏరుకొని మూటకట్టుకున్నది. ఎందుకో! ఎప్పుడో తనకు కొడుకు పుడతాడు. వాటితో ఆడుకొంటాడు—అదీ ఆశ! ఏమో!

వార్డెనమ్మ అన్నది,

"నీసంగతి సుందరరామయ్యగారికికూడా రాశాను. నిన్ను పంపించివేస్తున్నట్లు చెప్పాను" అని, తనబాధ్యత చక్కగా నిర్వహించుకొన్నానన్న తృప్తితో నిట్టూర్చింది.

తను ఉలిక్కిపడింది. ఇంక తనకు ఆఆస్కారంకూడా లేదు. తను మళ్ళా ఆవూరు పోలేదు. బావగుమ్మంలో అడుగు

పెట్టలేదు. సుందరరామయ్యగారిముఖం చూడలేదు. ప్రపంచమంతా ఒక్కసారి శూన్యంగా కనిపించింది. ఆలోచించుకోకుండా దిగాలుపడిచూస్తూ అన్నది తను. "సాయంత్రందాకా ఉండనివ్వండి, సాయంత్రం తప్పకుండా వెళ్ళిపోతాను" అని.

అర్థంలేనిమాట! సాయంత్రంలోపల తన పరిస్థితి ఏవిధంగా మారుతుంది! అప్పుడుమాత్రం ఎక్కడికి వెడుతుందీ!

వాడెనమ్మ బాధపడుతూ అన్నది:

"సరే. సాయంత్రం తప్పకుండా వెళ్ళాలిసుమా! ఇంక ఆలస్యంచెయ్యటానికి వీలులేదు. ఆ! అందాకా నీమూటమాత్రం ఇక్కడే ఉండనీ! నీమంచికోసమే చెబుతున్నాను" అని.

తను మాట్లాడకుండా మూట వదిలేసి వెళ్ళిపోయింది. కష్టాలు వచ్చినప్పుడు ఎన్ని అవమానాలైనా భరించేశక్తి భగవంతుడే ఇస్తాడు!

* * *

వర్షం జోరు కొద్దిగా తగ్గుతోంది. గాలికి చెట్లు వూగి, వూగి, రాలిన ఆకులన్నీ ఒక్కసారి ఆప్యాయంగా ఒంటికంటుకుని పలకరించి పారిపోతున్నాయి! ముసలమ్మ పమిటకొంగు తలనిండా ఒంటినిండా కప్పుకొంది. ఆమెచూపులూ, వూహాలూ ఎక్కడో ఎంతోదూరాన ఉన్నాయి. ఏమాలోచిస్తోందో! లేదా ఏమీ ఆలోచించడంలేదో! ఈ వాన ఎప్పుడు తగ్గుతుందీ అనుకుంటోందేమో!

—తనకు ఈ వూరు వచ్చినరోజు గుర్తుకు వచ్చింది,

అప్పుడూ ఇల్లాగే ఒక్కతే ఒంటి మాటతోనే వచ్చింది. అయితే ఆవేళ వానలేదు. ఎండ మిలమిలా కాస్తోంది. ఊరు సందడిగా ఉన్నది. తను ముందుకు ఒక్కొక్క అడుగూ ఉత్సాహంతో వేసింది. శరణాలయం కనుక్కోడానికి ఎక్కువ సేపు పట్టలేదు. అబ్బ! అప్పుడే ఆరునెలలైంది. మొన్ననే రైలు దిగినట్లున్నది! ఒక్కత్తే.

బంధాలన్నీ ఎక్కడివక్కడే అనుకోకుండా తెగిపోతూ ఉంటాయి! అనుకోకుండానే మళ్ళీ మళ్ళీ కొత్తవి వెతుక్కుంటూ ఉంటాము! ముందుకు అడుగువేస్తే ఎక్కడికో! ఏమో! కాలుమాత్రం నిలవదు.

...ఆవేళ, 'అక్కయ్య పోయినరోజు, అంతా శూన్యం అనిపించింది. తను తల్లి నెరుగదు, తండ్రి నెరుగదు. తనకు వూహ తెలిసినప్పటినించి తనకంటియెదుట మెదలినది ఒక్క అక్కయ్య రూపమే! పచ్చని పల్చని-ముఖమూ, నల్లగా వత్తుగా ముందుకు వ్రాలిన ముంగురులూ, అరకాసంత ఎర్రని కుంకుంబొట్టూ,కదలినప్పుడల్లా చేతిగాజుల గలగల,కాలిమట్టెల చప్పుడూ! తన ప్రపంచమంతా ఇవే నిండుకున్నాయి. తనకు ఇంకొకరితో సంపర్కం అవసరం లేకపోయింది. పదహారేండ్లు వచ్చినా పసిపిల్లలాగా బ్రతికింది. ఏ మూలో చదివిన కథలే చదవడం, నిద్రపోవడం, అక్కయ్య పిలిచినప్పుడు పలకడం, అంతకన్న తనకేమీ తెలియదు. జీవితం అల్లాగే గడచి పోతుందనుకున్నది. ఒకరోజు ఇల్లా నిరాధారంగా నిలబడి, తన బ్రతుకు తెరువు తను చూసుకోవలసివస్తుందని కల్లోగూడా అనుకోలేదు!

—అకస్మాత్తుగా అక్కయ్య పోయింది. రెండురోజులు మాత్రమే జ్వరం కాసింది. అది ఎవరూ లక్ష్యపెట్టలేదు. మూడోరోజు అంతా మించిపోయింది. బావ మతిలేనివాడిలా అయ్యాడు. తనకు పరిస్థితిని అర్థంచేసుకోటానికే నాలుగు రోజులు పట్టింది. అక్కయ్య మళ్ళీ తనకీ జన్మలో తిరిగి కనిపించదని తను నమ్మలేకపోయింది. ఎక్కడో డాబామీద ఒంటరిగా పడుకొంటే, అక్కయ్య "ప్రొద్దుపోయింది. అన్నానికి రావేమే" అన్నట్టే ఉండేది.

—నాలుగురోజుల్లో ఇల్లంతా బావ బంధువులతో నిండిపోయింది. ఆ ఇంట్లో బావా, తనే పరాయివాండ్లు అయినారు. బావ ముందర గదిలో, తను డాబామీదా, ఇంట్లో విషయాలతో ఏమీ సంబంధం లేనట్లుగా, దిక్కుతోచక కూర్చునేవారు. క్రింద అందరూ ఏదో హడావిడిగా ఉండేవారు. ఏదో గుసగుసా మాట్లాడేవారు. ఒకరోజు పరధ్యానంగా తను క్రిందకు వెళ్ళింది. బావమేనత్త రామాయమ్మ పినతల్లి కుటుంబాయమ్మ మాట్లాడుకుంటున్నారు. అనుకోకుండా తను విన్నది:

"నలభై నిండలేదు. మళ్ళా పెళ్ళిచేసుకోక ఎల్లా జరుగుతుందీ!" అంటోంది రామాయమ్మ. నిట్టూర్పువిడుస్తూ అన్నది కుటుంబాయమ్మ: "ఇంట్లోనే ఉన్నదిగా, ఈడొచ్చిన మరదలు" అని.

తనగుండెల్లో రాయిపడింది. తల గిర్రున తిరిగింది. రామాయమ్మ మళ్ళీ అందుకుంది. "ఆ కన్నకూతురిలా పెంచి దాన్నెలా చేసుకుంటాడు! అయినా మరోసంబంధం

చేసుకొంటే, పాపం ఆ పిల్లగతేమవుతుందీ! ఇక్కడెలా ఉంటుంటుంది!"

తనకళ్ళు చీకట్లు క్రమ్మాయి. తను పడిపోయింది. ఆ సంభాషణ అంతటితో ఆగిపోయింది.

ఆరాత్రంతా తన కదే దిగులు. కన్నతల్లిలా పెంచిన అక్కయ్యే కాకుండా, తండ్రిలా ఆదరించిన బావకూడా తన కింక దూరమవుతాడు. ఒకరు లేక దూరమైతే, మరొకరు ఉండే దూరమవుతారు. ఈ ఇల్లు విడిచి ఎక్కడికి పోతుంది! ఏమీ తోచలేదు. డాబామీద ఎంతసేపు అలాగే ఏడుస్తూ పడుకున్నదో తన కే తెలియదు. ఎవరూ తన్ను పిలవలేదు. తనజోలికి రాలేదు. ఏదో దిగులు, భయం, బెంగ! ఎన్నో!

—ఉన్నట్టుండి ఎవరో తనమీద చెయివేశారు. జ్వరం వచ్చినట్లు కాలిపోతూన్న తనవంటి కది చల్లగా మంచులా తగిలింది. ఏదో హాయి కలిగించింది. తనకు తెలియకుండానే తానా చేతిని గట్టిగా పట్టుకొన్నది.

"అబ్బే! మీరిలా బాధపడితే ఎలా?" డాబాగదిలో అద్దెకున్న మురళిగొంతు. అప్పుడే వూరినించి వచ్చేడేమో! ప్రేమతో ఆప్యాయంగా తనకన్నీళ్ళు తుడిచాడు. తానా చేతిని గట్టిగా చెక్కిలి కదుముకొన్నది. ఆక్షణంలో ఎవరు తనకు దగ్గరగా వచ్చినా, దూరంగా త్రోసివేసేశక్తి తనకు లేదు. తనకు దగ్గరగా, తన్ను ఆదుకునేవ్యక్తి ఎవరో ఉన్నారన్న సంతృప్తి చాలును. ఎవరో తన్ను ప్రేమతో గుండెల కదుముకుని క్షణకాలం తనబాధ మరపిస్తే చాలును!

వారంరోజులుగా నిద్రలేని తనకళ్ళకు ఆక్షణంలో మైకంలా నిద్రకమ్మింది! అతని ఒడిలోనే నిద్రపోయిందేమో!

ఆమర్నాడు అతను కనిపించలేదు. ఆ తరువాత నెల రోజులవరకు అతను మళ్ళీ కనిపించలేదు. అతను ఏమైనదీ ఎవరినీ అడిగే సాహసం తనకు లేకపోయింది. ఈ లోపల బావ బంధువులు తన కా ఇంటిలో ఇంక స్థానంలేదని పదే పదే, సూచించారు. తనకు దిక్కు తోచలేదు. సమయానికి బావ స్నేహితుడు సుందరరామయ్యగారు సహాయపడ్డారు. ఈ శరణాలయంలో ఉద్యోగం ఖాళీగా ఉన్నదని చెప్పి పంపించారు.

*　　　*　　　*

వాన పూర్తిగా తగ్గిపోయింది. ముసలమ్మ మోపు తీసుకొని బయలుదేరింది. తనూ వెనకాలే వెళ్ళింది. మబ్బులు త్రోసుకొని సన్నగా చంద్రుడు కనిపిస్తున్నాడు. వెనకాలే ఒక్క నక్షత్రం నిశ్చలంగా నిర్మలంగా ప్రకాశిస్తోంది. ఆ చందమామను, నక్షత్రాన్ని చూస్తూ అడుగులు ముందుకు వేసింది, తను.

ఉన్నట్టుండి, ముసలమ్మ అడిగింది:

"ఏ పేటకు బోవాల నువ్వు?" అని.

తను నవ్వుకొన్నది.

"ఏపేట అయినా ఒక్కటే నాకు. ఎక్కడా ఎవరూ లేరు" అన్నది తను. ముసలమ్మ విస్తుపోయింది.

ఎందుకో తనరహస్యాలు ఈ అవ్వకు చెబితే ఫరవా లేదనిపించింది తనకు. తనను విమర్శించటానికిగానీ, ఆక్షేపించ

టానికిగానీ అవ్వకు తీరికా, ఓపికా రెండూ ఉండవు. అనవస రంగా అక్కరలేని కాఫీ త్రాగుతూనో, పేకాడుతూనో, అందరి సంగతి చెప్పుకొని ఆక్షేపించటానికి అదృష్టవంతులు కొందరికి మాత్రమే సాధ్యం!

"ఒక్కతైవే, యాడుంటావు?" అవ్వ మళ్ళీ అడిగింది.

ఏమో! ఎక్కడ ఉంటుందో! తనకా ఆలోచనే లేదు. ఎందుకో తనకు ధైర్యంగానే ఉన్నది. తనకు మళ్ళీ ఎక్కడైనా ఉద్యోగం దొరుకుతుంది. తనకు కొడుకుపుడతాడు. మురళి తనను వెతుక్కుంటూ వస్తాడు! ఈ కలల అంచులు పట్టుకొని తాను ప్రపంచమంతా ఒంటరిగానే తిరుగగలదు. యుగ యుగాలు కనిపెట్టుకొని ఉండగలదు!

"నాకు కొడుకు పుడతాడు" అన్నది తాను, అవ్వతో ఎంతో ఉత్సాహంతో!

ముసలమ్మ గొణిగింది.

"ఆ! కొడుకు పుడతాడు! పెరిగి పెద్దోడవుతాడు. తీర్థానికిబోతే ఓ అమ్మి ఆడిని జూసి నవ్వుతాది! అంతే! నీ కొంగొదిలేసి దానికొంగుచ్చుకుంటాడు. అంతే! మళ్ళా కాళ్ళూ సేతులూ కట్టెపుల్లలే మిగల్తాయి, మనకు" అన్నది.

ఏమిటో! సొంతగొడవ కాబోలు! తనకు అర్థంకాలేదు. ముందుకు అడుగువేస్తే ఎదురుగుండా నెలవంక, ఒక్క నక్షత్రం, అంతే స్వాగతం చెపుతున్నాయి. ఎందుకో హృదయం ఆనందంతో నిండిపోయింది.

అందని ఆదర్శం

"కాఫీ ఎట్లావుందీ!" అని అడిగింది పేపరు చదువు తున్న భర్తను శాంత ఆదుర్దాగా.

అతను మాట్లాడలేదు. ఎక్కడో స్వప్నలోకంలో నగిషీ చెక్కిన చీనాకప్పుల్లో, వేడివేడికాఫీ పొగలూరుతోంది, ఆ కాఫీ అతను రుచిచూడలేదు. కాని ఏకాఫీకి దాని రుచిలేదు.

శాంతకి అతని మౌనం అర్థంకాకపోలేదు. అతను ఎప్పుడూ జవాబు చెప్పడు. ఎప్పుడైనా చాలా బలవంతంచేస్తే ముభావంగా "బాగానే ఉన్నది" అంటాడు. అయినా పది హేనేళ్ళనుంచి మంచి కాఫీచేసి అతని మెప్పును పొందాలన్న ప్రయత్నం ఆమె ఎప్పుడూ మానుకోలేదు. ప్రతిసారి విసుగు లేకుండా అడుగుతూనే ఉంటుంది, "ఎట్లావుంది" అని, అంతే.

కాస్సేపటికి భర్త మాట్లాడాడు.

"మొన్న పోటీకి కథ పంపించాను చూశావూ? ఆ రిజల్టు ఇవ్వాళ తెలుస్తుంది" అన్నాడు. 'ఆహా' అన్నది శాంత లేని ఉత్సాహం తెచ్చిపెట్టుకుంటూ. ఎప్పుడో ఆరు నెలలక్రిందట వ్రాసి పంపిన కథ ఆ విషయం జ్ఞాపకం చేసు కోటానికి ప్రయత్నించింది. ఆ వేళ అతను చదువుతూవుంటె తను నిద్దరపోతూ కళ్ళునులుముకుంటూ విన్నది. అతను అమితోత్సాహంతో ఆ కథ ఎంతో బాగున్నదనుకున్నాడు. తనకిమాత్రం అట్టె నచ్చలేదు. అయినా ఆమాట అతనికి

చెప్పలేదు. ఆ కథ ఏమిటో తనకి బాగా జ్ఞాపకం రాలేదు. తనకెందుకు బాగుండలేదో! ఇంకొకసారి చదివితే! ఏమో!

అతను ఇంకా ఉత్సాహంతో చెప్పుకుపోతున్నాడు.

"ప్రథమ బహుమతివస్తే ఎంత బాగుంటుంది. చక్కగా 500 రూపాయలు. నిన్ను కాశ్మీర్ తీసుకుపోతాను" హుషారుగా నవ్వాడు. ఆ కంఠంలో బహుమతి రాదేమోనన్న సందేహమెక్కడా వినిపించలేదు. తనకన్న ఎవరు బాగా వ్రాయగలరు, అన్న గర్వం బహుమానం తనకు రాకపోతే ఇంకెవరికివస్తుందన్న ధీమా ప్రతిధ్వనించినవి.

శాంత నిట్టూర్చింది. 500 రూపాయలు వస్తే ఏమి చెయ్యవచ్చునో ఆమె ఆలోచించుకోసాగింది. ఒక లక్ష ఖర్చులు ఆమె కళ్ళముందు నాట్యమాడినవి. అసలు ఆ డబ్బు ఎందుకూ సరిపోదు. కాని ఆ బహుమతివస్తే తనభర్త సంతోషిస్తాడు. అది అతనికెంతో గౌరవం!

కిటికీలోనుంచి చల్లనిగాలి విసరింది. ఆకాశమంతా మేఘావృతమైంది. నల్లని మబ్బులు అటూఇటూ పరుగెడుతున్నాయి. ఎడతెఱిపిలేని వాన కురియటానికి వాగ్దానం చేస్తున్నది. ఆమె ఒక్కక్షణం ఆకాశంకేసి చూస్తూ ఉండిపోయింది. ఏదో స్ఫురణకు వచ్చింది. ఎప్పుడో చిన్నప్పుడు ఒకసారి ఆకాశంకేసి చూస్తూఉండిపోయింది. నల్లని మబ్బు కొసలలో అస్తమిస్తున్న సూర్యుని వెండికిరణాలు పడి తళతళ మెరుస్తున్నాయి. అది చూస్తున్నంతసేపు ఆమె మనస్సులో ఒక్కటే కోరిక మెరిసింది. వెండి జరీపూలతో నీలిమబ్బుచీర కట్టుకొని తనూ ఒక మబ్బుకన్యలా ఉండగలిగితే! ఆ కోరి

కను ఆమె సిగ్గుపడింది. కాని ఆకాశంలో మేఘాలు చూసి నప్పుడల్లా ఆ ఆశ మనస్సులో కదులుతూనేఉంటుంది. ఎన్నేళ్లు గడచినా అది అణగిపోనేలేదు !

చలిగాలి ఎక్కువవుతుందేమోనని కిటికిమూసింది. అతను కాఫీ త్రాగి ముందుగదిలోకి వెళ్ళాడు. ఖాళీకప్పు చేతిలో పట్టుకొని ఆమె వంటయింటివైపు వెళ్ళింది. ఒక్క క్షణంలో గృహకార్యాల్లో మునిగిపోయింది.

రోజంతా వాన కురుస్తూనేవున్నది. మధ్యాహ్నం మండువాలో కూర్చుంది. అప్పుడే వాన కొద్దిగా తగ్గుముఖం పట్టింది. గాలి ఎక్కువగా వచ్చినప్పుడల్లా చిన్నచిన్న వాన తుంపరలు మంచుబిందువుల్లా ముఖంమీద పడుతున్నాయి. ముసురుగావుంటే మనస్సంతా మసకగానే ఉంటుంది. ఏదో చికాకుగా ఉంటుంది. ఆ చల్లగాలి, నీటిజల్లు ఆహ్లాదకరంగా వున్నా, ఏదో నిరాశ కలిగిస్తోంది.

పెరటివేపునించి నాగన్న కంఠస్వరం అవ్యక్తంగా వినిపిస్తోంది. అది రోజూ మామూలే. మధ్యాహ్నం గిన్నెలు కడుగుతున్నప్పుడల్లా నాగన్న తనగోడు కొళాయితో చెప్పు కుంటూవుంటాడు. గిన్నెల చప్పుడుతో మేళవించి, కొళాయి నీటితో ఏకీభవించి నాగన్న గొణుగుడు అస్పష్టమైన రోదన ధ్వనిగా పరిణమిస్తుంది. ఇవ్వాళ అది వానహోరుతో కలిసి కదలిపోతోంది.

ఎప్పుడో కొన్నాళ్ళక్రిందట నాగన్నమామ రంగం పోయి ఆరునెలల్లో ఆరువందలు సంపాదించుకువచ్చాడు. అప్పటినుంచి నాగన్నతత్వం మారింది. తనూ రంగంపోతే !

అతని హృదయంలో ఆశ రేకెత్తింది! ఇక్కడ ఎన్నాళ్ళు కూడబెడితే ఆరువందలు కాను: కాని రంగం ఎట్లాపోవాలో ఏం చెయ్యాలో వాడికి తెలియదు. అనుకుంటూనే రోజులు గడిచిపోతున్నాయి. వాడికి జీవితంమీద విరక్తి కలుగుతోంది. ఆ నిరాశ అంతా గిన్నెలు తోమేటప్పుడే ఉబికివస్తుంది. రంగం అంటే ఏదో స్వర్గమని వాడి భ్రమ!

నాగన్న వచ్చి చెప్పాడు. "మీకోసం అతనెవరో వచ్చాడు" అని.

శాంత ముందు సావిట్లోకి వెళ్ళింది. కనకయ్య బట్టల మూటతో కూర్చుని ఉన్నాడు.

'ఇదేమిటయ్యా, ఇంతవానలో వచ్చావు' అన్నది.

"ఇవ్వాళే వచ్చానండి. మళ్ళీ రేపు వెళ్ళిపోవాలి. మీరు నెయ్యమన్నారూ? ఆచీర తెచ్చాను" అన్నాడు.

ఏ చీర! ఎప్పుడో ఏడాదిక్రిందట చెప్పింది. చప్పున గుర్తురాలేదు. కనకయ్య చీరతీసి చూపాడు. ముదురు నీలం జరీచీర. శాంతకి అప్పుడు జ్ఞాపకం వచ్చింది. కాని తాను చెప్పిన చీర అదికాదు. లేత మబ్బురంగు వెండి జరీ పువ్వులు, బంగారురంగు అంచు, ఇంకా ఏమేమో చెప్పింది. పాపం అతనికి అర్థమైనట్లులేదు. ఆ చీర తను అనుకున్నట్టు తేలిపోతూన్న మేఘంలా లేదు. చెయ్యిజారి సిరా వలకబోసి నట్లున్నది.

కాని తన నిరాశ నతనికి చూపించలేదు. చీర నచ్చ లేదని చెప్పలేదు.

"సరే, ఉంచి వెళ్ళండి" అన్నది.

“చిత్తం, అరవై రూపాయలైందండి ఆ చీర అసలు ఖరీదు, చాలశ్రమపడి తయారుచేయించాను. కొంచెం ఇప్పుడే ఇప్పిస్తే వీలుగా ఉంటుంది” అన్నాడు.

శాంతకు నవ్వువచ్చింది. తద్దినం కొనితెచ్చుకున్నట్లున్నది. తన కక్కరలేదని చీరతప్పనిసరిగా కొనుక్కోవలసి రావడం!

ప్రొద్దున మూసిన కిటికీలు మళ్ళీ సాయంత్రం తెరచింది. వానవెనుకబట్టిందిగాని, చీకటి ముసురుకొస్తున్నది. దూరాన కొండశిఖరాలు మేఘాల్లో కలిసిపోయి ఆనవాలు కూడా తెలియటంలేదు.

ఎప్పుడో ఎగ్జిబిషన్‌లో చూచిన అమెరికన్ చిత్రం ఒకటి జ్ఞాపకంవచ్చింది. అందులో ఏమీలేదు. ఎత్తైన కొండ శిఖరాలు మంచుతో నిండిఉన్నాయి. ఆ కొండచుట్టూ గడ్డిపూలు విరియబూచి ఉన్నాయి. ఆ శిఖరాలు ఆకాశాన్నందుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. ఆ గడ్డిపూలు ఆ కొండ పాదాలను ముద్దుపెట్టుకుంటున్నాయి. ఆ బొమ్మలో అంతరార్థం ఏమిటో? ఆచిత్రం తన్ను విపరీతంగా ఆకర్షించింది. ఎందుకో?

వీధివాకిలి చప్పుడైంది, సైకిలుత్రోసుకుంటూ బాబు లోపలికివచ్చాడు. చాల అలసిపోయినట్లున్నాడు.

“ఇవ్వాళ ఇంత ఆలస్యం అయిందేరా?” అన్నది శాంత.

“ఊఁ, వర్షం తగ్గుతుందేమోనని ఉండిపోయాను” అన్నాడు విసుగ్గా. చేతిలో ఏదోకాగితాలకట్ట ఉన్నది.

"నీ పేపరు ఇచ్చారా ఏంరా?" అన్నది.

"ఆ" అన్నాడు.

"ఎన్ని మార్కులు వచ్చాయి?" ఆత్రంగా అడిగింది.

"57" అని చిరాకుగా అని కాగితాలకట్ట ఆవిడదగ్గరగా పడేశాడు. ఎంత కష్టపడి చదివినా మార్కులు అంతకు మించవు. ఆ మిగతా మార్కులు ఎందుకురావో వాడికి అర్థం కాదు.

శాంత ఓదార్పుగా అన్నది. "ఈసారి బాగా చదువుదువుగాన్లే"

"అవున్లే" వెక్కిరింపుగా అని లోపలికి వెళ్ళాడు.

ఇంకా రాత్రి కాకపోయినా దీపాలు వెలిగించింది. ఆ దీపాల వెలుగులో కూడ ఇల్లు ఎందుకో కాంతివిహీనంగా కనుపించింది. ఏదో చెప్పలేని ఒంటరితనం, నిరాశ, భయం ఇల్లంతా వ్యాపించాయి.

అతను వచ్చాడు. చేతిలో ఆ సాయంత్రం పేపరు కనుపించింది. "ఏమైంది ఏమైంది" అన్నప్రశ్న తొందరగా ఆమె పెదవులదాకావచ్చి ఆగిపోయింది. అతని ముఖం చూస్తే అడగ బుద్ధి పుట్టలేదు. పేపరు తీసుకొని తనే చూసింది. అతనికి ద్వితీయ బహుమానం వచ్చింది. తగిన కథ లేక ప్రథమ బహుమానం ఎవరికి ఇవ్వలేదట. ఒక్కక్షణం శాంత నిరాశ చెందింది. కాని మళ్ళీ ఉత్సాహం తెచ్చుకుంది. "పోనిద్దురూ, మొదటి బహుమానం అసలెవ్వరికి రాలేదుగా?" అన్నది.

అతను తలమెత్తి చిరాకుగా వెక్కిరింపుగా అన్నాడు.

"అదికాదు మన కథ మొదటి బహుమానానికి పనికి రాలేదుగదా! ఇంకొకరికి వస్తేనేం రాకపోతేనేం?"

శాంత మాట్లాడలేకపోయింది, అక్కడ ఉండి చేసేది లేక లోపలికి వెళ్ళింది. కాస్సేపటికి కాఫీ తెచ్చి బల్లమీద పెట్టింది.

"త్రాగండి చల్లారిపోతుందేమో?" అన్నది.

అతను ధ్యానసమాధిలోనుంచి తొందరగా మేల్కొన లేదు. ఈసారి శాంత కాఫీ "ఎట్లా ఉంది?" అని అడగలేదు.

వేడికప్పులో నుంచి సన్నని పొగ తెరలుతెరలుగా లేచి చూరును అందుకోవాలని ప్రయత్నిస్తోంది కాని మధ్య లోనే మాయమైపోతోంది.

బయట అంతా చీకటిమయం. మబ్బుతెరలను చీల్చు కొని ఒక్క క్షణం ఓ చిన్ననక్షత్రం కిటికీలో నుంచి తొంగి చూచింది. మళ్ళీ మాయమై పోయింది.

వదలిన భయం

"ఎప్పుడుచూసినా ఒంటరిగా ఏదో ఆలోచిస్తూ ఉంటారు. అల్లా ఉండకూడదు. ఏదైనా చదువుకోండి. లేకపోతే మెదడు పాడైపోతుంది. పోనీ మీవాళ్ళెవరైనా వచ్చి కబుర్లుచెపుతూ ఉండగూడదూ? ఎవళ్ళూ రాలేం?" అన్నది అప్పుడే గదిలోకి అడుగుపెట్టిన నర్సు శ్యామల. ఎర్రగా, పొట్టిగా, బొద్దుగా ఉంటుంది. ఎప్పుడూ నవ్వుతూ చలాకీగా సంతోషంతో ఉప్పొంగుతూ ఉన్నట్లుంటుంది. పనికూడా చురుగ్గా ఎంతో నేర్పుతో చేస్తుంది. శ్యామల గదిలోవున్న కాస్సేపు రాజేశ్వరమ్మ సంతోషంగా వుంటుంది. శ్యామల మాటకు జవాబుగా చిరునవ్వుతో అన్నది.

"ఏం చేయమంటారూ? ఎప్పుడూ నిద్రరాదుగా? మావారు తెచ్చిన పత్రికలన్నీ మొన్ననే చదివేశాను" అని.

శ్యామల మామూలుగా సాయంత్రంవేళ అందరికీ జ్వరం అదీ చూసి వ్రాసిపెట్టాలి. అందుకే వచ్చింది. ఆపని పూర్తిచేసింది. తిరిగి వెళ్ళబోతూ రాజేశ్వరమ్మను ఒంటరిగా వదలి వెళ్ళలేక సంకోచిస్తూ మళ్ళీ అన్నది. "పాపం ఒంటరిగా వున్నారు. మీవారు వచ్చి నాలుగురోజులైనట్లున్నది. మీఅమ్మాయికూడా రాలేదే?"

రాజేశ్వరమ్మ విచారం దాచుకుని చిరునవ్వుతో అన్నది. "ఫరవాలేదు, మీరు వెళ్ళండి. నాకు అలవాటేగా ఒక్కదాన్నీ వుండడం. మీరింకా అందర్నీ చూచుకోవద్దూ?"

"మరే! ఇంకా తక్కినగదులకు వెళ్ళాలి, మళ్లా వస్తా" అని అంటూ వెళ్ళిపోయింది శ్యామల.

రాజేశ్వరమ్మ శూన్యంగా, తిరుగుతున్న సీలింగ్ ఫాన్ కేసి చూస్తూ పడుకుంది. ఆమె ఈ నర్సింగ్ హోమ్‌లో జేరి ఆరునెలలైంది. పెద్ద జబ్బేమీలేదు. రక్తహీనత, నరాల బలహీనం, ఇంట్లోవుంటే విశ్రాంతి తీసుకోదని, నర్సింగ్ హోమ్‌లో వుంటే విధిగా విశ్రాంతి ఉంటుందని చేర్పించారు. కాని ఆమె కోలుకోవటంలేదు. ఎన్నిమందులు వాడినా రోజు రోజుకూ క్షీణించిపోతూనేవుంది. కారణం కనిపెట్టలేక డాక్టరు తెల్లపోతున్నాడు. మందులు మార్చి మార్చి వాడుతున్నారు.

రాజేశ్వరమ్మ భర్త కోటేశ్వరరావు ఒక పెద్ద కంపెనీలో మేనేజరు, వేయిరూపాయల జీతం, యింట్లో వంటవాడు, నౌకర్లు, కారు, టెలిఫోను అన్నిహంగులు ఉన్నాయి. ముగ్గురు పిల్లలు. పెద్దకూతురు కామేశ్వరి దూరాన జబ్బల్‌పూర్‌లో వున్నది. ఆపిల్ల భర్తకక్కడ ఉద్యోగం. దూరాన వుండడంచేత ఎప్పుడోగాని పుట్టింటికి రాదు. ఏడాదిక్రిందట పురిటికివచ్చి వెళ్ళిన పిల్ల మళ్ళా రానేలేదు. రాజేశ్వరమ్మకు సుస్తీఅని తెలిసినప్పటినుంచీ రావాలనే ప్రయత్నం, అల్లాగే పోతోంది. కొడుకు పైచదువులకని అమెరికా వెళ్ళి రెండేళ్ళయింది. ఈ నెల్లోనో, పైనెల్లోనో వస్తాడనుకుంటున్నారు. దూరానవుండి దిగులుపడతాడని అసలతనికి రాజేశ్వరమ్మ సుస్తీ సంగతి రాయనేలేదు. చిన్నకూతురు సుజాతమాత్రం ఇంటిదగ్గరేవుండి చదువుకుంటోంది. రాజేశ్వరమ్మ నర్సింగ్

హోమ్‌లో చేరినప్పటినుంచి యింటి భారమంతా ఆపిల్ల మీాదే వుంది. ఏమీా తెలియకపోయినా ఎట్లాగో జరుపుతున్నది.

రాజేశ్వరమ్మ ఇంట్లో ఉన్నన్నాళ్లు అన్నీ ఆవిడే చూసుకునేది. ఇంట్లో ఎందరువున్నా పూలల్లో దాగిన దారంలా, వెనకాలవుండి తాను ఏపని చేస్తున్నదీకూడా ఎవరికీ తెలియకుండా, అన్నీ చూచుకుంటూవుంటే అందరికీ అన్నీ వేళకు అందుతూవుండేవి. కోటేశ్వరరావుకు నీళ్ళగది లోకి వెళ్ళినప్పుడు సబ్బూ, తువ్వాలూ తయారుగా ఉండడం, బల్ల దగ్గరకు వెళ్ళినప్పుడు భోజనంకానీ, కాఫీ ఫల హారంగాని తనకోసం ఎదురుచూస్తూ ఉండడం అంటే తెలుసునుగాని అవన్నీ ఎవరు అమర్చిపెడుతున్నారో తెలిసేది కాదు. అతనూ పట్టించుకునేవాడు కాదు. అతనికి ఎప్పుడూ ఆఫీసు, క్లబ్బూ, స్నేహితులు, విందులు ఇల్లా కార్యక్రమం సరిగ్గా ఉండేది. భార్యతోగాని, పిల్లలతోగాని కూర్చుని కబుర్లుచెప్పడానికి ఎక్కువ తీరిక ఉండేదికాదు.

ఓరోజు అతను కాఫీ తాగుతూవుండగా "ఇంకా స్తేనా ?" అన్నది పక్కనే నిలబడిన భార్య రాజేశ్వరమ్మ. కొత్తగాతోచిన ఆ కంఠం విని ఉలిక్కిపడి తల పైకెత్తి చూశాడు కోటేశ్వరరావు.

"అదేమిటే? అంత నీరసంగావున్నదిమాట" అన్నాడు. రాజేశ్వరమ్మ కలవరపడింది.

"ఆఁ! ఏమిటో! నీరసంగానే ఉంటోంది. ఒంటో బాగుండడంలేదు" అన్నది నిర్లక్ష్యంగా మాట తుంచెయ్యాలని ప్రయత్నంచేస్తూ. కోటేశ్వరరావు మరింత ఉలిక్కి

పడ్డాడు. అప్పుడే రాజేశ్వరమ్మను నఖశిఖపర్యంతమూ పరికించి చూశాడు. మనిషి పాలిపోయివున్నది. శరీరం ఎముకలుతప్ప ఏమీలేనట్లు ఎండిపోయివున్నది. కళ్ళల్లో కాంతిలేదు. కోటేశ్వరరావుకు అంతా అయోమయంగా తోచింది. కంగారుపడుతూ అన్నాడు.

"నాతో ఎందుకు చెప్పలేదూ ఒంటో బాగుండలేదని? ఉండు డాక్టరుగార్ని రమ్మంటాను సాయంత్రం."

"ఏమని చెప్పనూ? ప్రత్యేకం జబ్బేమీ లేదుగా?" అన్నది రాజేశ్వరమ్మ నెమ్మదిగా. కోటేశ్వరరావు వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రంనుంచి డాక్టర్ శోభనాచలం వచ్చి వైద్యం ప్రారంభించాడు. ఓ నెలరోజులు వస్తూ పోతూ వుండగా ఆయనకూ అర్థమైంది రాజేశ్వరమ్మ ఇంటి పరిస్థితి. ఇంటో వుండి ఎన్నిమందులు తిన్నా ఏమీ లాభంలేదు. రాజేశ్వరమ్మకు మనస్సుకూ శరీరానికికూడా విశ్రాంతి వుండదు. అంచేత నర్సింగ్ హోమ్‌లో చేరితే తప్ప ప్రయోజనంలేదు. అక్కడ త్వరగా కోలుకోవచ్చు అనుకున్నాడు. ఆమాటే చెప్పాడు కోటేశ్వరరావుతో. అతను వెంటనే ఒప్పుకున్నాడు. రాజేశ్వరమ్మకు ఇల్లువదలి నర్సింగ్‌హోమ్‌కు వెళ్ళాలని లేదు. కాని ఆమెకూ తెలుసు. ఇంటిదగ్గరే ఉన్నాళ్ళు తనకు విశ్రాంతి వుండదని. ఇంటికి ఎవరైనా అనుకోకుండా అతిథులు వచ్చినప్పుడే వంటవాడికి తప్పనిసరిగా తలనొప్పి వస్తుంది. ఇంట్లో ఎవరికైనా సుస్తీగా ఉన్నప్పుడే పనిమనిషికి అవసరంగా ఊరికి వెళ్ళవలసి వస్తుంది. అంచేత తనకు చాకిరీ తప్పదు.

ఎంత ఓపిక లేకపోయినా చేయక తప్పదు. అందుకని ఆమె మాట్లాడకుండా ఊరుకున్నది. కోటేశ్వరరావు ఆమెను నర్సింగ్ హోమ్‌లో చేర్పించాడు.

ఆ నర్సింగ్ హోమ్ ఊరిచివర ఉన్నది. విశాలమైన ఆవరణ, పెద్ద తోట, మధ్యన పెద్ద పెద్ద గదులతో బంగాళాలు. రాజేశ్వరమ్మ గది మేడమీద వున్నది. వరసగా గదులు,ముందర పెద్ద వరాండా, ఈ చివరా ఆచివరా మాత్రం వరండాముందుకు మలుపు తిరిగి అక్కడ మళ్ళాగది. రాజేశ్వరమ్మ ఆ చివరగదిలో వుంటున్నది. ఆమెకు తక్కిన గదుల్లో ఉన్నవాళ్ళతో ఏమీ సంబంధం లేదు. ఎప్పుడైనా వసారాలో జనం తిరుగుతూ ఉన్నప్పుడు అలికిడి అయ్యేది. అంతే. రాజేశ్వరమ్మ ఎప్పుడూ అటువేపు వెళ్ళేదికాదు. అటు వేపు ఉన్న కిటికీ తెరిచేదికాదు. తన గదిలో తాను ఒంటరిగా వుండేది.

నర్సింగ్ హోమ్‌లో సాయంత్రం నాలుగు నుంచి ఉదయం పదిగంటల వరకు నర్సు శ్యామల వుంటుంది. పది నుంచి నాలుగువరకూ మధ్యాహ్నమంతా కోమల వుంటుంది. వీళ్ళిద్దరే మేడమీద గదులన్నీ చూచుకుంటారు. కోమల ఆకారమూ, స్వభావమూ శ్యామలకు అన్నివిధాల విరుద్ధంగా వుంటాయి. కోమల నాజూకుగా, నల్లగా, నీరసంగావుంటుంది. పలకరిస్తేనేగాని మాట్లాడదు. అదైనా అడిగినదానికి సమాధానం చెప్పటంవరకే. తన పని మాత్రం శ్రద్ధగా, విధిగా చేసుకుపోతూంది. రాజేశ్వరమ్మకు కోమలతో ఎక్కువ పరిచయం కలగలేదు. కోమల వున్నంతసేపు రాజేశ్వరమ్మ

నిద్రపోతుంటుంది. కనీసం మాట్లాడాల్సిన అవసరం లేకుండా కళ్లు మూసుకు పడుకుంటుంది. 'ఇది నా బాధ' అని చెప్పటం గాని, 'ఇది నాకు కావాలి'అని అడగటంకాని రాజేశ్వరమ్మకు ఎప్పుడూ అలవాటు లేదు. నర్సులు వేళ కిచ్చిన మందులు పుచ్చుకొని యింటినుంచి ఆహారం వచ్చినప్పుడు తినేది. అంతే. ఇక సంభాషణకు ఎక్కువ అవకాశమూ వుండదు.

సాయంత్రం వచ్చిన శ్యామల మాత్రం తీరికవున్నప్పుడల్లా వచ్చి కూర్చుని రాజేశ్వరమ్మతో కబుర్లు చెపుతూ వుంటుంది. ఆవిడ కుటుంబ వ్యవహారాలు అడిగి కనుక్కుంటూ వుంటుంది. లేదా తక్కిన గదుల్లోని పేషంట్ల కథలు చెబుతూ వుంటుంది. ఒంటరిగావున్న రాజేశ్వరమ్మను చూస్తే శ్యామలకు చాలాజాలి. తక్కిన గదుల్లో వాళ్ళందరికి రోజూ యింటి దగ్గరనుంచి ఎవరో ఒకరు వస్తూ పోతూవుంటారు. సాయంత్రం వేళ ఇంకా చాలామంది వస్తారు. రాజేశ్వరమ్మకు రెండు మూడు రోజుల కొకసారి తప్ప ఎవరూరారు. ఇంటిదగ్గర భర్తా, చిన్నకూతురు తప్ప ఎవరూలేరు. వాళ్ళకు తీరిక వుండదు. ఎప్పుడైనా వచ్చినా ముళ్ళమీద వున్నట్లు పది నిమిషాలు వుండి వెళ్ళిపోతారు. రాజేశ్వరమ్మ ఒక విధంగా ఒంటరితనానికి అలవాటుపడింది.

నర్సింగ్‌హోమ్‌లో చేరిన రోజు రాత్రి పదిగంటలకు శ్యామల వచ్చి కూర్చుంది రాజేశ్వరమ్మ గదిలో. ఒంటరిగా ఆ గదిలో ఆమె దిగులుపడుతూన్నట్లుంది. శ్యామలకు జాలేసింది.

"ఒక్కరే పడుకుంటారా? మీవాళ్ళెవరూ రారూ?" అన్నది శ్యామల.

రాజేశ్వరమ్మ దిగులుగా చూసింది.

"ఎవరొస్తారు? మా అమ్మాయి చిన్నపిల్ల. అది వచ్చి ఏం జేస్తుంది? అయినా అదికూడా లేకపోతే ఇంట్లో జరగదు" అన్నది. శ్యామల మాట్లాడలేదు. గదిలో వస్తువులన్నీ సద్దుతూ వూరుకున్నది. కాస్సేపటికి మళ్లా అన్నది.

"మీరు ఒక్కరూ పడుకోగలరా? అప్పుడప్పుడు నేనూ వచ్చి చూసి పోతూంటానులెండి"

రాజేశ్వరమ్మ మనస్సులో నీడలు కమ్ముకున్నాయి. పైకి మాత్రం ముభావంగా అన్నది.

"ఏం ఫరవాలేదు లెండి. నాకలవాటే ఒంటరిగా వుండడం" అని.

"ఏదైనా అవసరం అయితే కాల్ బెల్ నొక్కండి వస్తాను" అని శ్యామల వెళ్ళిపోయింది. వెళుతూ, వెళుతూ గదిలో వరండాలో దీపాలన్నీ ఆర్పేసింది.

గది అంతా చీకటి నిండుకున్నది. తలుపూ ఒక కిటికీ మాత్రం తెరచే వున్నాయి. కాని కిటికీకి కట్టిన ముతక తెరగుడ్డ మూలాన గదిలోకి ఏమాత్రమూ బయటి వెలుగు రేకలు ప్రసరించడం లేదు. తలుపుకు కట్టిన తెర సగం పక్కకు తొలగివుంది. మంచం గుమ్మానికి ఎదురుగానే వుంది. ఆ సందులో నించి సన్నని వెలుగు రాజేశ్వరమ్మ ముఖంమీద పడుతోంది. వరండా కవతల బయటి ఆవరణలో ఎత్తుగా ఎదిగిన చెట్ల కొమ్మలు నీడల్లా కనపడుతున్నాయి. ఎంత

ప్రయత్నించినా ఇంకేమీ కనపడదు. గాలి కదలినప్పుడల్లా తెరగుడ్డలు రెపరెపమని కొట్టుకుంటున్నాయి. చెట్లకొమ్మలు ఒరుసుకుని కీచుకీచు మంటున్నాయి. ఏమూలో నిద్రపోలేని పక్షులు విచారంతో మళ్లా మళ్లా కూస్తున్నాయి. ఎక్కడో ఎవరిచేతిలో నుంచో గాజుపళ్లెం జారిపడి రోదన ధ్వనితో ముక్కలైంది.

రాజేశ్వరమ్మకు భయంవేసింది. ప్రాణాలు బిగపట్టుకొని ఈ రకరకాల ధ్వనులకు అలికిడికీ అలవాటుపడి నిద్రపోవాలని ప్రయత్నించింది. నిద్ర రాలేదు. గుండెలు కొట్టుకున్నాయి. దుఃఖం పొర్లుకొచ్చింది.

తనకు చిన్నప్పటినుంచీ ఒంటరిగా వుండటమంటేనే భయం. ఎప్పుడూ ఒంటరిగా వుండలేదు. చీకట్లో వుండలేదు. ఏదో కారణంలేని భయం. కాని తమాషాగా తనని ఎప్పుడూ ఒంటరితనమే వెన్నాడుతోంది! ఎందుకనో! ఆమెకు గడచిన విషయాలు గుర్తుకు వచ్చాయి.

చిన్నప్పుడు పన్నెండేళ్లు వచ్చేవరకూ తల్లిదగ్గరే పడుకునేది. తల్లి విసుక్కునేది, దూరంగా పక్కమంచంమీద పడుకోమని. ఆవిడ కోప్పడుతుందేమోననే భయంతో ప్రతి రాత్రి ఒదిగి ఒదిగి మంచం పట్టె కరుచుకుని నిద్రపొయ్యేది. అమ్మను వదలి దూరంగా తను వేరే పడుకోవాలంటే చాలా భయంగా వుండేది. ఒకరోజు రాత్రి అమ్మ గట్టిగా కోప్పడింది.

“అవతల మంచం వేసి వుంచేది ఎందుకోసం అనుకుంటావు. పన్నెండేళ్లొస్తున్నాయి. ఇంకా పక్కలో ఒదుగుతావెందుకూ? వేరే పడుకోలేవూ? అసలే వేసవికాలం

ఉక్కపోసి చస్తుంటేనూ?" అంటూ గబగబా లాగి పక్క మంచంమీద పడుకోబెట్టింది. ఆ రాత్రి తను నిద్రపోలేదు. చీమచిటుక్కుమన్నా భయపడుతూ బెంగగా పడుకుంది. మర్నాడు తన మంచం అమ్మకు దగ్గరగా లాక్కుని, ఆవిడ మంచంపట్టెను గట్టిగా పట్టుకుని కొంచెం ధైర్యంతో నిద్ర పోయింది.

పెళ్లైంది. అత్తవారింటికి వెళ్ళింది. అక్కడ అత్తా మామా క్రిందయింట్లోనే వుండేవారు. తనూ భర్తా మేడ మీద వుండేవారు. మొదట్లో గదిలో రెండుమంచాలు చూడ గానే ఎంతో సంతోషించింది. ఇంక తను ఎప్పుడూ ఒంటరిగా వుండనక్కరలేదు. అదే ఆనందం.

వారంరోజులయ్యాక ఓనాడు భర్త అన్నాడు.

"ఇవ్వాళ నేను ఆఫీసుపనిమీద ఢిల్లీ వెళ్ళాలి, తిరిగి రావటానికి పదిరోజులు పడుతుంది" అని.

అతను వెళ్ళిపొయ్యాడు. ఆరాత్రి మళ్ళా తనకు నిద్ర పట్టలేదు, మేడగది చుట్టూ ఖాళీడాబా, హోరుమని గాలి వీచేది. తను భయంతో తెల్లవార్లు మేలుకొనేది. తెల్లవారు ఝామున ఎప్పుడో తనకు తెలియకుండానే కళ్ళు మూతలు పడేవి. అల్లాగే అలవాటయింది. నెలకు ఇరవైరోజులు భర్త ఆఫీసు పనులమీద ఊళ్లు తిరుగుతూనేవుండేవాడు. భయంతో, నిద్రతో పెనగులాడుతూ తాను రోజులు గడుపుతుండేది.

కొన్నాళ్ళకి తనకు కొడుకు పుట్టాడు. అప్పటినుంచి భర్తగది వేరు, తనగది వేరు అయినవి. పిల్లవాడి ఏడుపు గోలతో నిద్రవుండదని అతను వేరే గదిలో పడుకునేవాడు.

పసివాడిని గుండెల కదుముకుని తాను నిద్రపొయ్యేది. క్రమంగా ముగ్గురు పిల్లలు పుట్టారు. ముగ్గురిని చుట్టూ చేర్చుకుని తాను తృప్తిగా సుఖంగా వుండేది. అప్పటికి అత్తమామ లిద్దరూ పోయారు. తాను ఇంటికి అధికారిణి అయింది.

ఒకరోజు భర్త అన్నాడు. "పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారుగా? వాళ్ళకి వేరేగది ఏర్పాటుచేస్తే బాగుంటుంది. ఎప్పుడూ నిన్నే కరుచుకు కూర్చుంటే వాళ్లకి ధైర్యం ఎట్లా వస్తుందీ" అని.

తాను దిగులుపడింది. కాని భర్తమాటకు ఎదురు చెప్పలేదు. మళ్ళా ఒంటరితనం ఎదురైంది. మొదట్లో నిద్ర పట్టక రెండుమూడుసార్లు లేచి పిల్లల గదిలోకి వెళ్ళి చూసి వస్తుండేది. ఒకొక్కసారి యింటిపనులతో అలసిపోయి నిద్రపోయేది.

క్రమంగా పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. వాళ్ళకు వ్యాపకాలు ఎక్కువైనాయి. పెద్దపిల్ల, పిల్లవాడూ ఇంటిపట్టున కూడా వుండకుండా దూరమైనారు. తాను ఒంటరిగా బ్రతకడం నేర్చుకున్నది. ఒంటరితనమంటే భయం మాత్రం పోలేదు. ఏదో భయం! ఏదో దిగులు! ఇవి మాత్రం వదలటం లేదు.

* * *

గడియారం ఏడుగంటలు కొట్టింది. కోటేశ్వరరావు వచ్చాడు.

ఏవో ఆలోచనలతో మునిగితేలుతున్న రాజేశ్వరమ్మ

మెల్లగా తేరుకుని చిరునవ్వుతో ఆహ్వానించింది. కోటేశ్వర రావు ప్రక్కన కుర్చీలో కూర్చున్నాడు.

"ఎట్లావుంది ఒంట్లో?"

రాజేశ్వరమ్మ నవ్వింది.

"ఏముందీ! మామూలే! బాగానే వున్నాను" అన్నది.

"రెండు రోజులుగా రావటానికి వీలుపడలేదు. చీఫ్ సెక్రటరీ వచ్చాడు. పని సరిపోతోంది. వద్దామనుకుంటూనే గడచిపోయింది. ఇప్పుడుకూడా విందుకు వెళ్ళాలి. అతను రేపు వెళ్ళిపోతాడు. అందుకని ఇవ్వాళ విందు ఏర్పాటు చేశాం" అన్నాడు విసుగ్గా రెండురోజులు రానందుకు సంజాయిషీ చెప్పుకుంటూ, తిరిగి వెళ్ళిపోవడానికి తొందరపడుతూ.

"ఫరవాలేదు లెండి. మీరు వచ్చి ఏం జేస్తారూ! ఈ జబ్బు ఇవ్వాళ రేపట్లో తేలేదేమీ కాదుగదా! మీ పనులు ఎట్లా పాడుజేసుకుంటారూ? మీ విందు ఎన్నింటికీ? వేళ అవుతున్నట్టున్నదే?" అన్నది రాజేశ్వరమ్మ.

కోటేశ్వరరావు మనస్సు స్థిమితపడింది. గడియారం చూసి అన్నాడు.

"ఎనిమిదింటికే! అయినా నేను కాస్త ముందుగా వెళ్ళాలి. ఏర్పాట్లన్నీ చూసుకోవాలిగా?"

"అవును. మీరు వెళ్ళండి. చాలాదూరం కూడాను" అన్నది రాజేశ్వరమ్మ.

"మరే! అదికూడా ఇబ్బందిగా వుంది. కారు సరిగా లేదు. షాపుకు పంపించాను. ఇంకా రాలేదు. అందుకనే

అమ్మాయి సుజాతకూడా రాలేకపోయింది. పాపం దానికీ ఇంట్లో సరిపోతోంది. అన్నట్లు శంకరం నీకు పళ్ళూ, పాలూ తెచ్చాడా ?" అన్నాడు.

"తెస్తాడులెండి. ఇంకా గంటకాలేదుగా! సుజాతను బాధపడవద్దని చెప్పండి. ఎవరొచ్చి ఏం జెయ్యాలీ! శంకరం ఎట్లానూ వస్తూనే వుంటాడుగా? కబుర్లు తెలుస్తూనే వుంటాయి." అన్నది రాజేశ్వరమ్మ.

కోటేశ్వరరావు బయలుదేరాడు.

"మరి నేను వెళ్ళనా? ఏమన్నా కావలిస్తే నర్సును ఫోను చెయ్యమను" అన్నాడు.

రాజేశ్వరమ్మ నవ్వింది. ఏం కావాలీ తనకు? ఏమని ఫోన్ చెయ్యాలీ అనుకుంది. అతను వెళ్ళిపోయాడు.

రాత్రి పదిగంటలకు శ్యామల వచ్చింది. రాజేశ్వరమ్మ ఇంకా నిద్రపోలేదు. శ్యామల అన్నది! "అవతలి గదిలోకి ఎవరో పురిటికి వచ్చారు. ఈ రాత్రికే ప్రసవం అవుతుంది అనుకుంటున్నాము. నేను అక్కడే వుండాలి. ఇంక ఈ రాత్రికి మళ్ళా మీ దగ్గరకు రాలేనేమో! మీకు ఏమైనా కావాలా?" అని.

రాజేశ్వరమ్మ నవ్వింది.

"నాకేం కావాలీ? ఏమీ అక్కరలేదు" అన్నది.

శ్యామల వెక్కిరించింది.

"అబ్బ. నోరుతెరచి నాకిది కావాలని ఎప్పుడూ ఒక్కసారైనా అడగరు గదా! ఏం మనుష్యులో" అన్నది.

"అన్నీ అడక్కుండానే వస్తున్నాయిగదా!" అన్నది రాజేశ్వరమ్మ. ఇద్దరూ నవ్వారు. శ్యామల వెళ్ళిపోయింది.

ఆవేళ పూర్ణిమ. బయట మంచి వెన్నెల కాస్తోంది. తెరలు తప్పించుకొని పండు వెన్నెల గదిఅంతా నిండుతోంది. ఆవేళ రాజేశ్వరమ్మ మనస్సు హాయిగా తేలికగా వున్నది. ఆ వెన్నెల ఆమె మనస్సులో కూడా నిండినట్లుంది. ఆ నిముషంలో ఆమెకు ఏ దిగులూ, చింతా కలుగలేదు. భయమూ వెయ్యలేదు. అన్నీ వాటంతటవే వదలిపోయి నట్లనిపించింది. తానెంత పిచ్చిది! చిన్నప్పటినుంచి ఊరికినే భయం భయం అనుకుంటోంది. దేనిని గురించి భయం! ఎందుకూ భయం? మనస్సు కల్పించుకునే భ్రమలే భయాలు. అంతకన్నా ఏమీ లేదు.

తెరచిన తలుపులోనుంచి పున్నమచంద్రుడు పచ్చగా దగ్గరగా కనుపిస్తున్నాడు. రాజేశ్వరమ్మ ఆనందంతో ఆ చందమామను చూస్తూ పడుకుంది. ఇప్పుడు ఒంటరితనమూ లేదు, భయమూలేదు, దిగులూలేదు ఏవీలేవు. నిర్మలంగా ఆ చందమామను అలా చూస్తూ చూస్తూ వుండగా ఆమెకు నిద్రవచ్చింది హాయిగా. ఆమెకు తెలియకుండానే కన్నులు మూతలుపడ్డాయి. నిద్రపోయింది.

తెల్లవారి ఎనిమిదిగంటలకు శ్యామల వచ్చింది. రాజేశ్వరమ్మ ఇంకా నిద్రలేవలేదు. ఆమె ముఖంలో ప్రశాంతి వెల్లివిరుస్తోంది. పెదవులమీద చిరునవ్వు చెరగలేదు. గది సర్దుతూ శ్యామల రెండు మూడుసార్లు పిలిచింది రాజేశ్వరమ్మను ఇంకా నిద్ర లేవలేదేమని. ఆమె పలుకలేదు. దగ్గ

రకు వెళ్ళి కదిపిచూసింది. కంగారుపడుతూ గబగబా వెళ్ళి పోయింది.

కాస్సేపటికి కోటేశ్వరరావు, సుజాత, డాక్టర్ శోభనాచలం, నర్సులూ, అందరూ చేరారు. గదిలో ఓదార్పులు, వ్యాఖ్యానాలు ఎవరికితోచినవివారు చేశారు.

“గుండెజబ్బు, అంతకన్న అనుకోటాని కేమీలేదు” అన్నాడు డాక్టర్.

“పాపం ఎప్పుడూ నవ్వుతూవుండేది. ఒక్కసారైనా బాధఅని అనలేదు” అన్నది కోమల.

“రాత్రి ఒక్కసారైనా వచ్చి చూడటానికి వీలుపడలేదు. ఏం బాధపడిందో ఏమో!” అన్నది విచారంగా శ్యామల.

“ఒట్టి పిచ్చిది. ఎప్పుడూ ఒంటరిగా వుండటానికి భయపడేది. చివరి ఘడియకు ఒంటరిగానే వున్నది.” బాధతో కళ్ళు ఒత్తుకున్నాడు కోటేశ్వరరావు.

గెలవని పందెం

ముంగిట్లో అరుగుమీద కూర్చున్నాడు మునయ్య నోట్లో పండుంపుల్ల పెట్టుకుని నింపాదిగా నములుతూ. అప్పుడే తెల తెల్లవారుతోంది. ఇంకా చీకటి పూర్తిగా విడిపోలేదు. చెట్లసందుల్లోనించి వెలుగు కొద్దికొద్దిగా వ్యాపిస్తోంది. తొలి వెలుగు తెల్లని మబ్బులా అన్నింటినీ మెల్లగా కప్పుతోంది. చలి ఇంకా ఎక్కువగానే ఉంది. మునయ్య ముడుచుకు కూర్చున్నాడు.

ఎదురుగుండా ఆవు గడ్డిపరకలు నములుతూ నిర్లక్ష్యంగా దోమలు తోలుకుంటోంది. దూడ మెడ ముందుకు చాచి తాడు తెంపుకోవాలని ప్రయత్నిస్తోంది. తాటాకు దడికి దగ్గరగా కోళ్ళు మెడలు నిక్కబొడుచుకొని పచార్లు చేస్తున్నాయి. దడికి అవతలి మురుగుకాల్వలోనించి ఉండి ఉండి గాలి కదలినప్పుడల్లా దుర్గంధం వ్యాపిస్తోంది.

వేపచెట్టుకు కట్టిన కోడెదూడ కొమ్ములతో గాలిని కుమ్మి కుమ్మి రాబోయ్యే పండగపందాల్లో పాల్గొనడానికి ప్రాక్టీసు చేస్తున్నట్లుంది. ఆ దృశ్యం చూస్తున్న మునయ్యకు పరమానందమైంది. ఈసారి పందాల్లో తన కోడె తప్పకుండా గెలుస్తుంది. అది తప్పదు. ఆమాట చెరగని అక్షరాలతో రాసిపెట్టుకోవచ్చు. ఈసారి వీరిగాడి పస బయటపడకతప్పదు. ఎంత గర్వం! ఏం అహంభావం! ఈపడు తెలుస్తుంది!

పక్క పాకలో కాపురం వీరన్నది. మునయ్యకు ఇల్లూ, వాకిలీ, పొలము, పుత్రూ, తల్లీ, దండ్రీ, అత్తా, మామా అంతా ఉన్నారు. వేళకువెళ్ళి భోంచేయడం తప్ప వేరే ఆదుర్దాలేదు. అల్లాగే రోజులు గడిచాయి. తల్లీ, భార్యా ఇంటిపనీ, గొడ్లపనీ చూచుకుంటారు. తండ్రీ, వీరన్నా పొలం పని చూస్తారు. ఒక్కడే కొడుకు కావడంతో మునయ్యకు గారాబం ఎక్కువైంది. తల్లిదండ్రీ ఏపనీ చెప్పరు. నాలుగో క్లాసుతో బడిమానేసినా ఎవరూ ఏమీ అనలేదు. అంచేత నోట్లో పందుంపుల్ల పెట్టుకు దిక్కులు చూస్తూ ఎంతసేపు కూర్చున్నా అడిగేవాళ్లు లేరు.

ఏపనీ చెయ్యని ఈభర్తను చూస్తే భార్య లక్ష్మికి మాత్రం కాస్త చిరాకు. తను గొడ్లను కడుగుతున్నప్పుడు గాని, వాటిని అదమాయించి గుంజలకు కట్టలేక పెనగులాడు తున్నప్పుడుగాని ఇతను తనకేమీ సంబంధించనట్లు, తాను ఈ లోకానికే అతీతుడైనట్లు శూన్యదృక్కులు ప్రసరిస్తూ కూర్చుంటే చూసి చూసి లక్ష్మి మండిపడుతుంది. కొడుకు మీద మమకారంతో అత్తగారు చంద్రమ్మ కోడల్ని అదమాయిస్తుంది. మునయ్య నవ్వుకుంటాడు.

ఈమధ్య మునయ్యను రాత్రింపగలు వేధిస్తున్న సమస్య ఒక్కటే! ఈసారి పందాల్లోనైనా తన కోడెదూడ గెలవాలి. వీరిగాడిది ఓడిపోవాలి! అది తప్పదు. ఏడాదినుంచి దృష్టి అంతా దానిమీదే. ఏపనీ ఎన్నడూ చేయనివాడు కోడె దూడను శ్రద్ధగా మేపడం, పొలం తీసికెళ్ళడం ఈ పనులు మాత్రం చేస్తున్నాడు. గంటలు గంటలు దాన్ని నిమురుతూ

కబుర్లు చెబుతూ కాలంగడుపుతాడు. దగ్గరగా వెళ్ళి వీపు నిమురుతూ దాని చెవిలో "ఈసారి వీరిగాడి కోడెను గెలవాలి సుమా" అంటాడు. అది ఒక్కసారి తలఊపి చెవులు విదలిస్తుంది. మునయ్య సంతోషిస్తాడు.

వీరిగాడు పుట్టగానే తల్లినీ, దండ్రినీ దూరం చేసుకున్నాడు. దిక్కులేనివాడిని మునయ్య తండ్రి వెంకటయ్య చేరదీసి పెంచాడు. అప్పుడు అతనికి సంతానంలేదు. తరువాత అయిదారేండ్లకుగాని మునయ్య పుట్టలేదు. వీరన్న చిన్నప్పటి నుంచి వెంకటయ్యను చుట్టుకు చుట్టుకు తిరిగేవాడు. అతనికి అన్ని పనులకు వీరన్నే ఆసరా! నా అన్నవాళ్లు లేని వీరన్నకు పెంచిన వెంకటయ్యే సమస్తమూ! అతను అడిగితే చాలు ప్రాణాలైనా ఇద్దామన్నంత మమకారం వీరయ్యకు. వెంకటయ్యకు మాత్రం కొడుకు మునయ్యను చూస్తే మురిపెమూ, తనతో కూడా తిరిగే వీరన్నను చూస్తే నిర్లక్ష్యమూ! ఎంత ప్రయత్నించినా మునయ్య స్థానాన్ని తాను ఎప్పుడూ ఏమాత్రమూ ఆక్రమించుకోలేడని వీరన్న ఏనాడో గ్రహించాడు. అప్పటినుంచి అతని హృదయంలో మునయ్యంటే ఏదో ద్వేషమూ, అసూయా రగిలాయి. కాని ఆ భావాలు ఎప్పుడూ మనస్సులోనే అణగిపోయేవి. మునయ్యకూ చిన్నప్పటినుంచీ వీరన్నంటే సరిపడలేదు. ఎప్పుడూ ఆటల్లో, పనుల్లో అతనిదే పైచేయిగా ఉండటం గిట్టలేదు. వీడెవడూ! దిక్కులేనివాడు అన్నింట్లో తనకు పోటీ అని అసూయపడేవాడు. కాని అది పైకి చూపించటానికిమాత్రం అవకాశం ఉండేదికాదు. అంచేత లోలోపలే దాచుకొని బాధపడుతూ

ఉండేవాడు. ఈఏడు పండగ సందట్లో కోడెదూడల పందాల పేరుతో వారి వారి ద్వేషాలు వెళ్ళబోసుకోడానికి ఇద్దరికీ మంచి అవకాశం దొరికింది. అది పట్టుకు ప్రాకులాడేకొద్దీ అసూయ లెక్కువైనాయి.

లక్ష్మి కాపురానికి వచ్చాక వీరన్న పక్కస్థలంలో పాక వేసుకుని వేరే వుంటానన్నాడు. వెంకటయ్య కాదనలేదు. వీరన్న పగలంతా అతనితో పొలంలో పనిచేస్తాడు. రాత్రికి తిండితిని తనపాకలో పడుకుంటాడు.

ఒకసారి పొలాలదగ్గర వుండగా అతనికి పొరుగూరి నించి పారిపోయివచ్చిన కోడెదూడ దొరికింది. బాగా ఏపుగా పెరిగింది. అతను మురిసిపోయాడు. దాన్ని తెచ్చుకొని తన పాకముందర కట్టుకున్నాడు . నాలుగురోజులు దానికోసం ఎవరైనా వస్తారేమోనని చూశాడు. ఎవరూ రాలేదు. తనదీ అని ప్రత్యేకంగా ఒకవస్తువు దొరికినందుకు సంతోషించి ప్రేమతో దాన్ని పెంచుకున్నాడు. రెండేళ్ళుగా పండగ పందాల్లో దానిదే విజయం. అదే అతనికి మహానందమూ, మహాగర్వమూ. అదే మునయ్యకు మహాగ్రహమూ మహావ మానమూ.

అది భరించలేక అతనూ ఒక కోడెను సంపాదించు కున్నాడు. ఈ సారికి పందాల్లో తనూ పాల్గొనాలి. వీరిగాడ్ని ఓడించాలి. ఇదే ధ్యాస. మునయ్య కోడెదూడ నెందుకు తెచ్చాడో వీరన్నకు తెలుసు. అతనికి పుండు రేపినట్లయింది. తనమీద అంత పగ ఎందుకో మునయ్యకు? తనకు జీవితంలో ఏమున్నదీ ? ప్రేమించి భారంవహించే తల్లి దండ్రులు,

ప్రేమతో లాలించే భార్యా, ఇల్లూ, వాకిలీ, ఏమీ లేవుకదా! వెంకటయ్యదయతో ఒక పాక వేసుకునితనదిఅనుకుంటున్నాడు. దారితప్పిన ఓ దూడను చేరదీసి తనదీ అనుకుంటున్నాడు. అంతేకదా! అంతకన్న ఏమున్నదీ? ఆ దూడ పందాల్లో గెలిస్తే కాస్త తానూ మనిషినేనని నలుగురిలో తలెత్తుకుని ఆనందిస్తున్నాడు! ఈ మాత్రానికే అసూయ దేనికో! ఇంత మాత్రం ఆనందానికికూడా తాను అర్హుడుకాడా! అతనికీ పౌరుషం వచ్చింది. ఈసారి తనకోడె తప్పకుండా గెలవాలి. ఏంచేస్తాడేం మునయ్య? ఎల్లా గెలవదో చూద్దాం, అనుకున్నాడు. కోడెను మునుపటికన్నా బాగా మేపాడు. పైకి ప్రశాంతంగాఉన్నా లోలోపల పట్టుదలతో రగిలిపోయాడు. పందెంరోజు దగ్గర కొచ్చేకొద్దీ ఇద్దరిమధ్యా ద్వేషాలు అవధులు అందుకున్నాయి.

పందుంపుల్ల నములుతూ, మునయ్య పందాలు గురించే ఆలోచిస్తున్నాడు. ఇంకా మూడురోజులేగా! ఈలోగా ఇంకా బాగా తయారుచెయ్యాలి, అనుకున్నాడు.

లోపల్నుంచి అతని భార్య లక్ష్మి వచ్చింది. వాకిట్లో కల్లాపు చల్లడానికి. భర్తను చూసినప్పుడల్లా ఆమెకు కాస్త విసుగూ విసురూ ఎక్కువవుతాయి. ఆ విసురుతో ఆమె చల్లిన కల్లాపునీళ్లు అరుగుమీద కూర్చున్న మునయ్య ఒంటి నిండా పడ్డాయి. మునయ్యకు కోపంవచ్చింది.

"కళ్లు కనబడడంలేదా?" అన్నాడు.

"అవును. ఇంకా నిద్దరమైకం వదల్లేదు" అన్నది లక్ష్మి వెటకారంగా.

మునయ్య ముఖం ముడుచుకున్నాడు. లక్ష్మి మళ్లా అన్నది.

"ఎందుకల్లా ఊరికే కూచుంటారు. లేచి ఏదైనా పని చూసుకోకూడదూ! మామగారితో పొలం పోరాదూ? ఎంతసేపు ఆ కోడెదూడను చూసుకుంటూ మురిసిమురిసి నవ్వులు నవ్వుతూ కూచుంటారు! ఆ వీరయ్య మీద అంత కసి దేనికీ! మీరెంత ప్రాకులాడినా అతనిదూడే గెలుస్తుంది లెండి, ఈ ఏడూను." అని ఈసడిస్తూ.

మునయ్య మండిపడ్డాడు.

"నీ నోరు కాస్త కట్టిపెడతావా? నీ సలహాలెవరూ అడగలేదులే! ఊరుకునేకొద్దీ" మాట సగంలో తుంచేశాడు కోపం పట్టలేక.

లక్ష్మి ముఖము కోపంతో జేవురించింది. పెడుతున్న ముగ్గు మానేసి అన్నది.

"ఏమో మీం ఇద్దరి హడావిడి నాకు నచ్చలేదు. ఒక్క ఆవరణలో ఒకే కుటుంబంగా ఉండి ఎందుకీ ద్వేషాలూ, పట్టుదలలూ? అంతగా అయితే మీరూ మీరూ పందాలు వేసుకొని కుస్తీలు పట్టుకోరాదూ! ఒక్కసారితో తేలి పోతుందీ. నోరులేని జీవాల్ను ఊరికే ఉసిగొల్పి ఎందుకూ చంపడం? ఏం పందాలో, ఏం ఆనందమో! నురుగులు కక్కుతూ అవి కుమ్ముకుంటూ వుంటే ప్రాణం ఉడికిపోతుంది" అని.

మునయ్య గట్టిగా నవ్వి పరిహాసంగా అన్నాడు. "పోనీలే! అంత కష్టంగా వుంటే నువ్వు చూడ్డానికి రావద్దులే!

విన్నవారు రమ్మన్నారు! మహాసలహా చెప్పొచ్చావు. ఎక్కడైనా మనుషులకు పందాలు పెడతారేమిటి?"

లక్ష్మి విసుగ్గా జవాబు చెప్పింది. "ఎందుకు పెట్టకూడదూ? ఇదివరకు కోడెదూడలకు మాత్రం పందాలు పెట్టారేమిటి? ఒక ఏడాది ప్రారంభిస్తే, మరోఏడాదికి అదే అలవాటవుతుంది. అయినా నేనిప్పుడు మిమ్మల్నిద్దరినీ కుస్తీలు పట్టమనడంలేదు లెండి. అసలీ పోటీలూ, ద్వేషాలే వద్దంటున్నాను."

మునయ్య ఉషారుగా అన్నాడు. "నోరులేని జంతువులంటున్నావు. అవెంత పట్టుదలతో పౌరుషంతో ఉడికిపోతున్నయో తెలుసా? ఒకరిపొడ ఒకరికి గిట్టడంలేదు. ఊరికినే బుసలుకొడుతున్నాయి."

లక్ష్మి పకాలున నవ్వింది. గొడ్లచావిడివేపు చేయి జాపుతూ అన్నది వ్యంగ్యంగా.

"ఆహా! అటు చూడండి! ఎంత మండిపడుతున్నాయో! పచ్చరంగు అద్దాలు పెట్టుకుంటే లోకమంతా పచ్చగానే ఉంటుంది."

దూరంగా చెట్టుక్రింద రెండు కోడెదూడలూ ప్రశాంతంగా ఒకదాని నొకటి బరుసుకుపడుకుని గడ్డిపరకలు నములుతున్నాయి. మూతులు పైకెత్తి పలకరించుకుంటున్నాయి.

మునయ్య మాట్లాడలేదు. లక్ష్మి ముగ్గు పూర్తిచేసి గొడ్లచావిడి బాగుచెయ్యటానికి వెళ్ళింది. మునయ్య దంతధావనం ముగించి లేచి తన కోడెను దూరంగా మరొక చెట్టుకు కట్టుకున్నాడు. లక్ష్మి నవ్వుకుంది.

వీరన్న పండగరోజు పొద్దున్నే లేచి తన కోడెను తీసుకుని పొలం వెళ్ళిపోయాడు. అక్కడే దాన్ని అలంకరించు కున్నాడు. కొమ్ములకు రంగులుపూసి, పువ్వులుచుట్టి ముఖా నికి కుంకుమ పెట్టాడు. ఇంటిదగ్గర మునయ్య హడావిడికి అంతులేదు. దూడను రుద్దిరుద్ది కడిగి తుడిచి కుంకుమబొట్టు పెట్టి సింగారించాడు. ఆరోజు అతనికి అన్నంకూడా పట్టలేదు. కాలుకాలిన పిల్లిలా తిరుగుతూ ఉండిపోయాడు. వెంక టయ్యకు ఈ గొడవేమీ పట్టలేదు. ఏదో కుర్రతనం వాళ్ళ సరదాలు వాళ్ళవి అని ఉపేక్షగా ఊరుకొన్నాడు. లక్ష్మి మౌనంవహించి తన అయిష్టాన్ని లోలోపలే అణచుకుని ఊరుకొంది. మునయ్య తల్లి చంద్రమ్మమాత్రం కొడుకుతో పాటు సంబరపడ్డది. మధ్యాహ్నం మునయ్య దూడను తోలు కొని పందాలకు పొరుగూరు వెళ్ళాడు. చూడ్డానికి కూడా చంద్రమ్మ వెళ్ళింది.

సాయంత్రం ప్రొద్దు వాలుతూఉండగా వెంకటయ్య పొలంనుంచి వచ్చి వేన్నీళ్ళు స్నానంచేసి కోడలు వడ్డించినది తిని మంచంవాల్చుకు పడుకున్నాడు. గిన్నెలు సర్ది మూతలు పెట్టి భర్త రాకకోసం, అత్తగారికోసం ఎదురుచూస్తూ కూర్చుంది లక్ష్మి. రాత్రి చాలా ప్రొద్దుపోయింది. ఊళ్ళో సందడిలేదు. చాలామంది పందాలు చూడ్డానికి పక్కఊరు పోయారు.

వసారాలో వెంకటయ్య నిద్రపోయాడు. లక్ష్మికి కళ్లు మూతలుపడుతున్నాయి. అంతలో చంద్రమ్మ మునయ్య వచ్చారు. మునయ్య ముఖం వెలవెలపోతోంది. వస్తూనే

ఉసూరుమంటూ అరుగుమీద కూర్చున్నాడు. చంద్రమ్మ విచారంతో గబగబా చెప్పింది కోడలికి వార్తలు.

"రెండు కోడెలు ఎంత చక్కగా పోట్లాడాయి. చూడ్డానికి రెండుకళ్ళూ చాలలేదు. మునయ్యా, వీరన్న ఉసి గొల్పేకొద్దీ మరీమరీ శివమెత్తినట్లు కలియబడ్డాయి. ఏం లాభం! రెండింటికి మెడమీద బాగా గాయాలు తగిలాయి; రక్తం ధారలుకట్టింది. పాపం పడిపొయ్యేకమాత్రం ప్రేమతో ఒకదానినొకటి నాకుతూ ప్రాణాలు విడిచాయి. గెలుపూ లేదు, మన్నూ లేదు గాని రెండు ప్రాణాలు నిలువునా బలి అయ్యాయి" అన్నది.

లక్ష్మి నిస్పృహతో నిట్టూర్చి కళ్ళు తుడుచుకుంది. చంద్రమ్మ అన్నం వడ్డించి కొడుకును పిలిచింది. మునయ్య మాట్లాడకుండా రెండుముద్దలు తిని లేచివెళ్ళి పడుకున్నాడు.

లక్ష్మి వీరన్నను తలుచుకుంది. ఏమైనాడో ఎంత బాధపడుతున్నాడో అనుకుంది. పక్క పాకలోకి వెళ్ళి చూసింది: వీరన్న గోడకానుకుని చీకట్లో బొమ్మలా కూర్చుని ఉన్నాడు. లక్ష్మి ఉలిక్కిపడింది.

"ఎప్పుడు వచ్చావూ? చప్పుడే కాలేదే? రా. అన్నం తిందువుగాని" అన్నది ఆప్యాయంగా.

వీరన్న మాట్లాడలేదు. అక్కర్లేదని తల తిప్పాడు. వాడికి లోపలా బయటా అంతా శూన్యం కమ్ముకున్నట్లుంది. దిక్కు తోచలేదు.

లక్ష్మి వెళ్ళిపోయింది. కాస్సేపటికి ఒకచేత్తో లాంతరు, మరొకచేత్తో కంచంలో అన్నం పట్టుకువచ్చింది. రెండూ

వీరన్న ముందర పెట్టి ఎదురుగుండా చతికిలపడింది. నువ్వు తింటేనేగాని నేను కదలను అన్నట్లు. వీరన్న కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. రెండుచేతుల్తో ముఖం కప్పుకుని ఏడ్చాడు. లక్ష్మి కళ్లు తుడుచుకుంటూ అన్నది. "ఏం చేస్తాం వీరయ్యా. ఆ రెండు మూగజీవాలూ నశించేవరకు మీ ఇద్దరు అన్నదమ్ములకూ నిద్రపట్టలేదు" అని.

అన్నదమ్ములన్న పదం విని వీరయ్య అదరిపడ్డాడు. అప్పుడే గుమ్మంలో విచారంతో అడుగుపెట్టిన మునయ్య ఆ మాటవిని విప్పారినముఖంతో లోపలికి వచ్చాడు. వీరయ్య కళ్ళు తుడుచుకుని అన్నం కలుపుకున్నాడు, లక్ష్మి సంతోషంతో లేచి తనచోటు మునయ్యకిచ్చి వెళ్ళిపోయింది.

వింత స్వభావము

సాయంత్రం, సంధ్యారుణరేఖలు ఒకటొక్కటే నీలాకాశంలో లీనమైపోయి, మసక చీకటి కమ్ముతోంది. మేడపైడాబామీద, తలదువ్వుకుంటోంది శ్యామల, కాస్త చిరాకుతో. రోజూ, ఈ పాటికి, చక్కగా తలదువ్వుకుని, తలనిండా పువ్వులు పెట్టుకొని, తెల్లని, మల్లెపూవులాంటి చీర కట్టుకుని, భర్త రాకకు వేచియుండేది. కాని, ఈవాళ మాత్రం, అంత ఉత్సాహంతో ముస్తాబు కావడం లేదు. రాత్రి డిన్నరు! ఈ డిన్నర్లకి వెళ్ళడమంటే తలనొప్పి ఆమెకు! ప్రొద్దున్న ఆఫీసుకు బయలుదేరుతూ చెప్పిపోయాడు అతను, కామేశ్వరరావు, "రాత్రి మాక్లబ్ లో డిన్నరూ, మాఆఫీసు ఉద్యోగస్తులందరూ సకుటుంబంగా వస్తారు - నీవు రాక తప్పదు. పెందరాళే తయారై ఉండు" అన్నాడు. తనకి వెళ్ళాలని లేదు. కాని. ఆతని మాట కాదనలేదు.

ఈ పార్టీలు, డిన్నర్లు శ్యామలకు ఏమాత్రము కిట్టవు. ఎంతో ప్రయత్నపడి వెళ్ళాలి. తీరా వెళ్ళాక అక్కడ చేసేదేమీ లేదు. ఇష్టంలేని తిండి తింటూ, అర్థంలేని మాటలు వింటూ ఉండడము, ఊరికే విసుగెత్తుతుంది, అంతే. ఐనా, అతనికోసం, వెళ్ళక తప్పదు. నిరుత్సాహంగా, బద్ధకంగా జడ అల్లుకోసాగింది శ్యామల.

ఎనిమిది గంటల కల్లా వారిద్దరూ క్లబ్ లోకి వెళ్ళారు.

అప్పటికే తతిమ్మా ఆఫీసర్లందరూ, తమతమ భార్యలతో వచ్చి ఉన్నారు. రకరకాల నగలు, జరీ చీర అంచులు, ఆ దీపపు కాంతిలో తళుకు తళుకు మని మెరుస్తున్నాయి. శ్యామల ఒక్కతే సాదా చీరతో, నిరాడంబరంగా ఉన్నది. భర్త ప్రక్కనే, ఒక మూల, సోఫాలో కూర్చుని తమాషా చూస్తోంది; తనకు ఈ నాటకంతో ఏమీ ప్రసక్తి లేనట్లు. అవును, నాటకంలాగే ఉంటుంది. క్షణక్షణమూ మారిపోయే వ్యక్తుల హావభావాలు చూడడానికి వింతగా ఉంటాయి. తను తరుచు ఇల్లు విడిచి రాదు కాబట్టి వీరిలో చాలామందిని ఆమె ఇదివరకు ఎరుగదు. అటూ, ఇటూ తిరుగుతూ, ఒక్కొక్కరే తమ వేపు వచ్చినపుడల్లా కామేశ్వరరావును పలుకరిస్తారు. అతడు ఆమెను వారికి పరిచయం చేస్తాడు. ఒక చిరునవ్వుతో, నమస్కారంతో శ్యామల తన బాధ్యత తీర్చుకుంటుంది.

ఉన్నట్టుండి, మీరా వచ్చింది వారున్న చోటకు. కామేశ్వరరావు లేచి నిలబడి, "ఈమె మా ఆఫీస్ సెక్రటరీ శేఖర్ భార్య, మీరా - శ్యామల" అంటూ వారిద్దరినీ పరిచయం చేశాడు. "మీపాపను కూడా తీసుకురాలేదేమండీ" అని ప్రశ్నించాడు ఆమెను.

"లేదు" అన్నది మీరా, ముక్తసరిగా.

"ఏం, మీరా! నన్ను మరచిపోయావా? శేఖర్ ఏడీ" అని, "మీరాదీను మా అమ్మగారి ఊరే. మే మిద్దరం చిన్ననాటి స్నేహితులం. ఒకే కాలేజీలో చదువుకున్నాము శేఖరు, మేముకూడా" అన్నది భర్తవేపు చూస్తూ. మీరాను

తనప్రక్కనే కూర్చోమన్నది. ఆమె కూర్చుంటుందో కూర్చోదో అని కాస్త సందేహిస్తూ.

మీరా కూర్చుని, కామేశ్వరరావుతో పిచ్చాపాటి మాట్లాడసాగింది. ఆమె చూపులుమాత్రం అప్పుడప్పుడు శ్యామలపై ప్రసరిస్తున్నాయి. శ్యామలను చూచినప్పుడు, మీరా ముఖం చిన్ననాటి స్నేహితురాలిని చూచిన సంతోషంతో వికసించనూలేదు; ముభావంతో ముకుళించనూలేదు: కాని, ఆమె చూపులోమాత్రం, సరిగా అర్థంకాని వింత భావం కనబడింది. అది అసహనం అనుకోవడం యిష్టంలేదు శ్యామలకు. ఆ చూపు ఆమెకు చిరపరిచితమే. ఎందువల్లనో చిన్నప్పటినుంచీ, మీరా శ్యామలవైపు చూచినప్పుడల్లా ఏదో అయిష్టభావం గోచరించేది ఆమె కళ్ళల్లో. ఎందుకో శ్యామలకు అర్థమయ్యేదికాదు.

శ్యామల పుట్టింటికి ఎదురుగుమ్మమే మీరా పుట్టిల్లు. వారిద్దరిదీ ఇంచుమించు ఒకే వయసు. ఆటపాటలలో తరచు కలుసుకుంటూ ఉండేవారు. కాని మొదటినుంచీకూడా, మీరాకు శ్యామల పొడగిట్టేదికాదు. అది ఏ కారణంచేతనో శ్యామలకు తెలియలేదు. 'నీకెందుకు నేనంటే ఇష్టంలేదూ?' అని ఆమెను ఒకవేళ ప్రశ్నించినా, మీరాకూడా సరిగా చెప్పలేకపోయేదేమో.

మీరా పుట్టింటివారు భాగ్యవంతులు. చిన్నప్పటి నుంచి ఆమె అల్లారుముద్దుగా పెరిగింది. ఎప్పుడూ మంచి మంచి పరికిణీలు కట్టుకుని, విలువైన నగలు సింగారించుకొని అందరిదృష్టినీ ఆకర్షించేది. పిల్లలందరూ మీరా దుస్తులను

నగలను చూచి మెచ్చుకుంటూ, ఆమెను ఎంతో గొప్పగా చూచేవారు. ఎప్పుడూ ఆమె ఇంట్లోనే ఉండి, ఆమెతోనే ఆడుతూ పాడుతూ ఉండేవారు.

శ్యామల పుట్టింటివారిది సామాన్య కుటుంబము. పెద్ద సంసారం. అంచేత ఆమె విషయమై చిన్నప్పటినుంచీ ఎవరూ అంత శ్రద్ధ చూపలేదు. ఆమె అంత రూపసికూడా గాదు. కాని, తనకు విలువైన దుస్తులు కావాలనిగాని, నగలు పెట్టుకోవాలనికాని ఆమె ఎన్నడూ కోరలేదు. తను కట్టుకునే బట్టలు అంత అందంగా లేవని ఎన్నడూ అనుకునేదికూడా కాదు. ఆ విషయమ్మై ఆమెకు అంత పట్టింపులేదు, చిన్న ప్పటినుంచీ.

పిల్లలందరూ మీరా యింటికి అంతగా వెళుతూ ఉన్నా, ఆమెకు వెళ్ళాలని ఉండేదిగాదు. ఒకసారిమాత్రం, మీరా పిలిస్తే వెళ్ళింది. ఆవేళ మీరా ఖరీదైన పట్టు పరికిణీ కట్టుకుంది. వెల్ వెట్ జాకెట్టు తొడుక్కుంది. "చూడు! నా పరికిణీ బాగుందా? అన్నది మీరా తన బట్టలు శ్యామలకు చూపిస్తూ. "ఆ" అన్నది. శ్యామల ఇంకేం మాట్లాడలేదు ఎక్కువగా. తక్కిన పిల్లల్లాగా, మెచ్చుకోకపోవడంవల్ల మీరా చాలా చిన్నబుచ్చుకుంది. శ్యామలలో ఏమీ ప్రత్యేకత లేకపోయినా ఏదో నిండుతనం, సహజమైన నెమ్మదీ ఉండేవి. ఆమె ఎప్పుడూ వెకిలిగా నవ్వేదిగాదు. అందరిలాగా అతిగా మాట్లాడేదిగాదు.

శ్యామల అందరి పిల్లలలాగ ఉండకపోవడమే ఆమె లోపమేమో. అందుచేతనే, ఒకవేళ, మీరా ఆమెపై కక్ష

గట్టింది. పనిగట్టుకు శ్యామలను తన ఇంటికి రమ్మని పిలిచి, మళ్ళా ఆమెను తమతో ఆటలలోనికి చేరనియ్యకుండా, తక్కిన పిల్లలను చేర్చుకొని ఆడుకొనేది. కాని, శ్యామల అందుకు ఏమీ బాధపడేదికాదు. ఒంటరిగా, దూరంగా కూర్చునే, వాళ్ళ ఆటలు చూస్తూవుండి, వారంతా ఇళ్ళకు పోయేటప్పుడు తనూ వెళ్ళిపోయేది సంతోషంగానే.

ఆఊళ్ళో చదువు పూర్తయ్యాక, శ్యామల, మీరా కూడా పట్నంలో ఒకే కాలేజీలో చేరారు. అక్కడకూడా, మీరా శ్యామలతో స్నేహభావంతో ఉండటానికి ప్రయత్నించలేదు. కాని, శ్యామల ఏం చేస్తూందో ప్రతి నిమిషం కనిపెడుతూనే ఉండేది. ఎప్పుడూ ఆమెవైపే చూస్తూఉండేది. శ్యామల అటుతిరిగి చూచినప్పుడుమాత్రం ముఖం మరో వైపు త్రిప్పుకునేది. ఏదో తన పని తను చూచుకుంటూ, ఎవరితోనూ అంతగా జోక్యం కలిగించుకోకుండా గడుపుకు పోయేది శ్యామల. మీరా సగం కాలేజీని తనచుట్టూ చేర్చుకుని, ఊరికే కబుర్లు చెపుతూ, గొడవచేస్తూ ఉండేది. నలుగురి దృష్టి ఆకర్షించడం ఆమె కిష్టం. అట్లాగే ఉండేది.

పరీక్షలై, అందరూ ఇళ్ళకు వెళ్ళబోయేముందు కాలేజీలో ఒక టీ పార్టీ జరిగింది, అది శేఖర్ ఇచ్చాడు. అందరినీ పిలుస్తూ, శేఖర్ శ్యామలను 'మీరు తప్పకుండా రావాలని' మరీమరీ కోరాడు. శ్యామలకు మొదటినుంచీ ఇలాంటి పార్టీలు ఏమాత్రం ఇష్టంలేదు. "నేనెవరినీ అంతగా ఎరుగను. నాకు రావాలని లేదు" అని తప్పించుకోవాలనుకున్నది. కాని శేఖర్ "నేనుంటానుగదా, మీరు తప్పక రావాలి" అని పట్టు

బట్టాడు. విధిలేక, శ్యామల టీపార్టీకి వెళ్ళింది. శేఖర్ ఆమె ప్రక్కనే కూర్చున్నాడు. కాస్త అవతల మరో టేబిల్ వద్ద కూర్చున్న మీరా వారి నిద్దరినీ చూచింది. పైకి చిరునవ్వు నవ్వింది, గాని, ఆమె చూపులలో చెప్పలేనంత అయిష్టం కనిపించింది. ఆ తర్వాత ఆమె అతి వింతగా ప్రవర్తించింది. వీరినీ, వారినీ, పేర్లు పెట్టి పిలుస్తూ తనచుట్టూ చేర్చుకుంది. ఏవేవో కబుర్లు చెబుతూ అట్టహాసంగా నవ్వుతూ, అందరినీ కూడా నవ్వించింది. ఆ గల్లంతులో, అక్కడే శ్యామల కూడా ఉన్నట్టు ఒక్కరూ గుర్తించలేదు. శేఖర్ మాత్రం ఆమె ప్రక్కనే ఉండి, ఆమెతో మాట్లాడుతున్నాడు. అది గమనించి, ఈసారి శేఖర్‌నే, బిగ్గరగా పేరుపెట్టి పిలచి "శ్యామల తప్ప నీ కెవరూ కనబడడం లేదులా ఉంది. అసలు ఆమె కోసమేనా ఈ పార్టీ అంతా" అంది ఏదో వ్యంగ్యంగా. నవ్వుతూ అందరూ గట్టిగా నవ్వారు. శ్యామలకేసి తిరిగి చూశారు. ఆ మాటలకు సిగ్గుతో శ్యామల ముఖం ఎర్రగా కందిపోయింది. ఎందుకొచ్చానా ఇక్కడకు అనుకుంది. ఐనా, చేసేది లేక, కాసేపు ఉండి, లేచి వెళ్ళిపోయింది. మీరా ఎందుకల్లా తనను అవమానించటానికి ప్రయత్నించిందో ఎంత ఆలోచించినా, ఆమె కర్థం కాలేదు.

ఆ తరువాత, మీరా తరుచు శేఖర్‌తో కనిపిస్తూ ఉండేది. పని ఉన్నా లేకపోయినా, శేఖర్‌తో కలసి శ్యామల వద్దకు వచ్చి, ఆమెను పలుకరించి వెళుతూ ఉండేది. అది ప్రత్యేకంగా శ్యామలను బాధపెట్టటానికే వచ్చినట్లుండేది. మీరా అపోహ పడుతున్నదని ఆమె మనసు స్థిమిత పరచా

లని ఎంతో అనుకునేది శ్యామల. కాని అలా మనసిచ్చి మాట్లాడడానికి కాస్త అయినా అవకాశం ఇచ్చేది కాదు ఆమె. పైగా, మీరా తనవైపు చూచినప్పుడల్లా ఎంతో అయిష్టత స్ఫురించింది. ఇంత అయిష్టతకు కారణం ఊహించ లేకపోయింది శ్యామల. కొంచమైనా చనువిస్తే, కారణం కనుక్కొని, ఆమె మనస్సు మార్చడానికి ప్రయత్నించవచ్చు. తనలో ఏమి లోపమో తెలుసుకుని ఆ లోపం దిద్దుకోవచ్చు. ఏమి చెయ్యాలో తెలియక శ్యామల చాలా బాధపడింది. లేనిపోని అపోహలు పెట్టుగోకుండా, మీరా తనతో స్నేహంగా ఉంటే ఎంతో బాగుండుననిపించింది, ఎన్నోసార్లు. కాని, ఈ పరిస్థితులలో తను ఏం చెయ్యకలదు ?

కాలేజీ చదువు పూర్తయ్యాక, మీరా శేఖర్ని పెళ్లాడింది, ఆతర్వాత శ్యామలకు కూడా పెండ్లైంది. మళ్ళీ, ఇన్నాళ్ళకి, ఈ ఊళ్లో ఆమెకు మీరా తటస్థపడింది.

* * *

డిన్నర్ నుంచి ఇంటికి వచ్చేసరికి రాత్రి పదకొండు దాటింది. పడుకోబోతూ ఉంటే కామేశ్వరరావు అన్నాడు.

"మీరా చూడు ! ఎంత చలాకీగా ఉంటుందో ! ఆమె మూలాన పార్టీ ఎంతో కళకళలాడింది. అందరిలో, చాలా తెలివైనది" అన్నాడు.

శ్యామల ఏమీ అనలేదు. అతను చెప్పినది నిజమే అనిమాత్రం అనుకుంది. మీరా అందరితోనూ స్నేహంగా ఉంటుంది ఒక్క తనతో తప్ప. తను ఎంత ప్రయత్నించినా ఆమెలా ఉండలేదు. తనకూ, మీరాకు స్వభావంలో ఎంత

తేడా ఉంది! తను ఇద్దరి స్వభావాలమధ్య, ఉత్తర ధ్రువానికీ దక్షిణ ధ్రువానికీ మధ్య ఉన్నంత దూరముంది - అను కున్నది.

ఆవేళ డిన్నర్‌లో కలుసుకున్న తర్వాత చాలాసార్లు వారిద్దరూ కలుసుకున్నారు. రెండు మూడుసార్లు మీరాయే శ్యామల ఇంటికి వచ్చింది. కాని, శ్యామలను చూడడానికి వచ్చినా, మీరా కామేశ్వరరావుతోనే ఎక్కువగా సరదాగా మాట్లాడేది. ఆమె వచ్చి వెళ్ళినతర్వాత, ప్రతిసారి ఆమెను అమితంగా పొగడుతూఉండేవాడు అతను. ఈ ధోరణిచూసి శ్యామల కొంచం కంగారుపడింది. ఇదివరకు తనమీద అయిష్టంచేత పనికట్టుకొని శేఖర్‌ని ఆకర్షించినట్లే యిప్పుడు మీరా కామేశ్వరరావును ఆకర్షించటానికి ప్రయత్నిస్తోందా అనిపించింది శ్యామలకు.

ఉన్నట్టుండి, శేఖర్‌కి ఆ ఊరినుంచి మరో ఊరికి బదిలీ ఐంది. ఇది మీరా ప్రోద్బలంవల్లనే జరిగిందనీ, శేఖర్ అడగ బట్టి తనూ ఈ బదిలీ కావడానికి సహాయం చేశాననీ కామే శ్వరరావు అన్నాడు శ్యామలతో. ఊరు వెళుతున్నానని చెప్పడానికి వచ్చిన మీరా, "నాకు ఈ ఊళ్లో ఉండాలని లేదు. ఈ బదిలీకి మీవారుకూడా చాలా సాయపడ్డారు. అందుకు నేను కృతజ్ఞురాలను" అన్నది. తను ఉన్న చోట ఉండ డానికి ఇష్టంలేకే మీరా వెళ్ళిపోతున్నదనుకున్నది శ్యామల. మాటలలో ఏమీ ఎత్తిపొడుపు స్ఫురించలేదు శ్యామలకు. ఆవేళ మీరా కళ్ళల్లో మునుపటి అయిష్టంకూడా అంతగా కనబడలేదు. ఏదో నిరుత్సాహంమాత్రం కనిపించింది. మీరా

ఎప్పటికి మారదా, తనతో స్నేహంగా ఉండదా అను కొన్నది శ్యామల.

ఆ తర్వాత మూడేళ్ళదాకా మీరా సంగతి ఏమీ తెలియలేదు శ్యామలకు. శ్యామల సంసారం, చల్లగా ఏ ఒడి దుడుకూ లేకుండా సాగిపోతున్నది.

ఆవేళ సంక్రాంతి. శ్యామల ఇల్లంతా చక్కగా ముగ్గులు పెట్టింది. తలంటుకొని, కళ్ళనిండా కాటుక పెట్టు కొంది. కొత్తబట్టలు మడతవిప్పి అంచులకు పసుపు పెడుతూ వుండగా పోస్ట్‌వాడు 'పోస్ట్' అంటూ కేకవేసి గుమ్మంలో ఉత్తరంపడవేసి వెళ్ళాడు. ఉత్తరం తనపేరట ఉంది. పై దస్తూరీమాత్రం ఎవరిదో ఆమెకు స్ఫురించలేదు. బెంగుళూరు ముద్ర. బెంగుళూర్‌లో ఎవరున్నారు మాకు తెలిసినవారు అనుకుంటూ ఉత్తరం విప్పి చదువుకుంది.

అది మీరా వ్రాసింది!

"నేను ఇంకా నీకు జ్ఞాపకం ఉన్నాననే అనుకుంటా. నాకు ఆరు నెలలుగా సుస్తీగా ఉంటున్నది. కాన్సర్ అని తేలింది. ఈ వ్యాధి నయంగాదు. ఓపికతో, ఆఖరి నిమిషం కోసం కనిపెట్టుకుండాలి, అంతే.

నాకు ఈ జబ్బు వచ్చినప్పటినుంచీ నీవే మరీమరీ జ్ఞాపకం వస్తున్నావు. ప్రతి నిమిషమూ నీ రూపమే నా కళ్ళ ఎదుట మెదులుతూంది. నిన్ను ఒకసారి చూడాలని ఉంది, చాలా. నీవు రాగలవా?

నా జబ్బు నయం కాదని తెలిసి, మొదటిసారిగా, ఆఖరిసారిగా నిన్ను ఒకటి అర్థిస్తున్నాను! మా పాప సంరక్షణ

భారం నీపై మోపుతున్నాను. నాకు నీయందున్న గౌరవం, నా భర్తయందుగాని, తల్లి దండ్రులయందుగాని, ఇంకెవరి యందు గాని లేదు. నీ వద్ద ఉంటే నా పాపకు ఎటువంటి లోటూ రాదని నాకు తెలుసు. ఈ మాట మనస్ఫూర్తిగా అంటున్నాను.

మరొక్కమాట! నేను నీలా ఉండాలని ఎంతో ప్రయత్నించాను. నీ నెమ్మది, ఆరిందాతనము, ఓర్పు నాలో లేవని నాకు నీమీద కోపంకూడా వస్తూ ఉండేది. ఆకారణంగా, వింతగా ప్రవర్తించి, తరుచు నీమనస్సుకు బాధకల్గించాను. ఎన్నడో చెప్పవలసినది ఇప్పటికైనా చెప్పగలిగినందుకు నా మనస్సుకు శాంతి కలుగుతోంది. నేను అలవరచుకోలేని నీ సద్గుణాలు పోనీ, పాపన్నా అలవరచుకొంటుంది.

ఇంతే,

మీరా."

శ్యామల కళ్ళు గిర్రున నీళ్ళు తిరిగాయి. ఎంత వింత స్వభావము అనుకుంది. మీరాపై పట్టరాని జాలి కలిగింది.

కొత్తబట్టలు అవతల ఉంచి, ప్రయాణానికి కావలసిన బట్టలు సర్దుకో నారంభించింది.

అమ్మ

కలకత్తా వెళ్ళిన కొత్తలో, ఎందుకో, ఆ ఊరు చూస్తేనే భయంగా ఉండేది. రైలు దిగి, ఊళ్లో అడుగుపెట్టగానే అన్నీ కొత్తముఖాలు, క్రొత్తభాష, చుట్టూ మహారణ్యంలాగ పెరిగిన ఊరు. అన్నీ చూసి ఎక్కడ త్రోవ తప్పిపోతానో అని భయంవేసింది—ఆయన చేయి గట్టిగా పట్టుకున్నాను. సామాను సరిచూసుకోటంలోను, టాక్సీ కుదర్చడంలోను నిమగ్నులైవున్నవారు నేను చేయి ఎందుకు అంతగట్టిగా పట్టుకున్నానో అర్థంచేసుకోలేదు. విడిపించుకోటానికి ప్రయత్నించనూలేదు.

మా టాక్సీ పాములా సందుల్లో గొందుల్లో, మెలికలు తిరిగి తిరిగి బయలుదేరిన ఓ గంటకి వూరు చివర ఓ ఇంటి ముందు ఆగింది. అంతవరకు ఎడం లేకుండా దట్టంగా పెరిగిన వూరు ఇక్కడ విశ్రాంతి తీసుకున్నది. ఆ పేటలో ఆ ఇల్లు ఒక్కటే విడిగా ఉన్నది. చిన్న ఇల్లు, చుట్టూ కొంచం కాంపౌండు ఉన్నది. మేడమీద రెండు గదులున్నవి, అది ఎవరో వారి స్నేహితుని ఇల్లు. ఊరి చివర అని అక్కడ ఎవరూ ఉండటంలేదు. మాకోసం ఉంచారు కాబట్టి మేము మాత్రం దానిని వెతుక్కుంటూ వచ్చాం.

టాక్సీ అతను సామానంతా వరండాలో పెట్టి వెళ్లాడు. ఆయన కూడా ఆ ఇల్లు ఇదివరకు చూడలేదు. తాళం తీసుకుని

లోపలికి వెళ్ళి నేనేముందర అన్నీ దుమ్ము దులుపుకోవలసి వచ్చింది. సామాను సర్దుతూ ఉంటే ఆయన అన్నారు... "మేడమీద ఎవరో ఇద్దరు అమ్మాయిలు ఉంటున్నారట. వాళ్లు మార్చి ఆఖరుకు వెళ్ళిపోతారట. ఆ తరువాత పైన కూడా మనమే వాడుకోవచ్చన్నాడు రామం" అని చెప్పారు. నాకు చాల సంతోషమైంది. ఎవరో ఇద్దరు అమ్మాయిలు నాకు తోడుగా ఉండబోతున్నారని విన్నందుకు చాలఉత్సాహం కలిగింది అయితే వెంటనే, ఒక వంద ప్రశ్నలు, ఆలోచనలు నాలో చేరి నన్ను కలతపెట్టసాగినయి. ఆ అమ్మాయిలు ఎవరు? ఇక్కడ ఒంటరిగా ఎందుకున్నారు? బెంగాలీలేనా? హిందీగాని, ఇంగ్లీషుగాని వచ్చి ఉంటుందా? చాలా ఫాషనబుల్‌గా ఉంటారు కాబోలు. స్నేహంగా ఉంటారా? చాలా గర్వమేమో? చూడ్డానికి అందంగా ఉంటారా? ఇన్ని ప్రశ్నలతో, సందేహాలతో నాకు ఏ పనీ తోచలేదు. వాళ్ళను ఎప్పుడు చూద్దామా అన్న కుతూహలం ఎక్కువైంది.

మేము వచ్చేటప్పటికి మేడమీద ఇంట్లో ఎవరూ లేరు. మెట్లదగ్గర గది తాళంవేసి ఉంది. బహుశా బయటికి ఎక్కడికో వెళ్ళివుంటారు. ఆఊళ్లో మాకు తెలిసినవాళ్లెవళ్లూ లేరు. నేను ఆవూరికి రావటం అదే క్రొత్త. ఆయన ఆఫీసువాళ్ళెవరయినా ఉన్నా ఏమూలలో ఉన్నారు. మాకు అందుబాటులో లేరు. ఇన్ని కారణాలచేత ఈవూళ్లో ఒంటరిగా ఎట్లా వుండగలనా అనేభయం మొదటినుంచి నన్ను పట్టుకు వేధిస్తోంది. నాకు కొన్నాళ్ళదాకా ఇంట్లోనే ఎవరో తోడుంటారని తెలియగానే నా ఆత్రుతకు అంతులేదు.

అమ్మ

సాయంత్రం ఐదుగంటలకే పనిఅంతా [illegible] పూర్తిచేసుకుని వాకిట్లో తిన్నెమీద కూర్చున్నాను. ఆయ[illegible]న సామాన్లు తెస్తానని బజారుకు వెళ్లారు. ఏమీ తోచక [illegible] నేను ఎదురు చూస్తూ కూర్చున్నాను. ప్రొద్దు వాలేకొద్దీ [illegible] ఇంకా రాలేదే అనే బెంగ ఎక్కువవుతోంది. ఎదురుగుండా [illegible]ఎవరో మార్వా డీల యిళ్లు చిన్నచిన్నవి గుంపుగా ఉన్నవి. [illegible] ఆ ఇళ్ళన్నింటికి ముందర చిన్న ఆవరణ వుంది. అందులోనే [illegible] మధ్యగా ఒక కొళాయి ఉంది. అక్కడ ఆడవాళ్ళంతా వ[illegible]ుసుగులు సవ రించుకుంటూ బిందెలతో నీళ్లు జేరేసుకుంట[illegible]న్నారు. పిల్ల లంతా వాళ్ళ చుట్టూ జేరి ఆడుకుంటున్నారు. [illegible] వాళ్ళ ఎర్ర చొక్కాలు, పచ్చచొక్కాలు గాలిలో ఎగు[illegible]రుతూ తమా షాగా ఉన్నాయి. ఆ చోద్యం చూస్తూ కూర్చున్నాను.

మేడమీద అమ్మాయిలు కాబోలు, చ[illegible]ుక్కున గేటు తీసుకుని లోపలికి వచ్చారు. దూరాన ఎక్క[illegible]డో పరధ్యా న్నంగా చూస్తున్న నేను వాళ్లు దగ్గరకు వచ్చేదాకా గమ నించనేలేదు. వారిలో ఒకమ్మాయి సన్నగా పొ[illegible]డవుగా వుంది. రెండవ అమ్మాయికూడా సన్నగానే వుందిగా[illegible]ని, పొట్టిగా వుంది. అయితే ఇద్దరూ ఏమంత అందంగా లే[illegible]రు. ఒకమ్మా యిది కోలముఖం, అయితే, నల్లని కళ్ళల్లో [illegible] ఏదో నీరసం, నిస్పృహా. రెండవ అమ్మాయిది చామనచా[illegible]య. సామా న్యంగా ఉంది. ఇద్దరు సన్నని బెంగాలీ అంచ[illegible]ులుగల తెల్ల చీరలు కట్టుకున్నారు. ఇద్దరి భుజాల్న రెండు [illegible] కొత్త ఫాషన్ సంచులు వ్రేలాడుతున్నాయి. సన్నగా పొ[illegible]డవుగా వున్న అమ్మాయి ఆ సంచిభారంతో నేలకు వాలిప[illegible]ోతున్నట్లుంది.

రెండవ అమ్మాయిమాత్రం ఆసంచీ ఆధారంతోనే నేలమీద నిలబడగలిగినట్లు స్థిరంగావుంది. ఇద్దరివైపు క్షణం నిదానించి చూచాను. ఆ తరువాత ఏమిచెయ్యాలో తెలియక చిరునవ్వు నవ్వటానికి ప్రయత్నించాను. వాళ్ళుకూడా కళ్ళు పెద్దవి చేసుకుని ఎవరా ఈమె ? అని, కాస్సేపు తేరిపార చూచారు. తరువాత, మాట్లాడకుండా మెట్లగది తలుపుతీసుకుని వెళ్ళి పోయారు.

నేను అట్లాగే ఇంకా అక్కడే చాలాసేపు కూర్చు న్నాను. క్రమంగా చీకటిపడింది. ఆకాశాన నక్షత్రాలన్నీ గుంపుగా నిండి, ఇంటిముందర పందిరివేసినట్టు ఆకాశం వున్నది. ఆయన ఇంకారాలేదు. ఎదటింటి ఆవరణలో సందడి క్రమంగా తగ్గిపోతున్నది. ఏమిచెయ్యాలో తోచక అట్లాగే చూస్తూ కూర్చున్నాను.

కాసేపటికి మేడమీద నుంచి ఒక అమ్మాయి దిగి వచ్చింది. ఆ అమ్మాయే ఇద్దరిలోకి పొడుగు. చిన్నగా నవ్వుతూ నా దగ్గరికి వచ్చింది.

"మీరు ఎప్పుడూ, ప్రొద్దునే వచ్చారా" అన్నది స్పష్టమైన తెనుగు మాట్లాడుతూ. నా ప్రాణం లేచివచ్చింది ఆ మాటలు వినేసరికి. మేము తెనుగువాళ్ళమని ఎట్లా వూహించుకొన్నదో ! కంగారుగా, 'ఆ' అన్నాను ముఖా వంతో. "మీరు వస్తారని రామారావుగారు ఇదివరకే చెప్పారు. మాకు తోడు ఉంటారుగదా అని చాల సంతో షించాము." ఆ పిల్ల చనువుగా, నా ప్రక్కనే తిన్నెమీద కూర్చున్నది.

"మీరు తెనుగువాళ్ళా? ఇక్కడ ఏం చేస్తున్నారు?" అన్నాను ధైర్యం తెచ్చుకుని.

"మాది బరంపురం. నేను, మా స్నేహితురాలు ఇద్దరం డాక్టరు ప్యాసయ్యాం. వూరికే ఒక మూడు నెలలు ఇక్కడ హాస్పిటల్ లో ట్రయినింగ్ కు వచ్చాం. రామారావుగారు మాకు బాగా తెలుసు. అందుకే ఇక్కడ ఉండటానికి వీలైంది" అని, ఒక్కక్షణం ఆగి—"ఇంకో రెండు నెలల్లో వెళ్ళిపోతాం" అన్నది. ఎవరో కొన్నాళ్ళయినా ఉంటారుగదా అని సంతోషించాను. కాస్సేపుండి "మీ కొళాయిలో నీళ్లు పట్టుకో వచ్చా, పైన మా పంపులో ఎందుకో నీళ్ళు రావడంలేదు. ఇవాళ" అన్నది. తరువాత మేడమీదకు వెళ్ళి కూజా తెచ్చుకొని లోపలికి వచ్చి నీళ్లు పట్టుకొన్నది. ఇల్లంతా వివరంగా పరికించి చూచింది. "అప్పుడే ఎంత బాగా సర్దుకున్నారండి! అచ్చంగా మా అమ్మలాగే!! ఆవిడా అంతే! ఎంత పని ఉన్నా, అన్నీ వెంటనే చక్కగా అమర్చుకొంటేగాని ఆవిడకు తోచదు. ఇల్లంతా ఎప్పుడూ ఎంత శుభ్రంగా ఉంటుందనుకొన్నారు! అద్దంలాగా!! ఇంటికి వచ్చిన వాళ్ళంతా ఎంతో ఆశ్చర్యపోతారు. వస్తువులన్నీ ఎంతో చక్కగా, మ్యూజియంలో అమర్చినట్లున్నాయి గాని, అసలు మనుష్యులు తిరుగుతున్న ఇల్లులాగానే లేదని అంత బాగా అమరుస్తుంది." ఈ ప్రశంసకు చాలా సంతోషించాను. ఆ అమ్మాయి మేడ మీదకు వెళ్లుతుంటే అడిగాను, మీ పేరు చెప్పారుకాదే అని, నవ్వుతూ "నా పేరు సుహాసిని. నాతో ఉన్న అమ్మాయిపేరు రేఖ. రేఖను కూడా పిలుచుకొస్తా నుండండి. నా వాగుడు

ఆమె కబ్బలేదు. రేఖకు కొత్తవాళ్ళనిచూస్తే కాస్త భయం" అంటూ గట్టిగా నవ్వుతూ వెళ్ళిపోతూ, చటుక్కున ఆగి ఓ అడుగు వెనక్కి వేసి, మీ పేరు చెప్పారుకాదు—అన్నట్టు నేనూ అడగలేదు" అన్నది ఆమె. నాపేరు చెప్పాను.

ఆ తరువాత సుహాసినీ, రేఖ వాళ్ళకు తిరిక ఉన్నప్పుడల్లా వచ్చి కూర్చుని కబుర్లు చెపుతూఉండేవారు. సాధారణంగా వాళ్లు రోజూ ప్రొద్దునే ఏడు గంటలకల్లా వెళ్ళిపొయ్యేవారు. మళ్లా సాయంత్రం ఏడు గంటలకే వచ్చేవారు. ఆ వేళకే నా పని అంతా పూర్తి అయి నాకు కొంచం తిరికగా ఉండేది. నేను మామూలు ప్రకారం చల్లగాలికి వరండాలో కూర్చొని ఉంటే వాళ్ళు వచ్చి కొంచంసేపు కూర్చొని కబుర్లు చెపుతూ ఉండేవారు. ఇద్దరిలోకి రేఖ చాలా అమాయికంగా, ముభావంగా ఉండేది. అవసరముండి పలకరిస్తేనేగాని అంతగా మాట్లాడేదికాదు. అయినా చనువుగానేఉండేది. ఇక సుహాసిని ఎప్పుడూ కలకల్లాడుతూ,ఎన్నో వింత వింత కబుర్లు చమత్కారంగా చెపుతూ,నన్నూ, రేఖనూనవ్విస్తూ ఉండేది. ఒక్కొక్క రోజు వాళ్ళిద్దరిలో ఎవరికైనా ఒంట్లో బాగుండక పోయినా, బద్ధకంగా ఉన్నా, ఇంట్లోనే ఉండిపొయ్యేవారు. అప్పుడు మాత్రం రోజంతా నాతోనే ఉండేవారు.

సాధారణంగా మధ్యాహ్నం ఏమీ తోచకపోతే నేను ఏదో అల్లుకుంటూ ఉండేదాన్ని. రోజూ సాయంత్రం ఇంటికి రాగానే నేనేమాత్రం కుట్టానో ఇద్దరూ వచ్చి చూచి మెచ్చుకుంటూ ఉండేవారు. కొంచంసేపు మాకు సంభాషణ నా కుట్టుపని గురించే ఉండేది.

కాని, ఆవేళ మొట్టమొదటిరోజున పరిచయం చేసుకున్న సుహాసిని తల్లినిగురించి నేను తరువాత చాలా తెలుసుకోవలసివచ్చింది. ఏదోవిధంగా తనతల్లినిగురించి చెప్పకుండా, ఆమెను మెచ్చుకోకుండా సుహాసిని రెండుమాటలు చెప్పలేదు. సంభాషణ దేనినిగురించియైనా సుహాసిని ఎక్కువగా తల్లినిగురించే మాట్లాడేది. నేను కుట్టిన ఎంబ్రాయిడరీ పూవులు చూచినప్పుడు సుహాసిని "ఎంతచక్కగా కుట్టారండీ!" అంటూ మెచ్చుకుంటూనే, మళ్ళా నవ్వుతూ "అయితే మా అమ్మలాగమాత్రం ఎవరూ కుట్టలేరండీ! ఆవిడ కుడితే ఆ గులాబీపూవు అలా ఎక్కడినుంచో వచ్చి, ఆ గుడ్డమీద వాలినట్లుంటుందండీ! అసలు ఎంతతొందరగా కుడుతుందనుకున్నారు! ప్రొద్దున మొదలుపెట్టిందంటే సాయంత్రానికి ఒక పది బల్లగుడ్డలు కుట్టేస్తుంది. అసలు మొదలుపెట్టాలేగాని"...అనేది. ఇదే ధోరణి. దేన్నిగురించి అయినా తన తల్లిని ఆకాశాని కెత్తేసేది. నేను ఎప్పుడైనా పిండివంటలేవైనా వండిన, తినమని యిచ్చినా, అలాగే అనేది. "మీా రిచ్చిన మిఠాయి బాగున్నదండీ. కాని. మా అమ్మ జ్ఞాపకంవచ్చి ఒక్కముక్క తినలేదండీ! వంట ఎంత బాగా వండుతుందనుకున్నారు, మా అమ్మ! అందరిలాగా మసాలా అది ఏమీా వెయ్యదండీ! అయినా ఎంత రుచిగా ఉంటుందనుకున్నారు! వందమందికైనా ఒక్కనిముషంలో వండేస్తుంది" అనేది. ఎప్పుడూ రేడియో పెట్టుకోనిచ్చేదీ కాదు. ఎవరు ఎంతబాగా పాడుతున్నా సరే, "మాఅమ్మ పాట ఒక్కసారి వినాలండీ మీారు. అదేం కంఠం అనుకున్నారు! మళ్ళా

సంగీతం ఏమీ చెప్పుకోలేదండీ! అయినా, ఊరికే కూని రాగం తీస్తేనే చాలు, అక్కడినుంచి వెళ్ళబుద్ధవదు"... అనేది.

క్రమంగా ఈధోరణితో నాకువిసుగొత్తింది. రేఖమాత్రం ఈ ధోరణికి చాలారోజులుగా అలవాటుపడినట్లు ఏభావమూ లేకుండా మెదలకుండా వింటూ ఊరుకునేది. నాకుమాత్రం ఎందుకో రోజురోజుకు చిరాకుగా వుండేది. భార్య ఎంతబాగా వండినా తల్లి వంటలా లేదని కొందరు మగాళ్ళు అంటారని వినికిడి. అయితే స్త్రీలలోకూడా ఇటువండి జాడ్యం ఒకటి ఉంటుందని నేను ఎప్పుడూ ఊహించుకోలేదు. తల్లిమీద ప్రేమచేత సుహాసిని మాటల్లో కొంత అతిశయోక్తి ఉండడం సహజమే అనుకున్నా. ఆమె ధోరణి ఏదో వ్యసనంలా కన బడింది. ఆఖరుకి నేను ఎంతో అపురూపంగా ఆరునెలలు కష్ట పడి కుట్టుకున్న హాండ్ బాగ్ చూచి "ఇట్లాంటివి మా అమ్మ ఒక్కడజను ఒక్కరోజులో కుట్టిపారేస్తుండండీ. ఇంట్లో ఏమూల చూచినా అవే! ఇంటికి వచ్చినవాళ్ళంతా అడ క్కుండానే పట్టుకుపోతుంటారు!" అని ఎంతో నిర్లక్ష్యంగా అనేసరికి నామనస్సు చివుక్కుమన్నది. ఆ హాండ్ బాగ్ కుట్టడం ఏదో ఘనకార్యం చేస్తున్నట్లుగా నేను సంతోషిస్తు న్నాను. ఇంక ఉండబట్టలేక అన్నాను. "మీ అమ్మగారేదో చాల అపురూప వ్యక్తిలా ఉందే. ఒక్కసారి మీవూరువచ్చి ఆవిడను చూడాలి" అన్నాను. సుహాసిని ముఖం ఒక్కక్షణం పాలిపోయింది. మళ్లా తెప్పరిల్లుకొని మామూలు ఉత్సా హంతో వెళ్ళిపోయింది.

ఆ తరువాత హోలీపండుగ వచ్చింది. వాళ్ళకు రెండు రోజులు సెలవు వచ్చింది. రేఖ వూరికి వెళ్ళింది. ఆరోజంతా సుహాసిని ఎంతో దిగులుగా కళ్ళనీళ్లు పెట్టుకుంటూవుంది. ఆపిల్ల అంత విచారంగా ఉండడం నేనెప్పుడూ చూడలేదు. నేను పలకరించగా "రేఖ ఊరికి వెళ్ళిందండీ, నాకేమీ తోచటంలేదు" అని గొడవచేసింది. "నువ్వూ వెళ్ళకపోయావా మీ ఇద్దరిది ఒక్కవూరేగదా!" అన్నాను. గబుక్కున కళ్ళనీళ్లు తుడుచుకొని 'నాకిక్కడ చాలా పనులున్నాయండీ, మా అమ్మగారు రమ్మని రోజుకు మూడుత్తరాలు రాస్తున్నారుగాని' అని అంటూ మళ్లా కళ్ళుతుడుచుకుంటూ వెళ్ళిపోయింది. ఆ అమ్మాయి ప్రవర్తన నాకు అర్థంకాలేదు. అయితే ఆపిల్ల జీవితంలో ఏదో రహస్యం దాచుకున్నదని మాత్రం చూచాయగా తోచింది.

రేఖ తిరిగివచ్చిన మర్నాడే సుహాసినికి జ్వరం వచ్చింది. మూడురోజులదాకా తగ్గనేలేదు. పాపం! ఇళ్ళకు దూరంగా ఒంటరిగా ఉన్నారని వాళ్ళ సంరక్షణభారం అంతా నామీద వేసుకున్నాను. సుహాసినికి వేళకు మందు, జావ అన్నీ చూచుకోటం నావంతయిపోయింది. రేఖ ఇంట్లో వున్నప్పుడు రేఖ చూచుకునేది. నాలుగవ రోజునకూడా జ్వరం తగ్గకపోయేసరికి నాకు భయంవేసింది. ఈపిల్ల యింటికి వెళ్ళలేదని బెంగపెట్టుకొన్నదనీ, అందుకే జ్వరం వచ్చిందేమోనని అనుకున్నాను. సుహాసినితో చెప్పి ఎట్లాగైనా ఇంటికి పంపుదామని అనుకున్నాను. ఆమాట చెప్పటానికి ఆవేళ సాయంత్రం మేడమీదకు వెళ్లాను. నేను వెళ్లేసరికి

రేఖ, సుహాసిని లోపల మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ మాటలు అస్పష్టంగా మెట్లదగ్గరకు వినిపిస్తున్నాయి.

"పోనీ ఒక్కసారి ఇంటికి వెళ్ళగూడదా" అంటున్నది రేఖ, నా అభిప్రాయాన్నే వెలిబుచ్చుతూ. ఆ మాటకు సుహాసినికి కోపం వచ్చినట్లున్నది. గొంతు పెద్దదిచేసి బాధతో అంటున్నది: "అన్నీ తెలిసి నువ్వుకూడా అట్లా అంటావేం రేఖా! ఇంటికి ఎట్లా పోను? ఎవరున్నారని పోను?" దుఃఖంతో, ఆమెకు తరువాత మాట రాలేదు. ఇద్దరూ నిశ్శబ్దంగా వూరుకొన్నారు.

నా గుండెల్లో ఏదో కలుక్కుమన్నది. సుహాసిని ఎందుకిట్లా అంటున్నదా అనిపించింది. అంత ప్రేమగల తల్లి, నేర్పరి అయిన తల్లి ఏమైపోయినదా అనిపించింది. ఏమీ తోచక, లోపలికి వెళ్ళకుండానే, నేను క్రిందికి దిగి వచ్చేశాను.

కాస్సేపటికి, రేఖ కూడా క్రిందికి వచ్చింది. సుహాసినికి హార్లిక్సు కావాలి, కాచి యివ్వమని వచ్చింది. నేను ఏమీ తెలియనట్లుగా అడిగాను: "ఎంతకూ జ్వరం తగ్గటంలేదు. పోనీ,సుహాసిని నాలుగురోజులు ఇంటికి వెళ్ళివస్తే బాగుండదా, రేఖా?" అని. రేఖ మాట్లాడలేదు. విచారంగా నా ముఖంకేసిచూస్తూ వూరుకొన్నది. స్టవ్ మీద నీళ్ళు తెర్లుతున్నాయి. దానిని దింపి మళ్ళా అన్నాను, ఎట్లాగైనా తరచి, సంగతి తెలుసుకోవాలన్న కుతూహలంతో: "ఏం మాట్లాడకుండా వూరుకొన్నావు! సుహాసిని వెళ్ళనంటున్నదా ఏం?"అని. ఇంక రేఖ వుండబట్టలేకపోయింది. ఏ విషయంలోను దాపరికం అసలా పిల్లకు చాతకాదు. సరళంగా సూటిగా మాట్లా

డడం తప్ప. దిగులుగా నాకేసి చూస్తూ అన్నది. "అది కాదండీ. అసలు సుహాసినికి ఇంటికి పోవటానికే వీలులేదు. ఈ సంగతి ఎవరితోనూ చెప్పడం సుహాసినికి ఇష్టంలేదు. నన్ను కూడా ఎవరితోనూ చెప్పనీయదు. సుహాసినికి తల్లి లేదండీ— చిన్నప్పుడే పోయింది. ఆ తండ్రి మళ్ళా వెంటనే పెళ్ళి చేసుకున్నాడు. చిన్నప్పటినుంచి సుహాసినిని అక్కడా అక్కడా హాస్టల్సులోనే ఉంచి చదివిస్తున్నాడు. సుహాసిని సవతితల్లి చాల గయ్యాళి. పాపం దానిని సెలవలకుకూడా ఎప్పుడూ ఇంటికి రానియ్యదు. వాళ్ళ నాన్న కూడ ఏమి చెయ్యలేక వూరుకుంటాడు."

రేఖకి కళ్ళనిండా నీళ్ళు తిరిగినవి. మాట్లాడకుండా కళ్ళు తుడుచుకొని హార్లిక్సు కలుపుకొని వెళ్లిపోయింది.

నా ఒళ్ళంతా ఎందుకో ఒక్కసారి నీరసపడినట్లనిపించింది. సుహాసిని మీది కోపం అంతా ఒక్కసారి చల్లారి, అపరిమితమైన జాలి ముంచుకొచ్చింది. తల్లి ప్రేమను పోగొట్టుకొనడంకంటే దౌర్భాగ్యం ఏముంటుంది జీవితంలో!

సుహాసిని ప్రవర్తనకు ఇప్పుడొకవిధంగా అర్థం స్ఫురించినట్లు తోచింది. తనకు లేని సుఖాన్ని మాటలలో,కల్పనలలో అనుభవించటానికి ప్రయత్నిస్తోంది.

ఆ తరువాత నాకొక మంచి ఆలోచన తట్టింది. సుహాసిని ధోరణి మార్చటానికి అదే మంచి ఉపాయమని తోచింది. సుహాసినికి కరువైన ప్రేమను నేను ఇవ్వలేనా? ఒక వ్యక్తి తన్ను తల్లికన్న ఎక్కువగా ప్రేమిస్తుప్పుడు సుహాసిని తన వూహా ప్రపంచాన్ని విడచిపెట్టవచ్చు. తప్పకుండా

అలా చేసి చూడాలనుకున్నాను. అసలు అపరిమితమైన జాలి చేత, నాకు సహజంగానే సుహాసిని మీద అనురాగం కలిగింది.

పదిరోజులవరకు సుహాసినికి జ్వరం తగ్గలేదు. ఆ అమ్మాయి జ్వరం బాగాతగ్గి, మళ్లా మామూలుగా లేచి తిరిగేవరకు, నేను ఇంట్లోపనికూడా మరచిపోయి, రాత్రింబవళ్లు ఆమెతోనే ఉంటూవచ్చాను. వేళకు మందు, పాలు, వగైరాలు చూచుకుంటూ, మిగతా టైములో ఆమెతో కాలక్షేపానికి, కబుర్లు చెబుతూ కూర్చున్నాను. ఆ పది రోజులు ఆమె ఒక్కసారైనా తన తల్లి ప్రసక్తి తీసుకు రాలేదు. పూర్వపు ధోరణి పోయినదని నేనూ సంతోషించాను. ఆమె కళ్ళల్లో ప్రతినిమిషం నాయెడల ఎంతో కృతజ్ఞత కనిపించేది. ఒక్కసారిమాత్రం అన్నది: "చూడండి! దిక్కులేనివారికి దేవుడే దిక్కు చూపిస్తాడంటారు. నాకోసరం మీరెంత శ్రమపడుతున్నారు. మా అమ్మ దగ్గర లేక పోయినా" ... అన్నది. "పోనీలే, నేనే మీఅమ్మననుకో" అన్నాను, నవ్వుతూనే. ఆమె మాట్లాడలేదు. ముఖం అటు త్రిప్పుకొని పడుకొన్నది. కళ్ళనీళ్లు పెట్టుకున్నదేమో! ఏదైనా ఇక సుహాసిని మారిపోతుందని నేను ఆశించాను.

జ్వరం బాగా తగ్గాక సుహాసిని, రేఖ మామూలుగా ప్రొద్దున్నే వెళ్ళి సాయంత్రం వస్తుండేవాళ్లు. ఆ వేళ సాయంత్రం మేం ముగ్గురం వాకిట్లో తిన్నెమీద కూర్చున్నాము. నేను ఆ ఇంటికి వచ్చిన మొదటిరోజులాగా ఆ వేళా నక్షత్రాలు కుప్పలుగా మా ముంగిలి చుట్టుకొని ఉన్నాయి. ఎక్కడినించి వస్తోందో తెలియకుండా చల్లనిగాలి మాటి

మాటికి మా ప్రాణాలను తడుపుతున్నది. బయట అంతా నిశ్శబ్దంగా ఉన్నది. పరధ్యాన్నంగా పైకిచూస్తూ అన్నాను:

"ఎంత బాగున్నదో! ఎవరో పొరపాటున బంగారు నాణాల సంచి దొర్లించినట్లు లేదూ!" అని. సుహాసినికూడా అంతవరకు ఏదో పరధ్యాన్నంగా ఆలోచిస్తోంది. అట్లాగే అన్నది: "అవునండీ, ఎంత హాయిగా ఉన్నదో. అట్లాగే నక్షత్రాలకేసి చూస్తూ కూర్చోటం మా అమ్మకెంత ఇష్టమో!" అని.

నేను ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను. మరిచిపోయిం దనుకున్న మాటల ధోరణి మళ్లా మొదలుపెడుతున్నది. అది వూహా, కల్పనా? ఆమె అమాయకురాలా? గడుసరా?

నాకు ఎటూ తోచలేదు. కాస్సేపటికి నేనే తేరు కొన్నాను. ఆమెకు జీవితంలో తల్లి కరువైనా కల్పనలో ఒక అపూర్వమైన మాతృదేవతను సృష్టించుకొన్నది. ఆ వ్యక్తిలో ఏ లోపమూ లేదు; ఏ దోషమూ లేదు. సుహాసిని ఆ వ్యక్తిని అన్నివిధాలా ఆదర్శప్రాయంగా సృష్టించుకొన్నది. ఒక్కొక్కప్పుడు ఆ కల్పనే ఆమెకు వాస్తవంగా తోస్తుం దేమో! ఇంకెవరికీ ఆ స్థానం ఆక్రమించే అర్హతలేదు.

ఏదైనా, ఆ కల్పన ఆమెకు ఆనందాన్ని, తృప్తిని ఇస్తున్నప్పుడు కాదనడానికి నేనెవర్ని?

మారిన మనిషి

రాత్రి పదిగంటలైంది. రైలు నాంపల్లి స్టేషన్‌లో ఆగేసరికి జోరుగా వానకురుస్తోంది. ఈదురుగాలి, ఎల్లాగో రైలుదిగి, సామాను దింపించుకుని బెదురుతూ అటూ, ఇటూ కలయచూశాను, మావాళ్లెవరైనా వచ్చారేమోనని. ఎవరూ రాలేదు. మూడురోజుల క్రిందటే ఉత్తరం రాశాను, ఫలాన రైలుకు వస్తున్నాను, స్టేషనుకి రమ్మని. ఉత్తరం అందలేదేమో, ఎవరూ రాలేదు.

ఆ ఊళ్ళో మా మేనమామ ఉంటున్నాడు. ఏదాకేండ్లుగా రమ్మని రాస్తుంటే అనుకోకుండా ఇప్పుడు బయలుదేరాను. తగినట్టుగానే రైలు లేటు. జోరువాన, కొత్తఊరు. స్టేషనుకు ఎవరూరాలేదు. ఏమీ తోచక బెంగగా సామాను పట్టించుకుని బయటికి నడిచాను. అడ్రసు కాగితం భద్రంగా పర్సులో వుందిగాని, ఆపేట ఎక్కడో ఏమిటో, ఎలా వెళ్ళాలో నాకేమీ తెలియదు. బెంగగా, ఇంకా ఎవరైనా వస్తారేమో ననే ఆశతో, దిక్కులు చూస్తూ నిల్చున్నాను. రైలు దిగి వచ్చిన వాళ్ళందరూ ఒక్కొక్కరే ఎవరిదోవన వాళ్ళు వెళ్ళిపోయారు. ఎవరూ లేరు. రిక్షాలు కూడా అన్నీ వెళ్ళిపోయాయి. ఒక్కటే మిగిలింది. నేను ఇంకా తటపటాయిస్తూంటే, ఆ రిక్షావాడే దగ్గరగా వచ్చి పలకరించాడు. "రిక్షా కావాలాండి? వానలో తడిసిపోతున్నారు రండి. ఎక్కండి?" అన్నాడు. ఈ చీకట్లో, ఈ వానలో వీడిని నమ్మి, ఒంటరిగా

రిక్షాలో పోవడమా ? వీడు తాగి లేడుగదా ! అయినా అంత కన్నా చేసేది కనబడలేదు. భయంతో, అడ్రసు జ్ఞాపకం వున్నంతవరకూ చెప్పి "నీకు త్రోవ తెలుసా ? ఎంత దూరం వుంటుందీ ? జాగ్రత్తగా తీసుకు వెడతావా" అని అడిగాను. వాడు రెండు మూడు మైళ్ళుంటుందని, తను సరిగా తీసుకు వెళ్ళగలనని చెప్పాడు. పన్నెండణాలకు బేరం మాట్లాడుకుని దేవుడిమీద భారంవేసి ఎక్కి కూర్చున్నాను.

సామాను రిక్షాలో పెడుతుండగా వాడు నన్ను చూసి నవ్వుతూ అన్నాడు. "మీకేం భయంలేదండీ, నేను జాగ్రత్తగా తీసుకువెడతానుగా ?" అని మళ్ళా కాస్త నవ్వుతూ అన్నాడు. "అమ్మగారు నన్ను గుర్తించలేదు" అని. "ఈ రాత్రివేళ వీడెవడూ వీడిని నేను గుర్తించడమేమిటీ" అని నేను మరికాస్త గాభరాపడ్డాను. వానపడకుండా రిక్షాకు పట్టా కడుతూ వాడు మళ్ళా అన్నాడు: "నేను నారాయణని' అమ్మగారూ బెజవాడలో మీదగ్గర పనిచేశానుగా" అని.

నాకు వెంటనే గుర్తుకురాలేదు. నారాయణ అన్న పేరు ఎక్కడో విన్నట్టు లీలగా మనస్సుకు తోచింది. ఆలోచించగా కాస్సేపటికి గుర్తువచ్చింది. రాగానే గుండెల్లో రాయిపడింది. ఖర్మ! ఈ రాత్రివేళ ఈ యీదురుగాలి, వానలో, వీడి రిక్షాలోఎక్కి కూర్చున్నాను. వీడు నామీద కోపంకొద్దీ ఈ రిక్షాను ఏగుంటలోకో తోసెయ్యడుగదా! ఏమో! ఎప్పటికేది రాసిపెట్టివున్నదో అనుకుంటూ ముఖంమీద కారుతున్న వాననీరు తుడుచుకుంటూ కూర్చున్నాను. మనక

మసకగావున్న వీధిదీపాలు తప్పించుకుంటూ సందులుగొందులు తిరిగి రిక్షా ముందుకు సాగింది.

* * *

పన్నెండేళ్ళక్రిందటి మాట. అప్పుడు ఆయన బెజవాడలో ఉద్యోగంలో ఉన్నారు. కొత్తగా బదిలీఅయి వచ్చాం. అంతకుముందు వేసవిలో అక్కడ ఒక దొరగారు వుండేవారు. ఆ బెజవాడ ఎండలకు తట్టుకోలేక ఆయన మూడు నెలలైనా కాకముందే బెంగుళూరు బ్రాంచికి మార్పించుకున్నారు. అంచేత, రాజమండ్రిలో స్థిరంగా, సుఖంగావున్న మమ్మల్ని కొన్నాళ్ళపాటు బెజవాడ వెళ్ళమన్నారు. ఆంధ్రప్రదేశ్ లో పుట్టిపెరిగి ఎండలకూ, దోమలకూ, మురికికాలువలకూ అలవాటుపడిన మాకు ఏఊరైనా ఫరవాలేదు. మేము సంతోషంగానే వెళ్లాము. అయినా అక్కడ మేము ఇబ్బందిపడ్డదీ ఏమీలేదు కంపెనీవాళ్ళు మాకు ఊరిబయట ఆఫీసుకు దగ్గరగా మంచి ఇల్లు ఇచ్చారు. మాకు ఇంట్లో పనిచేయడానికి ఒక నౌకరునుకూడా ఇచ్చారు. వాడే నారాయణ.

ఇల్లు శుభ్రంగా అన్నివసతులతో సౌకర్యంగా వుండేది. ఊరికి దూరంగా ఉండడంచేత దోమలబాధ, మురికినీటి బాధ, రెండూ తక్కువే. ఆయనకు ఆఫీసూ దగ్గరే! నడిచి పోవచ్చును. అన్నీ బాగానేవున్నాయి; కాని, నాకు వచ్చిన పేచీఅల్లా నారాయణతోనే. వాడికీ నాకూ మొదటి రోజునుంచే కుదరలేదు. ఇంట్లో పనికని ప్రత్యేకంగా నియమించారు కాబట్టి, వాడిచేత అన్నిపనులు చేయించుకునే

అధికారం నాకున్నదని నేననుకున్నాను. అది కాదని వాడను కున్నాడు; అంతే, మాకు కుదరలేదు. ఊరికి దూరంగా వుండడంచేత, వాడి కర్మ వాడిదని ఊరుకుని ఇంకో మనిషిని పెట్టుకోడానికి నాకు వీలుపడలేదు. అంతదూరం ఎవరూ రారు. పనిచేస్తే వాడు చెయ్యాలి, లేకపోతే నేను చేసుకోవాలి, ఇల్లాగ యిద్దరికి తప్పలేదు.

నారాయణ చాలా మొరటు మనిషి. దానికి తగ్గట్టు మొండితనం, దురభిమానం, దురహంకారం అన్నీ వున్నాయి. వాడు ఇంట్లో నౌకరుగా కాక, ఏదో ఉద్యోగస్తునిగా తన్ను భావించుకున్నాడు. ధానికి తగినట్లే, అంతకుముందు వుండి పోయిన దొరగారికి సంసారం ఏమీ లేదుకూడా. బట్లరును తెచ్చుకున్నాడు వాడే గిన్నెలు తోమడందగ్గరనుంచి బట్టలు ఇస్త్రీ చేయడంవరకూ అన్నిపనులు చేసేవాడు. వంటా వార్పూ అంతా వాడిదే. ఆ దొరగారు ఉన్నన్నాళ్ళు నారా యణ పని సుఖంగావున్నది. ఆఫీసుకు వెళ్లేటప్పుడూ వచ్చే టప్పుడూ దొరగారి వెనకాలే కాగితాల కట్టలు తీసుకువెళ్ళ డమూ మిగతా టైములో వీధిగుమ్మందగ్గర కూర్చోవడమూ- అంతే పని. అదేదో గొప్ప హోదాగా వాడు భావించాడు.

ఆ ఊరికి వచ్చినరోజు, బండి దిగుతూవుండగానే నన్నుచూచి వాడు ముఖం చిట్లించుకున్నాడు. దొరగారి దగ్గర పనిచేసినవాడికి నాటురకం యజమాని, యజమాను రాలూ రావడం నచ్చలేదు కాబోలు వీడెవడో, ముఖం చిట్లించుకుంటాడు అనుకొని, ఎవరో తెలియక నేనూ ఊరు కున్నాను. మేము సామానుదింపి, వరండాలో సర్దుతూవుంటే,

వాడు చూస్తూ వూరుకున్నాడు. తరువాత అడిగితే చెప్పాడు, తాను ఈ బంగళా కనిపెట్టుకువుండే నౌకర్నని, కొత్తగా చేరానని. నాకు చిరాకేసింది. "అలా నుంచుంటావేం? ఆ సామానంతా తీసి లోపలపెట్టు" అని అదమాయించాను. వాడు వినపడనట్లు ఊరుకున్నాడు. నేను లోపలికివెళ్ళి ఇల్లు నాలుగుమూలలా చూసుకుని కొన్నిసామాన్లు సర్దుకున్నాను. వంటఇల్లు బాగుచేసుకుని, పొయ్యి అంటించాను. అప్పటికి ఆయనచేత యింకొకసారి చెప్పించుకుని వాడు, విధిలేక సామాన్లు కొన్ని విప్పి సర్దాడు.

మర్నాటినుంచీ మా ఇద్దరి మధ్యా యుద్ధం ప్రారంభమైంది. మొదట్లో కొద్దికొద్దిగా సాగి చివరకు పెద్దదైంది. ఇద్దరి మనస్సులకూ నిష్కారణంగా బాధ కలిగింది. ఆయన ఇంట్లో ఎప్పుడూ ఉండరు. పొద్దున ఏడుగంటలకు వెడితే సాయంత్రం ఏడు గంటలకు వస్తారు. మధ్యలో ఓగంట భోజనానికిమాత్రం వచ్చి వెడతారు. అంచేత ఇంట్లో ఏం జరుగుతున్నదీ ఆయనకు సామాన్యంగా తెలియదు. ఎప్పుడోగాని నేను చెప్పను. ఆయనకు కోపం ఎక్కువ. తొందర ఎక్కువ; ముందాలోచన ఉండదు. నారాయణను గురించి ఏ క్షణంలో నేను ఆయనతో చెపితే, మరుక్షణంలో వాడి ఉద్యోగం ఊడిపోతుంది. అది నాకు తెలుసు. అందుకనే చాలారోజులు నారాయణ ఎంత మొరటుగా ప్రవర్తించినా నేను ఆయనకు చెప్పలేదు.

రెండవ రోజు ఉదయమే ఆయన ఆఫీసుకు వెళ్ళిపోయారు. చాలాసేపు నారాయణ గిన్నెలు తోమి, గదులు

ఊడుస్తాడని ఎదురు చూస్తూ నేను కూర్చున్నాను. వాకిట్లో చింతచెట్టు క్రింద చాప పరుచుకుని దిక్కులు చూస్తూ, వాడు కూర్చున్నాడు. చివరకు పిలిచి చెప్పాను, ఈ పని చెయ్యాలని. వాడు ముఖం మాడ్చుకున్నాడు. మాట్లాడ లేదు. పని చెయ్యలేదు. మళ్ళీ ఒకసారి పిలిచి గట్టిగా చెప్పాను. ఈసారి ధైర్యం తెచ్చుకుని తన అభిప్రాయం చెప్పాడు: "మేముబాగా బతికిన వాళ్ళమండీ! ఇలాంటి పనులు చెయ్యం" అన్నాడు. నేను తెల్లపోయాను. వాడితో వాదించలేక ఆ పూటకి నేనే చేసుకున్నాను. క్రమంగా, తెలుసుకున్నాను. వాడు ఇష్టంగా బుద్ధిపూర్వకంగా చేసే పని ఒక్కటిలేదని. వాడు మంచి కుటుంబంలో పుట్టాడు. వాడి తండ్రి తాతలు ఒకప్పుడు మడిమాన్యాలున్నవాళ్ళే. ఇప్పుడు చితికిపోయ్యారు. అందుకని వాడు నౌకరీకి, విధిలేక వచ్చాడు. కాని, అంతస్తుకు తగని పనిమాత్రం వాడు ఆరునూరైనా చెయ్యడు. ఇది వాడి నిశ్చితాభిప్రాయం.

కాని, వాడి అంతస్తు ఏమిటో దానికి తగ్గపనేదో వాడికే తెలియదు. నాకూ తెలియదు. నౌకర్ని ఎదురుగుండా వుంచుకుని, వాడికి కూడా వండిపెడుతూ రోజూ అంతపనీ నేనే చేసుకోవడం నా సహనానికి మించినదైంది. మొదట్లో నెమ్మదిగా చెప్పాను. ఒకనౌకరీ ఒప్పుకుని వచ్చాక దానిలో సాధక బాధకాలను ఓర్పుతో పని చక్కగా చెయ్యాలని వాడి తలకెక్కలేదు.

ఓ రోజు వాడితో మంచిగా మాట్లాడి, వాడి కుటుంబ విషయాలు కనుక్కున్నాను. వాడిది ఈ ఊరుకాదు. ఎక్కడో

నెల్లూరు దగ్గర. ఊళ్లో, వాడికి పెళ్ళాం ఒక ఆడపిల్ల మాత్రం ఉన్నారు. ఇంకెవరూ లేరు. ఆ ఊళ్లో వాడికి తిండికి జరగలేదు. సంపాదించడం లేదని భార్య రోజూ సాధించేది. ఆ పోరు పడలేక ఓ రోజు చెప్పకుండా పారిపోయి, ఈ ఊరు వచ్చాడు, ఇక్కడ, అక్కడక్కడా తిరగ్గా చివరకు ఈ నౌకరీ దొరికింది. వాడు ఈ ఊరువచ్చి ఆరునెలలైంది. వచ్చినప్పటినుంచీ ఇంటికి ఉత్తరం రాయలేదు. భార్యమీద కోపం. బాగా సంపాదించిన తరువాతగాని ఇంటికి పోగూడదు. ఉత్తరం రాయకూడదు అని మొండి పట్టుదల. ప్రతి నెలా జీతం జాగ్రత్తగా దాచేవాడు. ఉండి, ఉండి పిల్లని తలుచుకుని దిగులుపడేవాడు. కాని ఉత్తరం మాత్రం రాసేవాడు కాదు.

నాకు వాడినిచూసి జాలేసింది. వాడి మొండితనం మాత్రం నచ్చలేదు. "బాగా సంపాదించాలని పట్టుదలకల వాడికి ఈ మొరటుతనం పనికిరాదు. ఆపని చెయ్యనూ, ఇది చెయ్యనూ, అన్న దురభిమానం పనికిరాదు" అని నెమ్మదిగా బోధించి చెప్పాను. వాడి చెవికెక్కలేదు. "ఇల్లు ఊడవడం, గిన్నెలు తోమడం యిల్లాంటి పనులుమాత్రం నేను చచ్చినా చెయ్యనండీ! ఉద్యోగం పోయినాసరే, మా ఊరివాళ్ళవరైనా చూస్తే నవ్వుతారు" అన్నాడు, మొండిగా. నాకు కోపం ఆగలేదు "ఏమిటీ పిచ్చి అభిమానం! నువ్వు చెయ్యకపోతే ఆఫీసరుగారి భార్యను నేను చెయ్యవచ్చునా?" అన్నాను వ్యంగ్యంగా తరువాత గట్టిగా కేకలువేశాను.

వాడు మొహం మాడ్చుకొన్నాడు. రెండురోజులు భోజనం మానేశాడు. నేను ఆయనతో చెప్పి, ఉద్యోగం

లోనుంచి తీసివేయిస్తానేమో అనుకున్నాడు. భయపడి దిగులుపడ్డాడు. పనిమాత్రం చెయ్యలేదు. వాడిపోయిన వాడి ముఖం చూస్తే నాకు జాలేసింది. వాడి పట్టుదలచూస్తే విసుగొచ్చింది.

ఆ తరువాత వాడిష్టపడి చేసిన పనులే చేయించుకుంటూ కొన్నాళ్లు ఓపికతో గడిపాను. ఓరోజు మధ్యాహ్నం పెట్టెలు సర్దుతూవుంటే, అడుగున కొన్నతరువాత ఒక్కసారైనా వాడని ఇస్త్రీపెట్టె కనిపించింది. అది చూడగానే, నారాయణకు ఈపని నేర్పితే ఇదైనా చేస్తాడేమోననిపించింది. ఉత్సాహంతో అది బయటికితీసి వాడిని పిలిచి బట్టలు ఇస్త్రీ చెయ్యమని చెప్పాను. వాడు ఆపెట్టెను తను ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదనీ తనకు చేతకాదనీ అన్నాడు. నేను ఉత్సాహంగా "ఏం ఫరవాలేదు, నేను నేర్పుతాలే; చెయ్యి" అన్నాను. వాడు మొండిగా "నాకు చాతకాదు నేను చెయ్యను" అన్నాడు. నాకు ఒళ్ళు మండిపోయింది. కోపం ఆగలేదు "ఇంత పొగరు మోతుతనం పనికిరాదు. ఇవ్వాల్టితో

కున్నాను. ఏమీలేదు. వెళ్ళిపోతావంటే పెళ్ళాం పిల్లను తలచుకుని నాకే జాలేసింది. కాని, వాడి మొండితనంచూసి ఏమీ అనడానికి బుద్ధిపుట్టలేదు.

ఆ వేళే వాడికో ఉత్తరం వచ్చింది. అది ఇచ్చాను. వాడు మళ్లా నాకే ఇచ్చి నన్నే చదవమన్నాడు. అది వాడి పెళ్లాం రాసింది.

“నీవు నాతో కొట్లాడి పిల్లదాని చేతి బంగారుగాజు లాక్కొని చెప్పకుండా పోయి ఆరునెలలైంది. ఇంతవరకూ జాబులేదు. నీవు పోయినాక పిల్లది శానాసేపు ఏడ్చింది. పసిదాని చేతిగాజు లాగడానికి నీ కెట్లా బుద్ధిపుట్టింది? మొన్న, సుబ్బయ్య బెజవాడలో నిన్ను చూశానని చెప్పి అడ్రసు ఇచ్చాడు. పిల్లది బెంగపడుతున్నది. సంపాదించకపోతే ఫరవాలేదు. ఉత్తరం చూచిన తక్షణం బయలుదేరి రావాలి.”

అదే ఉత్తరం. చదివి తలెత్తి చూశాను. నారాయణ రెండు కళ్ళ వెంబడి నీళ్ళు కారుతున్నాయి. నాకు చాలా బాధ అనిపించింది. కాని, వాడు అడగందే నేను ఉండమని అనలేకపోయాను. “మీ ఊరు వెళతావా?” అన్నాను. “లేదమ్మగారు! నేను బాగా డబ్బు సంపాదించేవరకూ మా ఊరుపోను” అన్నాడు. మళ్ళా తనలో తాను గొణుక్కుంటు న్నట్లు కళ్ళుతుడుచుకుంటూ అన్నాడు“పిల్లదానిచేతి బంగారు గాజు మళ్ళా కోనేదాకాపోను” అని అంటూ వాడు వెళ్ళి పోయాడు. మళ్ళా కనబడలేదు.

ఆ వేళంతా వాడిని గురించే ఆలోచిస్తూ ఉండిపోయాను. ఉద్యోగం పోగొట్టుకొని వాడేం బాధపడతాడో, తిండిలేక

వాడి పెళ్ళాం ఎంత బాధపడుతున్నదో అనుకున్నాను. వాడి అన్నం నేను తీసివేశానని బాధ కలిగింది. నాది పొరపాటేమో ననిపించింది. వాడిని కేకలువేయడానికి, అవమానించడానికి నాకేమి అధికారం ఉన్నది. వాడి కిష్టంలేని పనే వాడిచేత చేయించాలని పట్టుబట్టడం నాదిమాత్రం దురభిమానం కాదా అనిపించింది మాటిమాటికి. ఎప్పుడో విన్న,

"అవజానన్తి మాం మూఢా మానుషీం
తనుమాశ్రితమ్"
అన్న గీతా వాక్యము,
"ఘట్ ఘట్ మే ఓ సాయి రమతా
కటుక్ పచన్ మత్ బోలురే"

అన్న కబీర్ వచనము పదేపదే జ్ఞాపకంవచ్చి ఏదో తప్పుచేసి నట్లు బాధకలిగింది. వాడిని అవమానించటానికీ, శిక్షించడానికీ నాకు అధికారం ఉన్నదా? రెండు రోజులు ఏదో మనసులో ముల్లు గుచ్చుకున్నట్లైంది. ఏమీ తోచలేదు.

పన్నెండేళ్ళ తరువాత, మళ్లా ఇవ్వాళ కనిపించాడు. అప్పుడు నౌకరీ తీసివేయించానన్న కోపంతో వీడు నామీద కసితీర్చుకోడుకదా!

ఆలోచన తెగకముందే వాడు ఒక ఇంటిముందు రిక్షా ఆపి నంబరు చెప్పమన్నాడు. తరువాత ఇదే యిల్లు దిగ మన్నాడు. నాకు ప్రాణం లేచివచ్చింది. వాడు ఎక్కడా పడవెయ్యకుండా సురక్షితంగా ఇల్లు చేర్చినందుకు సంతో షిస్తూ, దిగి డబ్బులివ్వబోయాను. వాడు చేయిజాపబోయి మళ్ళా వెనక్కి లాక్కొని, "వద్దులెండమ్మగారూ ఫరవాలేదు"

అన్నాడు. నేను బలవంతంచేసి లాభంలేకపోయింది. ఇంతలో తలుపులు తెరచి మావాళ్ళు బయటికివచ్చారు. నారాయణ వెళ్ళబోతూవుంటే అడిగాను "నీపెళ్లాం పిల్ల బాగున్నారా?" అన్నా. వాడు నవ్వుతో: "ఇక్కడే వున్నారమ్మగారు. రేపు తీసుకొచ్చి చూపిస్తాను. ఇప్పుడు ముగ్గురు మగపిల్లకాయలు." అంటూ కొద్దిగా గర్వంతో నవ్వుతూ వెళ్ళిపోయాడు.

మర్నాడు మధ్యాహ్నం మాటప్రకారం భార్యనూ పిల్లల్నూ తీసుకువచ్చాడు. వాడి భార్య బలంగా ఆరోగ్యంగా ఉన్నది. ముగ్గురు మగపిల్లలు, చిన్నచిన్నవాళ్ళు. "అమ్మాయేదీ" అన్నాను. నారాయణ సిగ్గుపడుతూ చెప్పాడు: "పిల్లదానికి పెళ్ళిజేశానమ్మగారు. అత్తారింటికాడున్నది. "ఆవేళ పోవడం పోవడం ఈఊరు వచ్చానమ్మగారు. చాలా కష్టపడ్డాను. కొన్నాళ్లు రిక్షాలు లాగాను. ఇప్పుడు ఫరవా లేదమ్మగారు. రెండు మూడు రిక్షాలుకొని అద్దెకిస్తున్నాను. నిన్నరాత్రి ఊరికే సరదాకు రిక్షాతీసుకు స్టేషన్‌కాడికొచ్చాను. తమరు కనిపించారు" అన్నాడు సవినయంగా. కొత్తగావచ్చిన ఆ వినయానికి నేను సంతోషించాను. "ఐతే డబ్బుసంపాదించాకే పెళ్లాన్ని చూస్తానన్న పట్టునెగ్గించుకున్నావన్నమాట!" అన్నాను నవ్వుతూ. వాడూ నవ్వాడు. వాళ్లు వెళ్ళబోతుంటే వాడి పెళ్ళానికొక రవికగుడ్డా, పిల్లలకు పళ్లూ ఇచ్చాను. అవి అందుకుని నారాయణ వినయంగా నమస్కారంచేసి వెళ్ళాడు.

నాకు ఆశ్చర్యం వేసింది. ఏమీ లేనప్పుడు ఆ అహంభావం. అన్నీ వున్నప్పుడు ఈ అణకువ! మంచిదేననుకున్నాను. ఎప్పుడో గుచ్చుకొన్న ముల్లు ఇవ్వాళ ఊడిపోయింది.

అన్వేషణ

ఆవేళంతా మబ్బు మబ్బుగానే ఉంది. చినుకు పడుతుందేమోనని భ్రమ, ఆశ. కాని సాయంత్రందాకా మబ్బులు ఊరికే ఊరిస్తూనేఉన్నాయి. ఆకైనా కదలలేదు. ఎండ తళుకు లేక రోజంతా చల్లగా సాగింది.

శంకరరావుకు అలా మబ్బుగా చల్లగా ఉంటే ఎంతో ఆనందం. ఏ కొండప్రదేశంలోనో మబ్బుల్లో విహరిస్తున్నట్లు ఊహించుకోవచ్చు.

సాయంత్రం అయిదింటికే కొట్టు వదిలేసి బయలుదేరాడు. ఆరోజు అసలు కొట్లో ఏమీ సందడిగాలేదు. ఎవరోవచ్చి సరదాగా కాస్సేపు షాపంతాచూసి పోయ్యేవాళ్ళు; అంతే. వ్యాపారమేమి జరుగలేదు. అది మామూలే. ఒక్కోరోజు ఉన్నగుమాస్తాలంతా చాలరు; అతనుకూడా వెళ్ళి చూడాలి. ఒక్కోరోజు అందరూ, ఊరికే, కొనేవారికోసం ఎదురుచూస్తూ కూర్చోవాలి. ఎలాగైనా అతనికి రోజంతా షాపులోనే గడపటం అలవాటైంది.

రోజూ ప్రొద్దునే శుభ్రంగా స్నానంచేసి తయారై ఎనిమిది గంటలకల్లా వెళ్ళడం; మళ్ళా పన్నిండింటికి తిరిగి రావడం; మళ్లా సాయంత్రం మూడింటికి వెడితే ఏడింటివరకూ కూర్చోడం ఇది మామూలు. సాధారణంగా ఏడింటి తరువాత ఏంచెయ్యాలో అతనికి తోచేదికాదు. కొంచంసేపు కారులో

పార్కు దగ్గర తిరిగి, ఇంటికి పోతుండేవాడు. భోంచేసి ప్రొద్దున పత్రికే మళ్లా ఇంకోసారి తిరిగేసేలోపున అతనికి నిద్రవచ్చేది; అంతే రోజు గడిచిపోయినట్లే.

అసలు రోజెట్లాగడుస్తుందా అన్నది అతనికెప్పుడూ ఒక సమస్యగా లేదు. పగలంతా ఎట్లాగూ షాపులో గడిచి పోతుంది. రాత్రి ఇంటికి చేరుకొనేప్పటికి నిద్ర కనిపెట్టుకొని ఉంటుంది. అంతే. అతనికి వార్తాపత్రికతప్ప ఇంకేదీ చదవడం అలవాటులేదు. కాలక్షేపానికేదైనా చదువుకోవచ్చునని అతని కెప్పుడూ తట్టలేదు.

ఇరవయ్యేళ్ళ క్రిందట ఈఊరు వచ్చినప్పుడు అతనికి చదువులేదు; డబ్బులేదు; ఇల్లులేదు. అన్నీ తనఊళ్ళోనే వది లేసి కట్టుబట్టలతో వచ్చాడు. అతను పుట్టినఊళ్ళో చదువు స్కూల్ ఫైనల్ వరకేవుంది. అంతవరకే చదువు వచ్చింది. చిన్నప్పుడే తల్లితండ్రులుపోగా, పెంచిన మేనమామ పొరు గూరు పంపి చదివించడానికి డబ్బులేదన్నాడు. అంతవరకు చదివించిన దానికికూడా ఆరువేలు అప్పు చూపించాడు. ఏవూరైనా వెళ్ళి పురుషలక్షణమైన ఉద్యోగానికి ప్రయత్నం చెయ్యమన్నాడు. కావాలిస్తే, తనదగ్గర చిన్నప్పుడు చదువు కొని ప్రస్తుతం పట్నంలో ఉద్యోగస్తులుగా, వ్యాపారస్తు లుగా ఉన్నవారికి కొందరికి ఉత్తరాలిస్తానని ఒకటి రెండు కాగితాలు చేతికిచ్చాడు; అంతే అంతటితో ఆయన బాధ్యత వదుల్చుకున్నాడు. శంకరరావు తనకున్న ఒక్క ఇల్లు అప్పుకు కట్టి పట్నం చేరుకున్నాడు.

మేనమామ ఉత్తరాలిచ్చిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకాయన

పేరు వెంకయ్యగారు. ఆయన బట్టలవ్యాపారస్థుడు. శంకరరావు సరిగా ఉత్తరంతో ప్రత్యక్షమైన సమయంలోనే ఆయన ఒక నమ్మకమైన మనిషికోసం ఎదురుచూస్తున్నాడు తనఊరివాడు, తన పంతులుగారి మేనల్లుడు అన్న నమ్మకంతో ఆయన వెంటనే శంకరరావును తన షాపులో ఉంచుకొన్నాడు. క్రమ క్రమంగా వ్యాపార భారమంతా శంకరరావుకే అప్పగించాడు. శంకరరావు వ్యాపారంలోని కిటుకులన్నీ తెలుసుకున్నాడు. జాగ్రత్తగా గడుపుకుంటూ ఎనిమిదేళ్ళలో ఎనిమిది వేలు దాచుకున్నాడు. అంతలో అనుకోకుండా వెంకయ్యగారికి వ్యాపారంలో నష్టంవచ్చింది. ఆయన కొట్టు అమ్మేశారు. ఎనిమిదివేల రూపాయల సరుకు మాత్రం కొనుక్కొని, శంకరరావు చిన్న కొట్టు సొంతంగా పెట్టాడు. అదృష్టం తిరిగి క్రమంగా చిన్నకొట్టే పెద్దదయింది. బ్యాంకులో ధనం నిలిచింది. శంకరరావు జీవితం బాహ్యంగా మారింది. కారు, ఇల్లు, వంటవాడు—అన్నీ వాటంతటవే అమరాయి. అతని వ్యక్తిత్వంలో మాత్రం మార్పురాలేదు.

ఆ వేళ సాయంత్రం అయిదింటికే కొట్టువదలి బయలుదేరాడు. కారు టౌనుహాలు దాటుతూ ఉండగా డ్రైవరు "ఏ వేపు వెళ్ళమంటారు?" అని అడిగాడు. శంకరరావు ఒక్కక్షణం ఆలోచించాడు. ఆ వేళ వర్తకసంఘం భవనంలో ఏదో సభ ఉంది. ఎవరో స్వామిజీ మాట్లాడుతున్నారట. తనదగ్గరకు చందాకోసం వచ్చినవాళ్లు ఆహ్వానం ఇచ్చి, మరీమరీ చెప్పారు– తప్పకుండా రండి. స్వామిజీ అద్భుతంగా మాట్లాడుతారు; వినితీరాలి" అని. కాని, ఇప్పుడతనికి వెళ్ళా

లనిపించలేదు. అసలతనికి ఎప్పుడూ ఎక్కడికీ వెళ్ళాలనిపించదు. ఒక్క క్షణం ఆగి "మామూలుగా పార్కుకేసే వెళ్ళనీ" అన్నాడు.

ఆ పార్కు అంతా చుట్టి తిరిగితే ఒక మైలవుతుంది. నిదానంగా వచ్చేపోయ్యేవాళ్ళని చూస్తూ, ఎరిగున్నవాళ్ళని పలకరిస్తూ శంకరరావు రోజూ అక్కడ ఓ గంట కాలక్షేపం చేస్తాడు. అతనికి అక్కడ తోటవాళ్ళంతా కూడా తెలుసు. అందరినీ పలకరించి వారి గొడవలు విచారిస్తుంటాడు. ఆ వేళ పార్కులో ఎక్కువ జనం లేరు. మబ్బుగా ఉందని ఎవరూ రాలేదు. శంకరరావు ఒక బెంచిమీద కూర్చున్నాడు. పెద్ద తోటమాలి వచ్చి పలకరించాడు:

"ఇవ్వాళ బాబుగారు త్వరగా వచ్చారే" అన్నాడు.

శంకరరావు చిరునవ్వు నవ్వాడు. "చల్లగా ఉంది గదా!" అన్నాడు.

"అవునండీ! వర్షం పడితే బాగుండును. చెట్లు ఎండకి మాడిపోతున్నాయి" అన్నాడు తోటమాలి.

"ఏమో, రాత్రికి పడుతుందేమో! అన్నట్టు, మీ పెద్దబ్బాయి పరీక్ష తెలిసిందా?" అన్నాడు శంకరరావు.

"ఇంకా లేదండి. ప్యాసై పోతాడు లెండి" అని నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు తోటమాలి.

"మంచిదే" అంటూ లేచాడు శంకరరావు. అణాలు కూడబెట్టి, తోటమాలి కొడుక్కి చదువు చెప్పిస్తున్నాడని శంకరరావుకు చాల సంతోషం.

కారు దగ్గరికి వచ్చి టైము చూసుకుంటే ఆరే అయింది.

ఇంకో రెండు గంటలు ఎలా గడపాలో తెలియలేదు. "సరే, సభకు వెళదా మ"నుకొన్నాడు. అతను వెళ్లేసరికి ఉపన్యాసం ముగింపుకు వస్తోంది. హాలునిండా జనం మంత్రముగ్ధుల్లా చలనంలేకుండా వింటున్నారు. తను ఎవరికీ కనపడకుండా ఏదో ఒక మూల కాస్సేపుండి వెళ్ళిపోదామనుకున్నాడు. కాని, కార్యదర్శి దూరాన్నించి చూసి, గుర్తుపట్టాడు. హడావిడిగా వచ్చి, ముందుకు తీసుకువెళ్ళాడు. అక్కడ చోటులేదు. ఒక కుర్చీ ప్రత్యేకంగా తెప్పించి వేయించాడు. జనం అంతా ఒక్కక్షణం ఉపన్యాసం మాట మరచిపోయి, ఈ హడావిడి ఏమిటా అని చూశారు. స్వామీజీ ఒక్కక్షణం ఉపన్యాసం ఆపేసి, శంకరరావుకేసి చూశారు. అతను సిగ్గుతో క్రుంగి పోయాడు. చేసేదిలేక, సర్దుకు కూర్చున్నాడు. స్వామిజీ ఏమీ జరగనట్లే మళ్లా, ఉపన్యాసం ప్రారంభించారు.

"కాబట్టి మీరు క్రమక్రమంగా క్షణికమైన యీ భౌతికవస్తువులమీద మమకారం వదలి, మీ పవిత్రమైన ప్రేమను నాశరహితమై పవిత్రమైన పరమాత్మునియందే లగ్నంచేయ్యటం నేర్చుకోవాలి. అప్పుడే నిజంగా శాంతి సుఖమూ లభిస్తాయి. అంతవరకు అసంతృప్తి దుఃఖమూ తప్పవు. ఏదో ఒక వస్తువుమీద, ఒక వ్యక్తిమీద, మాత్రమే లగ్నమై ఉన్నంతవరకూ మీ ప్రేమకు పరిపూర్ణత్వం సిద్ధించదు. ఎప్పుడో ఒకప్పుడు ఆ అనురాగం వ్యర్థమని స్ఫురించక తప్పదు. అమృతరూపుడు, ఆనందమూర్తి ఐన భగవంతుని యందు లగ్నమైనప్పుడు మాత్రమే ప్రేమ పవిత్రము, పరిపూర్ణము శాంతిదాయకము అవుతుంది. అది ఎప్పుడూ

సఫలమే అవుతుంది. అంతే, నేను ఇవ్వాళ చెప్పదలచు కొన్నది,''అని ముగించారు. 'ఓమ్'అంటూ అందరూ లేచారు.

కార్యదర్శి శంకరరావును స్వామీజీకి పరిచయం చేస్తానన్నాడు. అతను వద్దని వచ్చేశాడు. కారులో అతను స్వామీజీ మాటలు మననంచేసుకోసాగాడు. అతనికి చిన్నప్పటినుంచీ ఎక్కువ భగవద్భక్తి లేదు. అతనిబుద్ధి ఎందుకో అటువేపు మళ్ళదు. కష్టపడి పనిచెయ్యటం, బ్రతుకు తెరువు చూచుకోడం, ముక్కుసూటిగా వెడుతూ, మంచేదో చెడేదో తోచినట్లు నిర్ణయించుకొని మనస్సు ప్రశాంతంగా ఉంచుకొనటం, అంతకన్న అతనికి వేరే ఆలోచనలు లేవు. ఇవ్వాళ ఈ స్వామీజీ అతనిని తట్టి, లేపి "భగవంతుడు ఒకడున్నాడు సుమా; అది మరచిపోయినావా!" అని జ్ఞాపకంచేసినట్లయింది. కాని ఆలోచించగా అతనికి స్వామీజీ మాటలు యదార్థంగా తోచలేదు. ఒకవ్యక్తిని ప్రేమించినప్పుడు ఆ వ్యక్తి మనల్ని తిరిగి ప్రేమించాలన్న కోరిక సహజంగా కలుగుతుంది. ఆవ్యక్తి మనయందు కొంత ఆసక్తి, అనురాగం చూపించినప్పుడే మనహృదయంలో ప్రేమ వికాసం పొందుతుంది. లేకపోతే క్రమంగా నశించిపోతుంది. అవ్యక్తమైన మూర్తిని ప్రేమించినప్పుడు ఆమూర్తి మనలను ప్రేమిస్తున్నట్లు అనుభవం ఎట్లా కలుగుతుంది? అది అతనికి అర్థం కాలేదు.

ఇంటికి వెళ్ళి, స్నానంచేసి, భోంచేసి, పడుకున్నాడు. అపురూపంగా ఆవేళ జీవితంలో మొట్టమొదటిసారిగా అతనికి నిద్ర పట్టలేదు. సాధారణంగా పత్రికతీసి చదివినవార్తలే మళ్ళీ

చూసే లోపల అతనికి నిద్రవచ్చేస్తుంది. ఆవేళ ఎంత ప్రయత్నించినా నిద్రపట్టలేదు. ఊరికే మణిమేఖల గుర్తువచ్చింది. కన్నులు మూసినా తెరచినా ఆమె రూపమే నాట్యమాడింది. ఆమె అతని జీవితంలో అడుగుపెట్టి ఆరు నెలలైంది. ఆమె తల్లి పార్వతమ్మ ఆ ఊళ్ళో స్త్రీల పాఠశాల ప్రధానాధ్యాపకురాలు. పుట్టినప్పటినుంచి అరవదేశంలో ఉండడంచేత వాళ్ళింట్లో అరవభాష, అరవ నాగరకత ఎక్కువ. అందుకే ఆమె కూతురికి మణిమేఖల అని పేరు పెట్టింది.

పార్వతమ్మ చిన్నప్పుడు భర్తతో ఏ కొద్ది రోజులు కాపరం చేసిందో ఆమెకు గుర్తులేదు. మణిమేఖల పసిపిల్లగా ఉండగా అతను పైచదువుకోసం అమెరికా వెళ్లాడు. అంతే. అంతటితో అతను ఆమె జీవితంలోనించి నిష్క్రమించాడు. అమెరికా వెళ్ళినతను తిరిగి రానూలేదు. ఈమెను రమ్మననూ లేదు. కొన్నాళ్ళకి వ్రాసిన ఉత్తరాలకు జవాబూ లేదు. సహజంగా ధైర్యం కలది కాబట్టి పార్వతమ్మ తండ్రి ప్రోద్బలంతో చదువుకొని అధ్యాపకురాలైంది. ఆ తరువాత ఆవిడ జీవితం ఉద్యోగం, డబ్బు, కూతురు వీటితోనే పెనవేసుకున్నది. ధనమూ, దర్జా వీటిమీద ఆమెకు విపరీతమైన మోహం. ఆవిడ జీవితంలో ఇంక దేనికీ స్థానంలేదు.

ఓ ఏడాదిగా ఆవిడ బట్టలు శంకరరావు కొట్లోతప్ప ఎక్కడా కొనడంలేదు. అక్కడే వాళ్ళకు ఖాతా. ఆఖాతాకు సంబంధించిన డబ్బు ఇవ్వమని ఎప్పుడూ శంకరరావు అడగనూ లేదు ఆమె ఇవ్వనూలేదు. కొట్టుకు వచ్చినప్పుడల్లా పార్వతమ్మ శంకరరావుతో ఏవో కబుర్లు చెపుతుండేది. క్రమంగా, అతన్ని

ఓ రోజు వాళ్ళింటికి రమ్మని పిలిచింది. ఆ తరువాత ఆరు నెలలుగా ఇప్పుడతనికి రోజూ వాళ్ళింటికి వెళ్ళి కాస్సేపు కబుర్లు చెబుతూ ఉండడం ఒక అలవాటయింది. సాధారణంగా, పార్కునుంచి వాళ్ళింటికి వెళ్ళుతుంటాడు.

పార్వతమ్మ, మణిమేఖల అతనితో సరదాగా మాట్లాడు తుంటారు. బాగా పరిచయం అయ్యాక ఓ రోజు పార్వతమ్మ అడిగింది :

"మీకింకా పెళ్ళికాలేదేమీ? తగిన పిల్ల దొరకలేదా? పోనీ మా మణిమేఖలను చేసుకుంటారా ?" అని.

ఆమాటకు అతను ఉలిక్కిపడ్డాడు. అతని జీవితంలో అంతవరకు వివాహప్రస్తావన ఎప్పుడూ రాలేదు. మేనమామ పట్టించుకోలేదు. అతనూ ప్రయత్నించలేదు.

మణిమేఖల అందంగా, గాజుబొమ్మలా వుంటుంది. చెంపకు చారడేసిఉన్న ఆమె నల్లనికన్నులలో ఎప్పుడూ అమాయకత్వం తొణికిసలాడుతుంటుంది. ఆపిల్ల మాటలు, చేష్టలు ఆమెకింకా పసితనం వదల్లేదని వ్యక్తంచేస్తుంటాయి. అమాయకత్వం, అందం మూర్తీభవించిన ఆ పిల్లను పార్వతమ్మ "మీరు చేసుకుంటారా" అంటే, అతని ఆశ్చర్యానికి అంతులేదు. ఒక్కసారి తన్ను తాను మరచిపోయి భ్రాంతిలో పడ్డాడు. తనకూ మణిమేఖలకూ ఉన్న వయస్సు తేడా తారతమ్యం అన్నీ మరచిపోయినాడు. పార్వతమ్మ మణిమేఖల అంగీకారంతోనే తనను అడిగివుంటుందనుకున్నాడు. స్వప్న సౌధాలు నిర్మించుకున్నాడు. ఆరోజునుంచి అతని మనస్సుకు శాంతిలేదు. అతని హృదయం అనేకమైన మధురభావాలలో

ఊగిసలాడింది. మణిమేఖల అమాయకపు చేష్టలన్నింటిలో అతనికి అనురాగమే వ్యక్తమైంది.

ఇవ్వాళ, ఆ మోహం మరీ విపరీతమైంది. తెల్లవారగానే పార్వతమ్మ ఇంటికి వెళ్ళాలనుకున్నాడు. ఆవిడకి చెప్పి త్వరలోనే వివాహం స్థిరపరచుకోవాలనుకున్నాడు. మణిమేఖల తనఇంట్లో తిరుగుతూవుంటే, ఎంతబాగుంటుంది! ఈ మధురమైన ఊహతో అతనికి నిద్రపట్టింది.

ఆవేళ ఆదివారం పార్వతమ్మ తీరికగానేవుంది. మణిమేఖలమాత్రం కనపడలేదు. వెళ్ళిన కాసేపటికి శంకరరావు అన్నాడు:

"మణిమేఖలను సాకిస్తానన్నారుగదా! పెళ్ళి ఏర్పాట్లు త్వరలోనే చేసుకుందాము" అని.

చాలాసేపటివరకు పార్వతమ్మ మాట్లాడలేదు. తరువాత తాపీగా అన్నది:

"ఆ! అప్పుడేదో అన్నాను. కాని మాపిల్ల ఒప్పుకోవటంలేదు. ఎవరో ఇంజనీరుట! అతన్ని చేసుకుంటానంటోంది. అతనికి నెలకు రెండువేలు జీతం. ఈరోజుల్లో వ్యాపారాలకంటే, నెలజీతాలే నయం. పాపం మీకొట్లో అందరికి ఖాతాలేట! ఎవరూ డబ్బు ఇవ్వరట! మీ వ్యాపారం ఇంక ఎక్కువరోజులు నిలువదేమో నన్నాడు మీ గుమాస్తా! మీతో ఏం సుఖపడుతుంది!" అన్నది.

శంకరరావు నెవరో కొరడాతోకొట్టి వెక్కిరించినట్లయింది. ప్రతిమలా కూర్చుండిపోయాడు. కొంతసేపటికి తేరుకున్నాడు. ఈవిడ పిల్లనివ్వాలనుకున్నది తనకు కాదు;

తన వ్యాపారానికి, డబ్బుకు. ఎవరి ఆదాయం ఎక్కువైతే అదే మంచి సంబంధం! మణిమేఖల ఉద్దేశ్యంకూడా అంతేనా!_ అనుకున్నాడు మాట్లాడకుండా లేచి గుమ్మం దాటాడు. మెట్లు దిగుతూవుండగా మణిమేఖల ఎదురైంది. ఒయ్యారంగా ఒంగి నవ్వుతో నమస్కారం చేసింది. అతని గుండె చెరువైంది. భారంగా ఉద్వేగాన్ని అణచుకుంటూ అన్నాడు.

"ఎవరో ఇంజనీరును పెళ్ళి చేసుకోబోతున్నావట! శుభం" అన్నాడు.

మణిమేఖల తన పెద్దపెద్ద కళ్ళు ఇంకా పెద్దవిజేసుకొని వింతగా చూసింది.

"ఇంజనీరా! పెళ్ళా! ఎవరికి!" అన్నది.

శంకరరావుకు అంతా అయోమయం అయింది. పాపం నిజంగా ఈ పిల్లకేమీ తెలీదేమో! ఈ క్షణం దాటి పోతే మనస్సులో సందేహాలన్నీ అల్లాగే ఉండిపోతాయి. అందునుంచి ఒక్కఅడుగు ముందుకువేసి నెమ్మదిగా అడిగాడు. "చూడు; నన్ను పెళ్ళిచేసుకోడం నీకిష్టమేనా ?"అని. ఆమె ఇంకా తెల్లపోయి బెదిరిన లేడిలా చూసింది. మళ్ళా తనలో తాను ముడుచుకుపోయి బిక్కమొహం వేసుకుంది. "అసలు నాకు పెళ్ళిచేసుకోవాలనిలేదు. నేను డాక్టరు చదవాలి. అమ్మతో చెప్పాను" అన్నది అమాయకంగా సణుగుతూ. బాధతో అతను మెట్లు దిగిపోయాడు.

ఆరోజుతో శంకరరావు జీవితంలో ప్రశాంతి నశించింది. మనస్సులో ఏ ఆశలు, ఆలోచనలు లేనన్నాళ్లు మన్నుతిన్న

పాములా జీవితం ప్రశాంతంగానే గడచిపోతుంది. కాని ఏదో ఒక కోరిక, కల్పనమనస్సుని ఆవరించుకుని జీవితాన్ని పెనవేసుకున్నప్పుడు అది విఫలమైతే మిగిలేది కల్లోలమే. శాంతిలేదు. హాయిగా నిద్రపోతూన్నప్పుడు మధురమైన కల వస్తుంది. వెంటనే మెళుకువ వస్తుంది. ఆ కల మరపురాదు; మళ్ళా నిద్రరాదు.

ఆరు నెలల్లో పార్వతమ్మ కూతురు పెళ్ళిచేసింది. మణిమేఖల భర్తతో ఆ ఊరినించి వెళ్ళిపోయింది. శంకరరావు హృదయం మళ్ళా కుదుటబడలేదు. ఎన్నడూ ఎరుగని ఏదో వెలితి, ఆరాటము అతని జీవితాన్ని కమ్ముకున్నాయి. చెప్ప లేని ఒంటరితనం బాధించింది. ఈ జీవితయాత్ర ఎన్నాళ్ళా, దేనికోసం అనే నిరాశ ఆవహించింది. నిర్మలంగా ఉన్న నీటిలో ఒక మట్టిబెడ్డ విసరితే అంతా కల్లోల మవుతుంది. మళ్ళా సర్దుకోడానికి కొంతసేపు పడుతుంది. ఎంతసేపో భగవంతునికే తెలియాలి.

రోజులు గడిచేకొద్దీ శంకరరావుకు నిరాశా, అసంతృప్తీ ఎక్కువైనాయి. వ్యాపారంమీద కూడ ఉత్సాహం తగ్గి పోయింది. చూటిమాటికి అప్పుడెప్పుడో యథాలాపంగా విన్న స్వామీజీ మాటలు జ్ఞప్తికి రాసాగాయి. క్రమంగా ఆయన చెప్పినది నిజమేనేమో ననిపించింది. ఆయన్ను మళ్లా కలుసుకుంటె శాంతి లభిస్తుందేమోనని ఆశ కలిగింది. వర్తక సంఘం కార్యదర్శి దగ్గరకు వెళ్ళి అడిగాడు: "స్వామిజీ ఎక్కడ ఉంటారు? ఎల్లా కలుసుకోవచ్చు" అని, అతను నవ్వాడు.

"ఆయన ఎక్కడఉంటారని ఎట్లా చెప్పగలం. ఎక్కడో తిరుగుతూఉంటారు. మనకు కనిపించినప్పుడు నచ్చారనుకోవలసిందే" అన్నాడు.

మళ్ళా నిరాశ! మళ్ళా ఆవేదన! శంకరరావు భరించలేకపోయాడు. ఒకఊరేమిటి! అన్నిఊళ్లూ వెతికితే! ఎక్కడో ఒకచోట కలుసుకోవచ్చు! అంతే. ఆ ఆలోచనతో శంకరరావు తనకొట్టు అమ్మేశాడు. ఉన్నడబ్బంతా తీసుకున్నాడు. ఆవేళే రైలెక్కాడు.

ఒక్కసంవత్సరం పుణ్యక్షేత్రాలన్నీ తిరిగాడు. స్వామిజీ ఎక్కడా కనిపించలేదు. విసుగు చెందకుండా, వెళ్ళిన ఊళ్ళే మళ్ళీ వెళ్ళాడు.

ఆవేళ రాత్రి హరద్వారం వెడుతున్నాడు. అతను కూర్చున్న పెట్టె చాలపెద్దది. ఓమూల అతను కూర్చున్నాడు. మరోమూల ఎవరో కాషాయిగుడ్డ కప్పుకు పడుకున్నాడు. అంతే; ఇంకెవరూలేరు. ఆ పడుకున్నవ్యక్తి చలనం లేకుండా నిద్రపోతున్నాడు. శంకరరావుకు అతనెవరో తెలుసుకోవాలనిపించింది, కాని, అతని ముఖం కనపడలేదు.

తెల్లవారింది, స్టేషన్ వచ్చింది. శంకరరావు దిగి, తన సామాను దింపుకున్నాడు. ప్లాట్‌ఫారమ్ మీద చప్పుడుకు ఆ పడుకున్న వ్యక్తి లేచాడు. అతనూ దిగాడు. స్వామిజీ! శంకరరావు ఆనందానికి అంతులేదు. దగ్గరగావెళ్ళి నమస్కరించాడు. తడబడుతూ తనవిషయం చెప్పాడు. "మూడేళ్ళనించి మీకోసం వెతుకుతున్నాను. ఇన్నాళ్ళకి, మిమ్మల్ని కలుసుకోగలిగాను. ఆవేళ మీరు "అనురాగమంతా భగవం

తునికి అర్పణ చెయ్యాలన్నారు. అప్పుడు నాకు అర్థం కాలేదు. ఇప్పటికి కొద్దిగా తెలుస్తోంది" అన్నాడు.

స్వామీజీ చిరునవ్వు నవ్వారు. ఏమీ మాట్లాడలేదు. చేతితో సంచి ముందుకుజాపి, శంకరరావు, మళ్ళా అన్నాడు వినయంగా :

"ఇన్నాళ్ళ నుంచీ,ఇది మీ కివ్వాలని తిరుగుతున్నాను. నా ధనమంతా ఇందులోనే ఉంది. ఇది మీరు గ్రహించాలి" అని.

స్వామీజీ గట్టిగా నవ్వారు :

"నా కెందుకయ్యా ! నేను సమస్తమూ ఈశ్వరార్పణ చేసి భగవంతుని ప్రేమించాలని చెప్పాను గాని, నన్ను ప్రేమించమని చెప్పలేదే!" అన్నారు.

శంకరరావు తెల్లబోయాడు.

జనం గుంపులు గుంపులుగా వచ్చి స్వామిజీని చుట్టు కున్నారు. ఆ గుంపులో కలిసి స్వామిజీ మాయమయ్యారు. మళ్ళా కనబడలేదు. శంకరరావుకు ఏమీ తోచలేదు. చేతిలో సంచి చాలా భారంగా తోచింది. పెద్ద కూత వేస్తూ రైలు కదలిపోయింది. కాస్సేపటికి ప్లాట్‌ఫారమ్ మీద సందడంతా అణగిపోయింది. ఎటుచూచినా, ఏదో ప్రశాంతి మాత్రం మిగిలింది; అంతే.

శ్రీమతి ఆచంట శారదాదేవి కథలు నాకు వీణా గానాన్ని స్ఫురింపజేస్తాయి. అది అపస్వృతిలేని గానం; హెచ్చుస్థాయికి పోకుండానే ఎన్నెన్నో సంగతులను పలికించే గానం; యెద లోపలి యెదలో లేత కెరటాలను లేపుతూ దిక్చక్రాల కావలనుండే దివ్యలోకాల దిశలో పాఠకుని గొంపోయే గానం.

వీణాగానంలోని లాలిత్యంతో పాటు అప్రయత్న శిల్పసౌందర్యం ఆమె కథలలో గోచరిస్తుంది. అంతర్వీక్షణ ఆమె కథలలోని భావలాలిత్యానికి, శిల్పసౌందర్యానికి మూకసందేశ సౌరభాన్ని కూర్చుతున్నది.

ఆంధ్ర కళాసాహిత్యంలో శారదాదేవి కథలు ఉన్నత స్థానాన్ని అందుకోగలవని ఆశిస్తున్నాను.

విజయవాడ,
27-8-'60.

ఇట్లు,
నార్ల వెంకటేశ్వరరావు.

Wrapper Printed at Swatantra Art Printers, Vijayawada-4.